Rni Title Code No. TELTEL02115

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

సంపుటి : 1 సంచిక : 237 మేడ్చల్ మల్కాజ్‌గిరి 16 సెప్టెంబర్ 2023 శనివారం పేజీలు : 4

## 'జాహ్నవి' ఘటనపై భారత్ సీరియస్

న్యూఢిల్లీ : విద్యార్థిని జాహ్నవి కందుల రోడ్డు ప్రమాద ఘటనపై అమెరికా పోలీసు అధికారి చేసిన వ్యాఖ్యలు, ప్రవర్తించిన తీరు సర్వత్రా విస్మయం కలిగిస్తోంది. అటు అమెరికా ఇటు భారత్‌లో ఆగ్రహావేశాలు రగులుతున్నాయి. దీనిపై శాన్‌ఫ్రాన్సిస్కోలోని భారతీయ కాన్సులేట్ కార్యాలయం తీవ్రంగా స్పందించింది. దౌత్యాధికారి తరణ్‌జీత్ సింగ్ సంధూ ఈ విషయాన్ని వాషింగ్టన్ డీసీలోని సీనియర్ అధికారులు సహా సియాటెల్, వాషింగ్టన్ రాష్ట్ర అధికార యంత్రాంగం దృష్టికి తీసుకెళ్లారు. జాహ్నవి కేసుపై పోలీసుల దర్యాప్తు తీరుపై తీవ్ర అభ్యంతరం వ్యక్తంచేశారు. దీంతో స్పందించిన అధ్యక్షుడు బైడెన్ బృందంలోని సీనియర్ అధికారులు ఈ వ్యవహారాన్ని తీవ్రంగా పరిగణిస్తామని సంధూకు హామీ ఇచ్చారు.

# ఒకేసారి 9 మెడికల్ కాలేజీలు ప్రారంభం..

## సువర్ణాక్షరాలతో లిఖించదగ్గ ఘట్టం ఇది : సీఎం కేసీఆర్



హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్ర చరిత్రలో ఉజ్వలమైన దినం ఇది. ఒకే సారి 9 మెడికల్ కాలేజీలు ప్రారంభించుకోవడం.. సువర్ణ అక్షరాలతో లిఖించదగ్గ ఘట్టం అని ముఖ్యమంత్రి కేసీఆర్ పేర్కొన్నారు. ప్రగతి భవన్ నుంచి వర్చువల్ విధానంలో 9 మెడికల్ కాలేజీలను సీఎం కేసీఆర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఎం కేసీఆర్ ప్రసంగించారు. ఎన్నో కార్యక్రమాల్లో పాల్గొంటుంటాం. కానీ ఈ కార్యక్రమం చాలా ఆత్మసంతృప్తి కలిగే గొప్ప సన్నివేశం. ఎందుకంటే పరిపాలన చేతకాదు అని ఎగతాళి చేసిన పరిస్థితులను చూశాం. అటువంటి తెలంగాణలో ప్రతి జిల్లాకు మెడికల్ కాలేజీలు ఏర్పాటు చేసుకుంటున్నాం. ఈ సంవత్సరంలో దాదాపు 24 వరకు చేరుకున్నాం. గతంలో ఐదు మెడికల్ కాలేజీలు ఉంటే.. ఇవాళ ఆ సంఖ్య 26కు చేరింది. వచ్చే విద్యా సంవత్సరానికి 8 కాలేజీలు నూతనంగా ప్రాంరంభం కాబోతున్నాయి. వీటికి కేబినెట్ ఆమోదం కూడా లభించిందని సీఎం కేసీఆర్ తెలిపారు.

**10 వేల మంది డాక్టర్లను ఉత్పత్తి చేయబోతున్నాం..** 2014లో 2850 మెడికల్ సీట్లు ఉంటే 2023 నాటికి 8515 మెడికల్ సీట్లు ఉన్నాయని కేసీఆర్ తెలిపారు.

ఈ సందర్భంగా వైద్యశాఖ మంత్రి, కార్యదర్శిని హృదయపూర్వకంగా అభినందిస్తున్నాను. 85 శాతం మెడికల్ సీట్లు తెలంగాణ బిడ్డలకే దక్కాలని పటిష్టంగా పోరాటం చేసి హైకోర్టులో విజయం సాధించాం. అది గొప్ప విజయం. ప్రయివేటు, గవర్నమెంట్ మెడికల్ కాలేజీల ద్వారా సంవత్సరానికి 10 వేల మంది డాక్టర్లను ఉత్పత్తి చేయబోతున్నాం అని కేసీఆర్ పేర్కొన్నారు.

**తెల్ల రక్త కణాల మాదిరిగానే తెలంగాణ తెల్ల కోట్ డాక్టర్లు పని చేస్తారు..** మనిషి ఆరోగ్యంగా ఉండాలంటే, రోగ నిరోధక శక్తి ఉండాలంటే.. తెల్ల రక్త కణాలు ఏ విధంగా పని చేస్తాయో.. తెలంగాణ ఉత్పత్తి చేయబోయే తెల్ల కోట్ డాక్టర్లు రాష్ట్రానికే కాదే.. దేశ ఆరోగ్య వ్యవస్థను కూడా కాపాడుతారని కేసీఆర్ వివరించారు. ఇందులో ఎవరికి సందేహం లేదు. తెలంగాణ అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతోంది. విద్యుత్ రంగంతో పాటు సాగు, తాగునీటి రంగంలో అద్భుతాలు సాధించాం. దేశానికే అన్నం పెట్టే స్థాయికి ఎదిగాం. గంజి కేంద్రాలతో విలసిల్లిన ఉన్న పాలమూరు జిల్లాలో ఇప్పుడు వ్యవసాయం పరుగులు పెట్టింది. పాలమూరు ప్రాజెక్టు ప్రారంభించుకోబోతున్నాం. ఒక్క కాలేజీ లేని పాలమూరులో ఐదు మెడికల్ కాలేజీలు వచ్చాయి. ఇది గొప్ప విజయం. నల్లగొండలో మూడు కాలేజీలు వచ్చాయి. మారుమూల జిల్లాలైన ఆసిఫాబాద్, ములుగు, భూపాలపల్లి జిల్లాలు.. అలా అడవి బిడ్డలు నివసించే ప్రాంతాల్లో కూడా మెడికల్ కాలేజీలు స్థాపించుకొని అద్భుతాలు సృష్టించబోతున్నామని కేసీఆర్ తెలిపారు.

**50 వేల పడకలకు చేరుకోబోతున్నాం..** ఒక దేశం కావొచ్చు.. రాష్ట్రం కావొచ్చు.. ఎక్కడైతే వైద్యారోగ్య వ్యవస్థ పటిష్టంగా ఉంటుందో.. అక్కడ తక్కువ మరణాలు, నష్టాలు సంభవిస్తాయని కేసీఆర్ తెలిపారు. దాన్ని స్ఫూర్తిగా తీసుకొని మెడికల్ కాలేజీలతో పాటు అద్భుతమైన ఆస్పత్రులను కూడా తీసుకువస్తున్నాం.

వందలాది బెడ్స్‌తో మెడికల్ ఫెసిలిటీ వస్తుంది. వైద్యారోగ్య శాఖ చాలా విజయాలు సాధించింది. దేశంలో ప్రతి లక్ష జనాభాకు 22 ఎంబీబీఎస్ సీట్లు ఒకే ఒక్క రాష్ట్రం తెలంగాణ. ఇది మన సాధించిన ఘనత. రాష్ట్రం ఏర్పడే నాటికి 17 వేల పడకలు ఉంటే.. ఇప్పుడు 34 వేల పడకలకు చేరుకున్నాం. మరో 6 హాస్పిటల్స్ నిర్మాణంలో ఉన్నాయి. వరంగల్‌లో అద్భుతమైన హాస్పిటల్ నిర్మాణం జరుగుతోంది. హైదరాబాద్‌కు నలువైపులా టిమ్స్ నిర్మిస్తున్నాం. గచ్చిబౌలి, ఎల్‌బీ నగర్, అల్వాల్, ఎర్రగడ్డలో 1000 పడకల చొప్పున హాస్పిటల్స్ నిర్మిస్తున్నాం. నిమ్స్‌ను మరో 2 వేల పడకలతో విస్తరిస్తున్నాం. ఆస్పత్రుల్లో పడకల సంఖ్య 50 వేలకు చేరుకోబోతోంది. ఈ సందర్భంగా వైద్యారోగ్య శాఖను అభినందిస్తున్నాను అని కేసీఆర్ స్పష్టం చేశారు.

**500 టన్నుల ఆక్సిజన్ ఉత్పత్తి..** కరోనా టైంలో ఆక్సిజన్ చాలా అవసరం ఉండే. దాన్ని గుణపాఠంగా తీసుకొని ఈరోజు వైద్యారోగ్య శాఖ మంత్రి నేతృత్వంలో 500 టన్నుల ఆక్సిజన్‌ను ఉత్పత్తి చేసుకుంటున్నాం అని కేసీఆర్ తెలిపారు. ఎటువంటి విపత్కర పరిస్థితులనైనా ఎదుర్కోనేందుకు మౌలిక సదుపాయాలు కల్పించుకున్నాం. 50 వేల పడకలను ఆక్సిజన్ బెడ్స్‌గా తీర్చిదిద్దుకుంటున్నాం. 10 వేల సూపర్ స్పెషాలిటీ బెడ్స్ కూడా అందుబాటులోకి వస్తున్నాయి. పారా మెడికల్ సిబ్బందికి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో డిమాండ్ ఉంది. మెడికల్ కాలేజీలకు అనుబంధంగా.. ప్రతి జిల్లాలో నర్సింగ్ కాలేజీలు, పారా మెడికల్ కోర్సులు పెట్టాలని చెప్పాం. వాటికి కూడా చర్యలు తీసుకుంటున్నారని సీఎం తెలిపారు.

## ఒకరోజు ముందుగానే హైదరాబాద్‌కు అమిత్ షా



హైదరాబాద్: కేంద్రహోంశాఖ మంత్రి అమిత్ షా తెలంగాణలో రెండు రోజుల పాటు పర్యటించనున్నారు. అయితే ఒకరోజు ముందుగానే ఆయన హైదరాబాద్‌కు వస్తున్నారు. శనివారం రాత్రి తెలంగాణ బీజేపీ నేతలతో ఆయన కీలక సమావేశం కానున్నారు. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో బీజేపీ నేతలకు దిశానిర్దేశం చేయనున్నారు.

**మినిట్ టు మినిట్ షెడ్యూల్ :** శనివారం రాత్రి 7.55 గంటలకు అమిత్ షా ప్రత్యేక విమానంలో శంషాబాద్ ఎయిర్ పోర్టుకు చేరుకుంటారు. 8.15 గంటలకు హైదరాబాద్‌లోని సీఆర్పీఎఫ్ సెక్టార్ ఆఫీసర్స్ మెస్‌కు వెళతారు. అక్కడే రాత్రికి బస చేస్తారు. 17వ తేదీ (ఆదివారం) ఉదయం 8.35 గంటలకు పరేడ్ గ్రౌండ్స్‌కు అమిత్ షా వస్తారు. విమోచన ఉత్సవాల్లో ముఖ్యఅతిథిగా పాల్గొంటారు. 9 గంటల నుంచి 11 గంటల వరకు పరేడ్ గ్రౌండ్స్‌లో ఈ కార్యక్రమాలు జరుగుతాయి. తర్వాత 11.15 గంటలకు పరేడ్ గ్రౌండ్స్ నుంచి శంషాబాద్ విమానాశ్రయానికి బయలుదేరి.. 11.50 నిమిషాలకు ఢిల్లీకి బయలుదేరి వెళతారు. దీంతో అమిత్ షా రెండు రోజుల పర్యటన ముగుస్తుంది.

## హస్తం గూటికి తుమ్మల!

### ఎవరి సమక్షంలో చేరికంటే..!




హైదరాబాద్: హస్తం గూటికి చేరేందుకు తుమ్మల నాగేశ్వరరావుకు లైన్‌క్లియర్ అయింది. సెప్టెంబర్ 17న కాంగ్రెస్‌లో చేరనున్నట్లు సమాచారం అందుతోంది. ఇప్పటికే రాష్ట్ర కాంగ్రెస్ నేతలంతా తుమ్మలతో సమావేశమై పార్టీలోకి ఆహ్వానించారు. తాజాగా శుక్రవారం కూడా మరోసారి తుమ్మలతో రేవంత్‌రెడ్డి, థాక్రే, భట్టి విక్రమార్క, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి భేటీ అయి పార్టీలోకి ఆహ్వానించారు. దీంతో ఆయన కాంగ్రెస్‌లో చేరేందుకు దాదాపుగా గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినట్లుగా తెలుస్తోంది. ఇదిలా ఉంటే ఈ నెల 17న హైదరాబాద్‌లో సోనియాగాంధీతో భారీ బహిరంగ సభ జరగనుంది. అలాగే హైదరాబాద్‌లోనే సీడబ్ల్యూసీ సమావేశం కూడా జరగనుంది. ఈ సమావేశానికి కాంగ్రెస్ ముఖ్యనేతలంతా తరలివస్తున్నారు. రాహుల్‌గాంధీ, ప్రియాంకాగాంధీ, మల్లిఖార్జునఖర్గే, తదితర ముఖ్యనేతలంతా భాగ్యనగరానికి తరలివస్తున్నారు. వీరి సమక్షంలోనే తుమ్మల నాగేశ్వరరావు.. కాంగ్రెస్‌లో చేరే అవకాశం ఉందని తెలుస్తోంది. అలాగే సోనియా చేతుల మీదుగా కాంగ్రెస్ మేనిఫెస్టో కూడా విడుదల చేయించేందుకు తెలంగాణ కాంగ్రెస్ నేతలు ఏర్పాట్లు చేస్తున్నారు. మహిళా సంక్షేమానికి ఆపన్న హస్తం పేరుతో మేనిఫెస్టో విడుదల చేయనున్నట్లు తెలుస్తోంది.

# బల నిరూపణకు వేదికగా 'సెప్టెంబర్ 17'




## రంజుగా తెలంగాణ రాజకీయం

రంగారెడ్డి జిల్లా: ఎన్నికల గడువు సమీపిస్తుండటంతో అన్ని ప్రధాన రాజకీయ పార్టీలు తమ ప్రచారాన్ని ముమ్మరం చేశాయి. ప్రజల మద్దతు కూడగట్టేందుకు గ్రేటర్ జిల్లాలే వేదికగా బహిరంగ సభలు ఏర్పాటు చేస్తున్నాయి. తుక్కుగూడ వేదికగా కాంగ్రెస్ విజయభేరి సభ నిర్వహిస్తుంటే...సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్ వేదికగా బీజేపీ బల ప్రదర్శనకు సిద్ధమవుతోంది. నిజానికి వరంగల్ వేదికగా అమిత్‌షా సభ నిర్వహించాలని భావించినప్పటికీ.. ఆ తర్వాత పార్టీ తన నిర్ణయాన్ని సికింద్రాబాద్‌కు మార్చుకుంది. ఇక అధికార బీఆర్ఎస్ అంతకు ఒక రోజు ముందే (16న)పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం ప్రారంభోత్సవానికి ఏర్పాట్లు చేసుకుంది. రంగారెడ్డి జిల్లా శివారులోని నాగర్‌కర్నూలు జిల్లాలో నిర్వహించే భారీ బహిరంగ సభకు గ్రేటర్ జిల్లాల నుంచే భారీగా జనాన్ని తరలించాలని నిర్ణయించింది.

**తుక్కుగూడకు సోనియా :** సెప్టెంబర్ 15, 16 తేదీల్లో హెూటల్ తాజ్‌కృష్ణ వేదికగా సీడబ్ల్యూసీ సమావేశాలు నిర్వహిస్తుండగా, ఇందుకు కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ సహా పార్టీ ప్రముఖులంతా హాజరుకానున్నారు. సమావేశాల ముగింపు రోజున (17న) తుక్కుగూడ వేదికగా వంద ఎకరాల విస్తీర్ణంలో లక్షలాది మందితో కాంగ్రెస్ విజయ భేరీ సభ నిర్వహిస్తుంది. ఇదే వేదిక నుంచి ఎన్నికల శంఖారావాన్ని పూరించనుంది. ఈ సభకు హైదరాబాద్, మేడ్చల్, రంగారెడ్డి జిల్లాల్లోని ఒక్కో నియోజకవర్గం నుంచి కనీసం 25 వేల మందికి తగ్గకుండా తరలించాలని నేతలకు టార్గెట్లు విధించింది. ఇదిలా ఉంటే తుక్కుగూడ సభకు ఆ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్‌రావు ఠాక్రే, పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి సోమవారం భూమి పూజ నిర్వహించారు.

**పరేడ్ గ్రౌండ్‌కు అమిత్‌షా :** సెప్టెంబర్ 17న తెలంగాణ విమోచనదినాన్ని పురస్కరించుకుని రక్షణశాఖ ఆధ్వర్యంలో సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్ వేదికగా నిర్వహించనున్న జాతీయ పతాకావిష్కరణ కార్యక్రమానికి కేంద్ర హెూంశాఖ మంత్రి అమిత్ షా హాజరు కానున్నారు. కాంగ్రెస్ సభకు పోటీకి బీజేపీ శ్రేణులు కూడా ఈ వేడుకలకు భారీగా జనాన్ని సమీకరించాలని నిర్ణయించారు. కంటోన్మెంట్, సికింద్రాబాద్, ఉప్పల్, కుత్బుల్లాపూర్, ముషీరాబాద్, అంబర్ పేట్, కూకట్‌పల్లి, సనత్‌నగర్, ఎల్బీనగర్, మహేశ్వరం, కల్వకుర్తి, శేరిలింగంపల్లి నియోజకవర్గాల నుంచి కనీసం యాభై వేల మందిని తరలించాలని నిర్ణయించారు. ఈ మేరకు బూత్ కమిటీల వారీగా టార్గెట్లు కూడా ఇచ్చారు.

**మాసబ్‌ట్యాంక్‌లో ఎంఐఎం ర్యాలీ, సభ :** ప్రధాన పార్టీలతో పాటు ఎంఐఎం సైతం సెప్టెంబర్ 17న ప్రత్యేక కార్యక్రమాన్ని చేపట్టింది. జాతీయ సమైక్యత దినోత్సవం పేరుతో నాంపల్లిలోని దర్గా యూసఫియన్ నుంచి బైక్‌ర్యాలీ చేపట్టి, మాసబ్ ట్యాంక్ లోని హాకీ స్టేడియంలో మధ్యాహ్నం రెండు గంటలకు భారీ బహిరంగ సభను నిర్వహించాలని నిర్ణయించింది.

ఎంఐఎం ముఖ్య నేత అసదుద్దీన్ ఓవైసీ సహా పార్టీ ప్రముఖులంతా ఈ సభకు హాజరు కానున్నారు. కేవలం 24 గంటల వ్యవధిలోనే నాలుగు పార్టీలు..నాలుగు ప్రాంతాల్లో భారీ బహిరంగ సభలు నిర్వహిస్తుండటంతో జనసమీకరణ నేతలకు పెద్ద సమస్యగా మారింది.

**జనసమీకరణపై సమావేశం :** తుక్కుగూడ వేదికగా కాంగ్రెస్ పార్టీ నిర్వహించతలపెట్టిన విజయ భేరి సభను విజయవంతం చేసి తీరాలని కాంగ్రెస్ పార్టీ నిర్ణయించింది.

ఈ మేరకు రాజేంద్రనగర్ నియోజకవర్గం ఆరాంఘర్‌లో డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహ్మారెడ్డి అధ్యక్షతన జనసమీకరణ సన్నాహక సమావేశం నిర్వహించారు. పీసీసీ ఉపా? ధ్యక్షుడు వేం నరేందర్‌రెడ్డి ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. కాంగ్రెస్ అగ్రనాయకురాలు సోనియా గాంధీ సహా పార్టీ ప్రముఖులంతా హాజరు కాబోతున్న ఈ సభకు పది లక్షల మందికి తగ్గకుండా తరలించాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. సభ నిర్వహించే మహేశ్వరం, ఇబ్రహీంపట్నం, ఎల్బీనగర్, రాజేంద్రనగర్, శేరిలింగంపల్లి నియోజకవర్గాల నుంచి జనసమీకరణ చేయాలని సూచించారు. జనసమీ కరణ కోసం 3000 బస్సులను సిద్ధం చేసినట్లు చెప్పారు. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ చిగిరింత పారిజాత నర్సింహ్మారెడ్డి, సీనియర్ నేతలు గౌరీ సతీష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు. ఇదిలా ఉంటే ఏళ్ల తరబడి పార్టీ జెండానే నమ్ముకుని, క్షేత్రస్థాయిలో పార్టీ పటిష్టత కోసం కష్టపడిన సామాన్య కార్యకర్తలకు పార్టీలో తగిన గుర్తింపు లభించడం లేదని పలువురు నేతలు పరిశీలకుల ముందే వాపోయారు. అధికారంలోకి వచ్చిన తర్వాత కష్టపడిన ప్రతి కార్యకర్తకు తప్పకుండా తగిన స్థానం కల్పించనున్నట్లు చెప్పి..అసంతృప్తితో ఉన్న నేతలను పీసీసీ ఉపాధ్యాక్షుడు వేం నరేందర్‌రెడ్డి సముదాయించడం కొసమెరుపు.

# సంపాదకీయం

### ఆ నియంత పిచ్చి పీక్స్ కు చేరిందా..

## ఇదెక్కడి కొత్త రూల్!

అమెరికా దాని మిత్ర దేశాలు ఐక్యరాజ్య సమితి తదితరాల ఆంక్షలను పట్టించుకోకుండా నిత్యం క్షిపణి ప్రయోగాలు అణ్వాయుధ పరీక్షలతో అమెరికా జపాన్ దక్షిణ కొరియా దేశాలకు ఉత్తర కొరియా నియంత కిమ్ జోంగ్ ఉన్ పక్కలో బల్లెంలా మారిన సంగతి తెలిసిందే. దీంతో అమెరికా దాని మిత్ర దేశాలతో ధూర్త (చెడ్డ) దేశంగా ముద్ర పడింది.. ఉత్తర కొరియా. ఈ దేశాల విమర్శలకు తగ్గట్టే ఉంది.. ఆ దేశ అధ్యక్షుడు కిమ్ జోంగ్ ఉన్ పరిపాలన. దేశంలో తన ప్రజలకు చిత్ర విచిత్రమైన రూల్స్ ను ప్రవేశపెడుతూ.. వాటిని ఎవరైనా పాటించకపోతే వారికి ఏకంగా ఉరి శిక్షతో పాటు కఠిన కారాగార శిక్షలను కిమ్ జోంగ్ ఉన్ విధిస్తున్నాడు. నియంత కిమ్ జోంగ్ ఉన్ పాలనలో అక్కడి చట్టాలను ఉల్లంఘిస్తే ఎలాంటి శిక్షలు ఉంటాయో ఊహించుకోవడం కూడా కష్టమేనంటారు. చివరకు దేశ ప్రజలు మహిళలు పురుషులు ఎలాంటి హెయిర్ స్టైల్ ఉండాలో కూడా కిమ్ జోంగ్ ఉన్నే నిర్ణయించాడు. ఈ నిబంధనలు పాటించకుండా ఎవరైనా తమకు నచ్చినట్టు హెయిర్ స్టైల్ తో ఉంటే వారికి చావు తప్పదు. ఇలా చిత్ర విచిత్రమైన పనికిమాలిన నిబంధనలతో నియంతలకే నియంతనని అనిపించుకున్నాడు.. కిమ్. ఇప్పుడు ఇదే క్రమంలో మరో కొత్త రూల్ ను కిమ్ జోంగ్ ఉన్ అమల్లోకి తెచ్చాడు. పాశ్చాత్య దేశాల సినిమాలు సీరియళ్లు టీవీ షోలు చూస్తే కఠిన శిక్షలు విధిస్తామని తాజాగా ఉత్తర కొరియా ప్రభుత్వం ఆ దేశ ప్రజలను హెచ్చరించింది. ఈ క్రమంలో చిన్నవారు పెద్దవారు అనే తేడా ఉండదని తెలిపింది.. శిక్షల పరిమాణం కూడా తక్కువ ఉండదని హెచ్చరించింది. ఇప్పటికే ఉత్తర కొరియాలో ఇంటర్నెట్ టీవీ ఛానెళ్లు భావ ప్రకటన సోషల్ మీడియా వినియోగంపై కఠిన ఆంక్షలు ఉన్నాయి. ఇప్పుడు ఇక విదేశాలకు చెందిన ముఖ్యంగా దక్షిణ కొరియాకు చెందిన టీవీ సీరియళ్లు సినిమాలు టీవీ షోలు చూస్తే మరణశిక్ష విధిస్తామని ఉత్తర కొరియా తాజాగా దేశ ప్రజలకు హెచ్చరికలు జారీ చేసింది. హాలీవుడ్ సినిమాలు చూసేందుకు పిల్లలకు అనుమతి ఇస్తే తల్లిదండ్రులు కూడా కఠిన శిక్షలు ఎదుర్కోవాల్సి వస్తుందని ఉత్తర కొరియా హెచ్చరించింది. ఈ విషయాన్ని రేడియో ఫ్రీ ఆసియా వెల్లడించింది. దేశంలోని పిల్లలు పాశ్చాత్య సినిమాలు టీవీ కార్యక్రమాలను చూస్తూ పట్టుబడితే తల్లిదండ్రులను శిక్షిస్తామని ఉత్తర కొరియా ప్రభుత్వం వార్నింగ్ ఇచ్చింది వారిని ఆరు నెలల పాలు లేబర్ క్యాంపులకు పంపడంతోపాటు పిల్లలకు ఐదేళ్లు జైలు శిక్ష విధిస్తామని పేర్కొంది. గతంలో పిల్లలు విదేశీ సినిమాలు చూస్తూ పట్టుబడితే తీవ్ర హెచ్చరికతో తల్లిదండ్రులు తప్పించుకునే వారు. అయితే ఇక నుంచి మాత్రం ఇలా హెచ్చరికలతో తప్పించుకునే అవకాశం ఉండదని తెలిపింది. పిల్లలను ప్రతిక్షణం తల్లిదండ్రులు చదివించాలని.. లేకపోతే వారు పెట్టుబడిదారులుగా యాంటీ సోషలిస్టులుగా మారతారని కిమ్ జోంగ్ ఉన్ ప్రభుత్వం చెబుతోంది. అలాగే ఎవరైనా దక్షిణ కొరియన్ లాగా కనిపించినా.. తల్లిదండ్రులు 6 నెలల పాటు జైలు శిక్షకు గురవుతారని హెచ్చరించింది.

గతేడాది ఇద్దరు టీనేజర్లు దక్షిణకొరియా అమెరికన్ సినిమాలు చూసినందుకు కిమ్ ప్రభుత్వం వారిని స్థానికుల ముందే ఉరితీసింది. 2020 నుంచి దక్షిణ కొరియన్ షోలపై అక్కడి నిషేధం ఉన్న సంగతి తెలిసిందే.

## ఆయిల్‌పామ్‌తో అధిక లాభాలు..!



జనగామ : ప్రతి ఏడాది జిల్లాలో వరి రికార్డు స్థాయిలో సాగవుతోంది. ధాన్యం దిగుబడి అంతకు రెట్టింపుగా పెరుగుతోంది. ఓ వైపు కొనుగోలులో ఏర్పడుతున్న సందిగ్ధత, కొనుగోలు కేంద్రాల్లో పేరుకుపోతున్న ధాన్యం రాశులు, రైతుల్లో ఆందోళన, ఇవి గత కొన్నేళ్లుగా నెలకొన్న పరిస్థితులు. వీటి నుంచి గట్టెక్కించాలని వరి దిగుబడితో వచ్చే ఆదాయం కంటే మెరుగైన, సుదీర్ఘ కాలం లాభాలను రైతన్నలు పొందాలనే సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యామ్నాయ పంటగా ఆయిల్‌పామ్‌ను గుర్తించి సాగు చేసే దిశగా చర్యలు చేపట్టింది. గతంలో వరి తర్వాత పత్తి, కంది, వేరుశనగ పంటలు ఉండగా, ఇక తర్వాతీ కాలంలో ఆయిల్ పామ్ సాగు ప్రత్యామ్నాయంగా మారనుందని అధికారులు వెల్లడిస్తున్నారు. ఇందుకు తగిన రాయితీలతోపాటు మొక్కలు, డ్రిప్ పరికరాలు, అందిస్తోంది. ఇందులో భాగంగా జిల్లాలో ఈ పంట సాగుపై క్షేత్రస్థాయి పరిస్థితులు, ఉద్యాన, పట్టుపరిశ్రమ, టీఎస్ ఆయిల్‌ఫెడ్ అధికారులు చేస్తున్న కృషిపై కథనం.

**సాగు పరిస్థితి ఇలా..**

జిల్లా వ్యాప్తంగా వరి, పత్తి పంటలకు అధిక ప్రాధాన్యతనిస్తున్నారు. ఈ పంటల్లో ఏర్పడుతున్న అడ్డంకులను ఎదుర్కొనేందుకు ప్రత్యామ్నాయంగా ఆయిల్ పామ్‌ను ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. జిల్లాలో ఈ పంట సాగుకు అనువైన నేలలు ఉన్నాయని గత రెండేళ్ల క్రితమే సర్వే బృందం పేర్కొంది. ఇందులో భాగంగా 2021-22 ఆర్థిక సంవత్సరంలో 426 ఎకరాల్లో ఆయిల్‌పాం మొక్కలను నాటారు. 2022-23లో 4వేల ఎకరాల పైచిలుకు సాగు జరుగుతోంది. మరింత విస్తీర్ణం పెంచేందుకు ఉద్యాన-పట్టు పరిశ్రమ, వ్యవసాయ శాఖల అధికారులు ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. ఆసక్తి కల్గిన రైతులు సమీప వ్యవసాయ కార్యాలయంలోని అధికారులను సంప్రదించాలని చెబుతున్నారు. జనగామ నియోజకవర్గంలోని మండలాల రైతులు 7997725117 నెంబరులో, స్టేషన్‌ఘన్‌పూర్, పాలకుర్తి నియోజకవర్గాల పరిధిలోని మండలాల వారు 7997725118 నెంబర్‌ను సంప్రదించాలని ఉద్యానశాఖ జిల్లా అధికారులు వెల్లడిస్తున్నారు.

**ప్రోత్సహించేందుకు రాయితీలు..**

సాగును ప్రోత్సహించేందుకు ప్రభుత్వం రాయితీలు ఇస్తోంది. ఆయిల్ పామ్ మొక్క ధర బహిరంగ మార్కెట్‌లో రూ.250 వరకు ఉండగా ప్రభుత్వం కేవలం రూ.20లకే అందిస్తుంది. సాగు చేసిన రైతుకు ఒక్కో ఎకరాకు రూ.27,801లను నాలుగేళ్లలో అందించనుంది. ఇందులో ఎకరాలో మొక్కలు నాటినందుకు రూ.11,001, తర్వాత అంతర పంటలు, దున్నకాలు, ఎరువులకు ఏడాదికి రూ.4200 చొప్పున వరుసగా నాలుగేళ్ల పాటు రాయితీలను అందిస్తోంది.

**సద్వినియోగం చేసుకోవాలి-కె.ఆర్.లత, జిల్లా ఉద్యానవన శాఖాధికారి, జనగామ**

సాగు విస్తీర్ణాన్ని పెంచేందుకు ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. 2022-23 ఆర్థిక సంవత్సరంలో జిల్లా వ్యాప్తంగా 4వేల ఎకరాల్లో లక్ష్యం విధించాం. ప్రస్తుతం 2661 ఎకరాల్లో మొక్కలు నాటించాం. మరో లక్ష మొక్కలు అందుబాటులో ఉన్నాయి. ఆసక్తి కల్గిన రైతులు ఉద్యానవన శాఖ అధికారులను సంప్రదించాలి. ముందుగా ప్రభుత్వ రాయితీలతో కూడిన బిందు సేద్య పరికరాలను అందజేస్తున్నాం. ఈ పరికరాలకు బీసీలకు 90 శాతం, ఎస్సీ, ఎస్టీలకు 100 శాతం రాయితీ ఉంది. ఈ అవకాశాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలి.

## అందని నీరు.. ఎండిపోయిన వరి!



జనగామ : పాకాలేటి వాగు ఆయకట్టుదారులకు ఏటా యాసంగి కష్టాలు తప్పడం లేదు. గత ఏడాది కూడా ఎస్‌ఆర్‌ఎస్పీ, బయ్యారం పెద్ద చెరువు, పాకాల చెరువు వృథా నీటితో రైతులు కాలం వెళ్లదీశారు. ఈ ఏడాది యాసంగి సాగుకు సాగునీరు కరవైంది. సుమారు 1200 ఎకరాల్లో వరి, మొక్కజొన్న వేసిన రైతులు సాగునీటి కోసం పరితపిస్తున్నారు. మరో 300 ఎకరాల్లో మామిడితోటల రైతులు కూడా ఆశతో ఎదురుచూస్తున్నారు. పాకాలేటి పరివాహక ప్రాంతాల్లో ఏటా వరి, మొక్కజొన్న పంటలు వేస్తున్నా సంబంధిత అధికారులు ముందు చూపు కొరవడిడంతో సాగునీటి కష్టమవుతోందని రైతులు ఆరోపిస్తున్నారు. పాకాల చెక్‌డ్యాం పరివాహక ప్రాంతంలో కోటి ఆశలతో రెండు నెలల కిందట యాసంగిలో 1200 ఎకరాలకు పైగా వరి సాగు చేస్తున్నారు.

పాకాల చెక్‌డ్యాంలో నీరు లేకపోవడంతో రైతుల ఆశలు అడియాశలయ్యాయి. 300 ఎకరాలమేర ఉద్యానపంటలకు కూడా నీరు అందని స్థితి నెలకొంది. గతంలో గార్ల పెద్ద చెరువు నుంచి రెండు అడుగులమేర చెక్‌డ్యాంనకు తాగునీరు విడుదల చేసేవారు. అప్పుడు ప్రత్యక్షంగా తాగునీరు, పరోక్షంగా సాగునీరుకు వినియోగించేవారు. ప్రస్తుతం మిషన్ భగీరథ కొనసాగుతున్నందున గార్ల పెద్ద చెరువు నుంచి నీరు విడుదల చేయడం లేదు. పెద్ద చెరువు పరిధిలో 150 ఎకరాలకు రెవెన్యూ, నీటిపారుదలశాఖ ద్వారా తైబందీ ఏర్పాటు చేశారు. చెరువు నుంచి విడుదలయ్యే నీరు ఆ విస్తీర్ణం వరకు మాత్రమే వినియోగించే పరిస్థితులు నెలకొన్నాయి. పాకాల చెక్‌డ్యాం సమీపంలోని కిలోమీటరున్నర దూరంలో ఉన్న దుబ్బగూడెంలో ఉన్న చెక్‌డ్యాం వరకు వృథా నీరు పైనుంచి ప్రవహించి నాలుగు అడుగులమేర నీరు నిల్వ ఉంది. అక్కడ రైతులు మొక్కజొన్న పంటలు వేశారు. అందని జలాలు..ఈ యేడాది ఎస్‌ఆర్‌ఎస్పీ, పాకాలేటి నుంచి నీరు వస్తుందని ఊహించిన రైతులకు గడ్డు పరిస్థితి ఎదురైంది. వీటికి సంబంధించి వృథా నీరు సుమారు నాలుగు అడుగులమేర దుబ్బగూడెం చెక్‌డ్యాం వద్ద నిలిచి పోయింది. చెక్‌డ్యాంనకు షట్టర్లు లేని కారణంగా పారకానికి అనువుగా లేదు. సాగునీటి కోసం రైతులు చేస్తున్న ప్రయత్నాలు నిరాశాజనకంగా మారుతున్నాయి.

రెండు నెలలు కాపాడినా..రెండు నెలలపాటు వరి పంటను కాపాడుకున్న రైతులకు ప్రస్తుతం ప్రతికూలపరిస్థితులు ఎదురయ్యాయి. నీరులేక పోవడంతో క్రమంగా పంటలు ఎండుతున్నాయి. మండలంలోని మద్దివంచ, రాంపురం, గార్ల, జీవంజిపల్లి, గండి ప్రాంతాలకు చెందిన రైతులు దిక్కు తోచని పరిస్థితిలో ఉన్నారు.

**సాగునీరందించాలి - పి.సంజీవరెడ్డి, రైతు, జీవంజిపల్లి**

రైతులు వేసిన పంటలు ఎండిపోకుండా ప్రజాప్రతినిధులు, అధికారులు సత్వర సహకారాలందించి పాకాల చెక్‌డ్యాంకు ఎస్‌ఆర్‌ఎస్పీ నీరును విడుదల చేయాలి. ప్రస్తుతం ఏడెకరాల్లో యాసంగిలో వరి వేశా. సాగునీటి కోసం ఎదురు చూస్తున్నా.

**నష్టాన్ని నివారించాలి - శీలంశెట్టి ప్రవీణ్‌కుమార్, గార్ల**

పాకాల చెక్‌డ్యాం పరిసర ప్రాంతంలో సొంతంగా 12 ఎకరాలు, మరో 30 ఎకరాలదాకా కౌలుకు తీసుకొని వరి వేశా. పాకాల చెక్‌డ్యాంలోకి నీరు వస్తుందని ఆశించాం. చుక్కనీరు లేని దుస్థితి ఏర్పడింది. నీటి పారుదల శాఖాధికారులు, ప్రజాప్రతినిధులు సహకరించాలి.జిల్లా అధికారులకు ప్రతిపాదిస్తా - నీటి పారుదలశాక ఏఈ వంశీపాకాల చెక్‌డ్యాంలోకి ఎస్‌ఆర్‌ఎస్పీ నీటిని ఇవ్వాలని నీటి పారుదల శాఖ జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్తా. రైతుల సమస్యలను వెల్లడిస్తా. సమస్య పరిష్కారం కోసం కృషి చేస్తా.

## నల్ల రేగడిలో ఎర్ర బంగారం

జనగామ : గల గల పారే గోదావరి.. చుట్టూ పచ్చదనం.. నల్ల రేగడి భూముల్లో ఎర్ర బంగారం మెరిసిపోతోంది.. తెలంగాణ-మహారాష్ట్ర-ఛత్తీస్‌గఢ్ సరిహద్దు ప్రాంతమైన మహదేవపూర్ గోదావరి పరివాహక ప్రాంతంలో ఎటుచూసినా ఎర్ర బంగారం సిరులు కురిపిస్తున్నాయి. జిల్లా, రాష్ట్రంలోనే అత్యధికంగా మహదేవపూర్ డివిజన్‌లోనే మిర్చి సాగు చేస్తున్నారు. ఈ ప్రాంతంలో పండిన మిర్చి ప్రత్యేక ప్రాధాన్యతను సంతరించుకుంటోంది. సారవంత, అనుకూలమైన నేలల స్వభావం, వాతావరణ అనుకూలత ఉండడంతో రైతులు ఎక్కువగా మిర్చి వైపు మొగ్గు చూపుతున్నారు. మహదేవపూర్ డివిజన్‌లో వండర్‌హట్, 341, వరంగల్ చపాట, దేవునూర్ డీలక్స్, ఇండిక, నెం 5, తేజ, తదితర విభిన్న రకాల మిర్చిని పండిస్తున్నారు. ఈ ప్రాంతంలో పండించిన మిర్చిని దేశ, విదేశాలకు ఎగుమతి చేస్తున్నారు. సాధారణంగా ఈ ప్రాంతంలో పండించిన మిర్చిని వరంగల్ మార్కెట్‌కు తరలించి విక్రయిస్తారు. కంపెనీల ద్వారా పలు రకాలు, డిమాండ్ ఉన్న మిర్చిని పండించగా చైనా, తదితర విదేశాలకు ఎగుమతి అవుతోంది. వంటకాల్లో ఉపయోగించే కారం పొడితో పాటు, ఔషధ, వివిధ రసాయనాలు, కలర్స్ తదితర వాటికి ఉపయోగపడేలా మిర్చి రకాలను ప్రైవేటు కంపెనీల ద్వారా రైతులు సాగు చేస్తున్నారు.

**మహారాష్ట్ర కూలీలతో పనులు**

సరిహద్దు ప్రాంతం కావడంతో మహదేవపూర్ డివిజన్ పరిధిలో కూలీలు దొరకడం కష్టంగా మారింది. ఈ ప్రాంతంలో కూలీలు దొరికినా కూలీ రేటు అధికంగా అడుగుతుండడంతో మహారాష్ట్ర కూలీలతో పనులు చేయిస్తున్నారు. పదులు, వందల సంఖ్యలో కూలీలను మాట్లాడుకొని ఈ ప్రాంతంలో వారికి వసతి, తదితర సౌకర్యాలు ఏర్పాటు చేయడంతో ఇక్కడికి వచ్చి పనులు చేస్తున్నారు. కొంతమంది కూలీలు రోజువారీగా కాళేశ్వరం, మేడిగడ్డ వంతెన ద్వారా వాహనాల ద్వారా చేరుకొని ఈ ప్రాంతంలో పనులు చేసి నిత్యం రాకపోకలు సాగిస్తున్నారు.

## చిన్న కాళేశ్వరం.. ఎప్పటికో సాకారం!

వరంగల్ : గలగలా పారే గోదావరి.. కాళేశ్వరం ప్రాజెక్టుతో గంగమ్మ నిండుకుండను తలపిస్తోంది.. కానీ, జిల్లా పరిధిలోని రైతులకు సాగునీరు కరవే.. కాటారం, మల్హర్, మహదేవ్‌పూర్, మహాముత్తారం మండలాలకు గోదావరి జలాలను అందించేందుకు దశాబ్దన్నర క్రితమే అడుగులు పడ్డాయి. ఉమ్మడి రాష్ట్రంలో కాళేశ్వర, ముక్తీశ్వర ఎత్తిపోతల(చిన్న కాళేశ్వరం) పథకానికి శ్రీకారం చుట్టినా నేటికీ పూర్తికాక రైతన్నలు నిరీక్షిస్తున్నారు.

**45 వేల ఎకరాల లక్ష్యం..**

మహదేవ్‌పూర్ మండలం బీరసాగర్ నుంచి 4.5 టీఎంసీల గోదావరి జలాలను ఎత్తిపోసేలా ప్రణాళికలు చేశారు. 0.3 టీఎంసీలు తాగునీటికి, మిగతా సాగునీటికి వినియోగిస్తారు. 4 మండలాల్లో 45 వేల ఎకరాలకు సాగునీరందించడం దీని లక్ష్యం. మొదటి దశ బీరసాగర్ ప్రధాన పంప్‌హౌస్ నుంచి ఒక పంపు ద్వారా మహదేవ్‌పూర్ మండలం మందిరం, ఎర్ర చెరువులను నింపుతారు. రెండో దశలో బీరసాగర్ నుంచి రెండు పంపుల ద్వారా కాటారంలోని రిజర్వాయర్‌ను నింపుతారు. అక్కడి పంప్‌హౌస్ నుంచి నాలుగు పంపుల ద్వారా మహాముత్తారం, కాటారం, మల్హర్ మండలాలకు నీటిని తరలిస్తారు. గారెపల్లి, ఆదివారంపేట, రుద్రారం, పోలారం చెరువుల్లో డెలివరీ ఛానళ్లను నింపి అక్కడి నుంచి సమీపంలోని ఆయా మండలాల్లో గుర్తించిన 8 చెరువులకు నీటిని తరలించి, కాల్వల ద్వారా పొలాలకు తరలిస్తారు.

**2008లో మొదలైనా..**పథకం పనులు 2008లో మొదలైనా.. పలు కారణాలతో మధ్యలోనే ఆపేశారు. తెలంగాణలో 2017లో తిరిగి పనులు మొదలయ్యాయి. బీరసాగర్, కాటారం పంప్‌హౌస్‌లు, అలాగే కాటారం రిజర్వాయర్, బీరసాగర్‌లో 132/11 కేవీ సబ్‌స్టేషన్ నిర్మాణాలు పూర్తయ్యాయి. కాటారంలో సబ్‌స్టేషన్ పనులు కొనసాగుతున్నాయి. పైప్‌లైన్లు, కాల్వలు పెండింగ్‌లో ఉన్నాయి. గతేడాది నవంబరులో చిన్న కాళేశ్వరం ప్రాజెక్టుకు కేంద్ర జల సంఘం(స్మీడబ్ల్యూస్మీ) ఆమోదం తెలిపింది. ఇక పనులు ఊపందుకుంటాయని అనుకున్నారు. కానీ, మూడు నెలలవుతున్నా పనుల్లో పురోగతి లేదు. గత వర్షాకాలంలో మోటార్లు కూడా మునిగిపోయాయి. మోటార్లు ప్రారంభం కాక ముందే ముంపునకు గురికావాల్సి వచ్చింది.

**భూ సేకరణలో జాప్యం..**ప్రాజెక్టుకు మొత్తం 3,589 ఎకరాలు అవసరం ఉండగా ఇప్పటికి 891 రెవెన్యూ భూములు, 637 ఎకరాలు అటవీ శాఖ నుంచి సేకరించారు. ఇంకా 2061 ఎకరాల భూసేకణ జరపాల్సి ఉంది. కాల్వల డిస్ట్రిబ్యూటరీలు, పైప్‌లైన్, చెరువుల పనులు పెండింగ్‌లో ఉన్నాయి. బీరసాగర్ పంప్‌హౌస్ పరిధిలో 44.045 కి.మీ పైప్‌లైన్‌కు గాను పనులు దాదాపు పూర్తయ్యాయి. కాటారం పంప్‌హౌస్ పరిధిలో 22.67 కి.మీలకు 16.422 కి.మీ పైప్‌లైన్ వేశారు. అలాగే 12 చెరువులకు 6 చెరువుల పనులు పూర్తిచేశారు. గడువును ఆగస్టు వరకు పెంచారు. భూ సేకరణ జరిపి పనులు పూర్తి చేసి వచ్చే వానాకాలానికి సాగునీరు అందించాలని రైతులు కోరుతున్నారు.

**ప్రాజెక్టు వివరాలు..**పని ప్రారంభించిన తేదీ : 17.11.2008
పథకం అంచనా విలువ : రూ.499.23 కోట్లు
సవరించిన అంచనా విలువ : రూ.571.57 కోట్లు
ఇప్పటివరకు ఖర్చు చేసింది సుమారు : రూ.370 కోట్లు
ఎత్తిపోతల లక్ష్యం : 4.5 టీఎంసీలు
తాగునీటికి : 0.3 టీఎంస్మీలు
సాగు ఆయకట్టు : 45,280 ఎకరాలు
మొత్తం ప్రధాన చెరువులు : 14లబ్ధి పొందే మండలాల ఆయకట్టు : మహదేవ్‌పూర్ 10077 ఎకరాలు, కాటారం-26815, మహముత్తారం-6762 , మల్హార్‌రావు- 1626.రెండ్రోజుల్లో సమావేశం ఉంటుంది-యాదగిరి, ఈఈ కాళేశ్వరం ప్రాజెక్టుచిన్న కాళేశ్వరం పథకంపై రెండ్రోజుల్లో సమావేశం ఉంటుంది. స్మీడబ్ల్యూస్మీ అనుమతులు వచ్చాయి. పంప్‌హౌస్‌లు పూర్తయ్యాయి. ప్రధాన పైప్‌లైన్లు పూర్తికావచ్చాయి. మిగతా పనుల కోసం భూసేకరణ ప్రక్రియ జరుగుతోంది. భూసేకరణ పూర్తికాగానే పనులు వేగవంతం చేస్తాం.

## సాదాబైనామా.. పరిష్కారమయ్యేనా!

నల్గొండ : సాదాబైనామాల కింద కొనుగోలు చేసిన భూములకు యాజమాన్య హక్కులు కల్పించకపోవడంతో దరఖాస్తుదారు లకు నిరీక్షణ తప్పడం లేదు. రెండున్నరేళ్ల నుంచి ఉమ్మడి జిల్లావాసులకు పరిష్కారం లభించడం లేదు. రికార్డుల్లో పేర్లు లేకపోవడంతో అప్పటికే భూములను సాగు చేసుకుంటున్న రైతులు ఇతర వ్యక్తుల నుంచి సమస్యలను ఎదుర్కొంటున్నారు. ప్రస్తుతం సాగులో ఒకరు ఉండి, రికార్డుల్లో మరొకరు ఉండటంతో రికార్డుల్లో పేర్లు నమోదై ఉన్న వ్యక్తుల వారసులు , కుటుంబ సభ్యుల నుంచి ఇబ్బందులు పడుతున్నారు. వివాదాలు ప్రారంభమై ఠాణాల చుట్టూ తిరుగుతూ, న్యాయస్థానాలను ఆశ్రయిస్తున్నారు. రాష్ట్రం ఏర్పాటైన తర్వాత ప్రభుత్వం ఈ సమస్యల పరిష్కారం కోసం సాదాబైనామాల ద్వారా రికార్డుల్లో పేర్లు మార్చుకునేందుకు అవకాశం కల్పించింది. వేలాది దరఖాస్తులు రాగా 50 శాతం వరకు కూడా పరిష్కారం కాలేదు. మిగిలిన వాటిని తిరస్కరించినట్లు అధికారులు చెబుతున్నారు. స్పష్టమైన వివరాలు, ఇతర సమాచారం లేకపోవడం వల్లే అవి తిరస్కరణకు గురైనట్లు వివరిస్తున్నారు. సాదాబైనామాలకు నవంబరు 2020లో దరఖాస్తులను స్వీకరించారు. ఉమ్మడి జిల్లాలో 54,821 దరఖాస్తులు వచ్చాయి. వాటిలో 26,062 పరిష్కరించగా, 25,430 తిరస్కరణకు గురయ్యాయి.పరిష్కారం కాని వారి ఎదురుచూపులునాలుగైదు దశాబ్దాల కిందట వ్యవసాయ భూములు, ఇళ్ల స్థలాల క్రయ, విక్రయాలు కేవలం తెల్ల కాగితాలపైనే జరిగేవి. ఆ తర్వాత కొన్నాళ్లకు స్టాంపు పేపర్లపై క్రయ, విక్రయ దస్త్రాలు రాసుకునే వారు. తమ పూర్వీకులు ఇతరులకు భూములు విక్రయించినట్లు చిన్నకాగితం ఉన్నా.. వారి వారసులు ఆ భూముల జోలికి వెళ్లేవారు కారు. ఆ పరిస్థితులు ప్రస్తుతం మారిపోయాయి. భూముల ధరలు పెరగడంతో స్థిరాస్థి వ్యాపారం జోరందుకుంది. దీంతో రికార్డుల్లో తమ పేర్లు ఉన్నాయంటూ కొందరు వారసులు తిరగబడుతున్నారు. ఏళ్ల తరబడిగా సాగు చేసుకుంటున్నామని, ఇప్పుడు వచ్చి ఆ భూములు మావి అంటే ఎలా అంటూ వివాదాలు ప్రారంభమవుతున్నాయి. అనేక మంది రైతులు ఈ భూముల సమస్యలపైనే నిత్యం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు.

# స్థిరాస్తి వ్యాపారంలో స్తబ్ధత

నల్గొండ: ఉమ్మడి జిల్లాలోని స్థిరాస్తి వ్యాపారంలో కొన్ని రోజులుగా స్తబ్ధత నెలకొంది. ఆస్తుల క్రయ, విక్రయాలు గతేడాదితో పోలిస్తే నల్గొండ, సూర్యాపేట, యాదాద్రి జిల్లాల్లో గణనీయంగా తగ్గాయని రిజిస్ట్రేషన్ శాఖ వర్గాలు వెల్లడించాయి. రానున్న రెండు మూడు నెలల్లో ఎన్నికలు ఉండనున్నాయనే ప్రచారం, అన్ని అనుమతులు తీసుకున్నాకే వెంచర్ల నిర్మాణానికి ప్రభుత్వం పచ్చజెండా ఊపడం లాంటి కారణాలతో ప్రస్తుతం మార్కెట్లో డబ్బు వినిమయం గణనీయంగా తగ్గిందన్న వాదనలు ఉన్నాయి. ఉదాహరణకు గతంలో ఒక వెంచర్ నిర్మాణానికి గ్రామ పంచాయతీ తీర్మానం సరిపోయేది. దీంతో ప్లాట్లు చేసి విక్రయించేవారు. ప్రస్తుతం ఒక వెంచర్ నిర్మాణం చేయాలంటే ప్రభుత్వ నిబంధనలను పాటించడంతో పాటు డీటీసీపీ అనుమతులు తప్పనిసరి. దీంతో పెట్టుబడి ఎక్కువ కావడంతో వ్యాపారులు ప్లాట్ల ధర పెంచుతున్నారు. ధరలు ఎక్కువగా ఉండటంతో కొనుగోలుదారులు కొనడానికి ఆసక్తి చూపించడం లేదు. ఎన్నికల అనంతరం ఈ ధరలు మరింతగా పెరుగుతాయని చెబుతున్నా పెద్దగా వ్యాపారం జరగకపోవడం గమనార్హం. స్థిరాస్తి వ్యాపారం అంతగా లేదని చెబుతున్నా... ఎవరైనా కొనడానికి సుముఖత చూపితే ధరలు చుక్కలను చూపెడుతున్నాయి. ఒక పక్క మందగమనం అంటూనే ప్లాట్ల ధరల్లో మాత్రం ఏ మాత్రం తగ్గుదల లేదని కొనుగోలుదారులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్న పరిస్థితులున్నాయి.

ఎన్నికల హడావుడి

రాష్ట్రంలో ఎన్నికల హడావుడి ఉండటమూ స్థిరాస్తి మందగమనానికి ఓ కారణమని నిపుణులు వెల్లడిస్తున్నారు. ఎన్నికల దృష్ట్యా వ్యాపారులు మార్కెట్లో డబ్బు వినియోగాన్ని గణనీయంగా తగ్గించారు. చాలా చోట్ల స్థిరాస్తి వ్యాపారులంతా ఏదో ఒక పార్టీకి అనుబంధంగానే ఉంటారు. ఎన్నికల నేపథ్యంలో వారంతా డబ్బును నిల్వ చేసుకునే పరిస్థితి. దీంతో వారు ఎక్కడా క్రయ విక్రయాలు చేయడంలేదు. సాధారణ వ్యాపారుల కంటే పెద్ద వ్యాపారులు చేసే క్రయవిక్రయాలే స్థిరాస్తి వ్యాపారంలో ఎక్కువగా ఉంటాయి. కొన్ని రోజులుగా వీరు క్రయవిక్రయాలు చేయకపోవడంతో మార్కెట్లో డబ్బు వినియోగం గణనీయంగా తగ్గింది. మరోవైపు ఎన్నికల తర్వాతనే ఈ రంగంలో బూమ్ నెలకొంటుందన్న వాదనలున్నాయి. "ఎన్నికలతో పాటు డీటీసీపీ లేఅవుట్ అనుమతులు పకడ్బందీగా ఉండటంతో గతంతో పోలిస్తే ప్లాట్ల ధరలు పెరిగాయి. దీంతో మధ్యతరగతి ప్రజలు ప్లాట్ల కొనుగోళ్లకు ఆసక్తి చూపడం లేదు. మా వద్ద గతంలో నిత్యం 100 దస్తావేజుల వరకు రిజిస్ట్రేషన్ అయ్యేవి. ఇప్పుడు రోజూ 50కి మించి రావడం లేదు. మరో నాలుగైదు నెలలూ ఇదే పరిస్థితి ఉండే అవకాశముంద"ని నల్గొండ సబ్ రిజిస్ట్రార్ కోమటిరెడ్డి వేణుగోపాల్‌రెడ్డి 'ఈనాడు'తో అభిప్రాయపడ్డారు.

సగానికి పడిపోయిన రిజిస్ట్రేషన్లు

ఉమ్మడి జిల్లాలో మొత్తం 15 రిజిస్ట్రేషన్ కార్యాలయాలు ఉన్నాయి. వీటిల్లో గతంలో రోజూ సగటున 1000 నుంచి 1200 వరకు క్రయవిక్రయాలు రిజిస్ట్రేషన్ అయ్యేవి. ప్రస్తుతం అవి 500 నుంచి 700 వరకు పడిపోయినట్లు సంబంధిత వర్గాలు వెల్లడించాయి. అయితే రిజిస్ట్రేషన్ ఛార్జీలను ప్రభుత్వం గతేడాది పెంచడంతో సర్కారుకు వచ్చే ఆదాయంలో పెద్దగా తేడా ఉండటం లేదని... డాక్యుమెంట్లు మాత్రం సగానికి సగం తగ్గాయని తెలిసింది. గత ఆర్థిక సంవత్సరం తొలి ఐదు నెలల్లో ప్రభుత్వానికి సుమారు రూ.200 కోట్ల ఆదాయం రిజిస్ట్రేషన్ల ద్వారా రాగా... ఈ ఏడాది అది రూ.162 కోట్లకు పడిపోయిందని తెలిసింది. పెంచిన ధరల ప్రకారమే ప్రభుత్వానికి గతేడాదితో పోలిస్తే సుమారు రూ.38 కోట్ల నష్టం వచ్చింది. గత ధరలతోనే అయితే ఇది సుమారు రూ.80 కోట్ల వరకు ఉండేదని సమాచారం. స్థిరాస్తి వ్యాపారం ఎక్కువగా జరిగే రాజధాని సమీప ప్రాంతాలైన చౌటుప్పల్, బీబీనగర్, భువనగిరి, యాదగిరిగుట్ట కార్యాలయాల్లో గతంలో పోలిస్తే రిజిస్ట్రేషన్లు 30 శాతానికి పైగా పడిపోయాయి.

# అటెండర్లకు అదనపు బాధ్యతలు

కరీంనగర్ : పేరేమో నగరపాలక సంస్థ.. మున్సిపాలిటీ కంటే అధ్వానంగా ఉద్యోగుల భర్తీ.. ఉన్న సిబ్బందికి మాత్రం పదోన్నతులు లేక.. బలవంతంగా బాధ్యతలు అప్పగిస్తుండటం.. చేసేదేమీ లేక అదే జీతానికి పనులు చేస్తుండగా..ఉన్నతాధికారులు హెచ్చరిస్తుండటం.. ఇన్‌ఛార్జి బాధ్యతలతో సతమతం కావడం ఏమిటని ఆందోళన చెందుతు న్నారు. కరీంనగర్ నగర పాలక సంస్థ కార్యాలయంలో రెవెన్యూ, పారిశుద్ధ్యం, పరిపాలన, పట్టణ ప్రణాళిక, మెప్మా, పింఛన్లు, ఇంజినీరిం గ్ విభాగాలు పని చేస్తున్నాయి. ఇందులో కంప్యూటర్ ఆపరేటర్లు మొదలుకొని అటెండర్లు, బిల్ కలెక్టర్లు, జూనియర్, సీనియర్, రికార్డు అసిస్టెంట్లు, సూపరింటెండెంట్లు, ఆయా విభాగాల అధిపతులు, క్షేత్రస్థాయిలో పని చేసే ఉద్యోగులు, అధికారులు విధులు నిర్వర్తించాల్సి ఉంటుంది. ఉన్నతాధికారులు ఉద్యోగులను సర్దుబాటు చేయడం సాధారణం.. కాగా నగరపాలక కార్యాలయంలో మాత్రం పదోన్నతుల విషయమే మర్చిపోయారు. ఏళ్ల తరబడి అదే జీతానికి అదనపు బాధ్యతలు అప్పగించడం, గత్యంతరం లేక విధులు నిర్వర్తిస్తుండగా ఇటీవల ఉన్నతాధికారుల బెదిరింపులు ఎక్కువ కావడంతో వద్దు బాబోయ్ ఈ అదనపు భారం అనే పరిస్థితికి ఉద్యోగులు వచ్చారంటే పరిస్థితి ఎంత ఇబ్బందికరంగా మారిందో అర్థం చేసుకోవచ్చు.

సెలవు రోజుల్లో సర్వేలు మిగతా శాఖల ఉద్యోగులు సెలవుల్లో ఉంటుండగా నగరపాలక సంస్థ ఉద్యోగులు మాత్రం పని చేయడమేమి టని ఆగ్రహిస్తున్నారు. పండుగలు, రెండో శనివారం, ఆదివారాలు వస్తే చాలు సర్వేలు, పన్నుల వసూలు అంటూ విధులు వేస్తున్నారని మండి పడుతున్నారు. ఆగస్టు 15న కూడా గృహలక్ష్మి దరఖాస్తుల పరిశీలన విధులు అప్పగించినట్లు ఉద్యోగులు అంటున్నారు. దళితబంధు, గృహలక్ష్మి, బీసీ రుణాలు, పింఛన్ల విచారణ, బీఎల్వోల విధులు అప్పగిస్తున్నారు. అటెండర్ జీతమే వస్తుండగా కనీసం అదనపు ప్రయోజనాలు ఇవ్వకుండా ఇబ్బందులు గురి చేస్తే ఎలా అంటున్నారు. డిగ్రీలు, పీజీలు చదువుకున్న వారున్నారని వీరికి పదోన్నతులు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. ఉన్నతాధికారులు న్యాయం చేయాలని ఉద్యోగ సంఘం ప్రతినిధులు కోరుతున్నారు.

రెవెన్యూ విభాగంలోనూ వారే..

రెవెన్యూ విభాగం పూర్తిగా పన్నుల వసూలుపై ఆధారపడి ఉంటుంది. ఆర్వో, ఆర్ఐలు, బిల్ కలెక్టర్లు పూర్తిగా ఇన్‌ఛార్జులుగా ఉన్నారు. 60 డివిజన్లలో విలీన కాలనీలు కలుపుకొని మొత్తం 30 మంది బిల్ కలెక్టర్లు పని చేస్తున్నారు. వీరిలో నలుగురు మాత్రమే బిల్‌కలెక్టర్ హోదాలో ఉన్నారు. ఇందులో ఒకరిని ఆర్ఐగా నియమించారు. అంటే ముగ్గురు మాత్రమే, మిగతా 15మంది కార్యాలయంలో అటెండర్లుగా పని చేసే వారే. వీరికి ఇన్‌ఛార్జి బాధ్యతలు అప్పగించి బిల్ కలెక్టర్ విధులు అప్పగించారు. ఆరుగురు ఆర్ఐలు అవసరం కాగా ముగ్గురే పని చేస్తున్నారు. మిగతా విభాగాల్లో సైతం పదోన్నతులపై ఉద్యోగులను నియమించాల్సి ఉండగా ప్రజారోగ్యశాఖ కార్మికులుగా ఉన్న వారిలో కొందరిని రికార్డు అసిస్టెంట్లుగా పని చేయించుకుంటున్నారు. కంప్యూటర్ ఆపరేటర్లు పూర్తిగా ఒప్పంద ప్రాతిపదికనే ఉన్నారు. మెప్మా విభాగం అంతే.

సీనియర్, జూనియర్ అసిస్టెంట్లు ఎక్కడ?

కార్యాలయంలో ఇటీవల ప్రభుత్వం సీనియర్, జూనియర్ అసిస్టెంట్లను నియమించింది. వీరంతా ఈ పనులు చేయాల్సి ఉండగా.. వారికి అప్పగించడం లేదనే విమర్శలున్నాయి. ఏడాది కిందట వీఆర్వోలు 12 మంది రాగా అందులో ఇద్దరు వార్డు అధికారులుగా కేటాయించారు. ఇటీవల 17 మంది వీఆర్ఏలు అప్పగించగా వీరిని వార్డు అధికారులుగా నియమించారు. వీరికి ఇప్పటికీ బాధ్యతలు అప్పగించలేదు. కొందరైతే చెట్ల కింద కాలయాపన చేస్తుండగా, మరికొందరు ఉదయం వచ్చి వెళ్లి పోతున్నట్లుగా చెబుతున్నారు.

# వ్యాపారుల కమీషన్ దందా



వరంగల్ : ఎండనకా వాననకా ఆరుగాలం శ్రమించి కూరగాయలు, ఆకుకూరల పంటలు పండించిన రైతులు వరంగల్ లక్ష్మీపురం కూరగాయల మార్కెట్‌లో కమీషన్‌దారుల దందాకు బలైపోతున్నారు. ప్రస్తుతం మార్కెట్‌లో మంచి ధర ఉన్నా రైతులకు మాత్రం ఆశించిన లాభాలు రావడంలేదు. మార్కెట్ కమిటీ నిర్దేశించిన దానికన్నా.. వ్యాపారులు మూడు రెట్లు అధికంగా కమీషన్ వసూలు చేస్తుండడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. కొందరు రైతులు అధిక కమీషన్లకు భయపడి.. వారు తెచ్చిన కూరగాయలను మార్కెట్ ముందు రైతుబజార్‌లో అమ్ముకుంటున్నారు. ఇదే విషయంపై గతనెల 11న జరిగిన జడ్పీ సర్వసభ్య సమావేశంలో సంగెం జడ్పీటీసీ సభ్యుడు గూడ సుదర్శన్ ప్రస్తావించగా.. జిల్లా మార్కెటింగ్‌శాఖ అధికారి ప్రసాద్‌రావు తగిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. కేవలం అవగాహన బ్యానర్‌లు ఏర్పాటుచేసి చేతులు దులుపుకొన్నారు.

తెల్ల చీటీలే తక్‌పట్టీలు..: కమీషన్‌దారు మధ్యవర్తిగా ఉంటూ రైతు తెచ్చిన సరకును రిటైల్ వ్యాపారులకు విక్రయించి వచ్చిన లాభంలో 4శాతం కమీషన్ తీసుకోవాలి. అందుకు మార్కెట్‌కు సంబంధించిన తక్‌పట్టీలపై సరకు వివరాలు, ధర, తీసుకునే కమీషన్, హమాలీ ఛార్జీ తదితర వివరాలను నమోదుచేసి రైతులకు ఇవ్వాలి. కానీ లక్ష్మీపురం మార్కెట్‌లో అందుకు పూర్తి విరుద్ధంగా జరుగుతోంది. మార్కెట్ అధికారుల పర్యవేక్షణ కొరవడడంతో.. వ్యాపారులు ఇష్టారాజ్యంగా కమీషన్‌లు వసూలు చేస్తున్నారు. స్వయంగా ముద్రించుకున్న చిట్టీలపై వివరాలను నమోదుచేసి అనధికారికంగా 10శాతం కమీషన్ వసూలు చేస్తున్నారు. తక్‌పట్టీలపై మాత్రం మార్కెట్‌కు 100 క్వింటాళ్లు వస్తే.. 50క్వింటాళ్లు మాత్రమే వచ్చినట్లు, 10శాతం కమీషన్ తీసుకున్నా.. 4శాతమే తీసుకుంటున్నట్లు అధికారులకు తప్పుడు లెక్కలు సమర్పిస్తున్నారు. తక్‌పట్టీల ఆధారంగానే సదరు వ్యాపారుల నుంచి అధికారులు ఒకశాతం ఫీజు వసూలు చేయాల్సి ఉండగా.. వ్యాపారులు సమర్పించే తప్పుడు వివరాలతో మార్కెట్ ఆదాయానికి గండిపడుతుంది. లక్ష్మీపురం మార్కెట్‌కు ప్రతీరోజు వెయ్యి క్వింటాళ్లకు పైగానే కూరగాయలు వస్తున్నా.. అధికారులు చూపించే లెక్కలు మాత్రం అందుకు భిన్నంగా ఉన్నాయి.

# సమగ్రాభివృద్ధిపై ఆశలు!



మహబూబాబాద్ : కొండకోనల నడుమ అభివృద్ధికి దూరంగా ఉన్న మారుమూల మండలాల సమగ్రాభివృద్ధికి అడుగులు పడనున్నాయి. ఆకాంక్షిత బ్లాకుల అభివృద్ధి కార్యక్రమం (యాస్పిరేషనల్ బ్లాక్ డెవలప్‌మెంట్)లో భాగంగా దేశంలో అత్యంత వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. ఈ కార్యక్రమం కింద మహబూబాబాద్ జిల్లాలో ఏజెన్సీ మండలమైన గంగారం, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో పలిమెల, మహాముత్తారాన్ని నీతి ఆయోగ్ ఎంపిక చేసింది. ఇక్కడి ప్రస్తుత పరిస్థితిపై నివేదికలను రూపొందించేందుకు వివిధ శాఖలకు చెందిన మండల స్థాయి అధికారులకు ఈ నెల 1, 2 తేదీల్లో హైదరాబాద్‌లోని రాజేంద్ర నగర్‌లో శిక్షణ ఇచ్చారు. ఇటీవల ఆయా జిల్లాల కలెక్టర్లు రెండు పర్యాయాలు సంబంధిత మండల అధికారులతో సమావేశాలు నిర్వహించి మార్గనిర్దేశం చేశారు. దేశంలో వెనుకబడిన మారుమూల ప్రాంతాలను అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడానికి కేంద్ర ప్రభుత్వం 2018లో యాస్పిరేషనల్ జిల్లా డెవలప్‌మెంట్ ప్రోగ్రాం ప్రారంభించింది. ఆ సమయంలో జిల్లాల ను ఎంచుకుని వాటిని అభివృద్ధి చేసింది. అవి సత్ఫలితాలు ఇవ్వడంతో దానికి కొనసాగింపుగా బ్లాక్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం ప్రారంభించింది. ఇందులో భాగంగా మండలాలను ఎంపిక చేసుకున్నారు. దేశవ్యాప్తంగా 500 బ్లాకులను గుర్తించింది. తెలంగాణలో 10 ఎంపిక చేయగా ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచి మూడు ఉన్నాయి.

బృందాలుగా ఏర్పడి..మండలం భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకొని సమగ్ర అభివృద్ధికి ప్రణాళికలను రూపొందించనున్నారు. అయిదు అంశాలను 39 కొలమానాలుగా విభజించి సంబంధిత ప్రభుత్వ శాఖల అధికారులు బృందాలుగా ఏర్పడి ప్రణాళికలను సిద్ధం చేస్తారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న వివిధ పథకాలు కచ్చితంగా లబ్ధిదారులకు అందేలా ఈ కార్యక్రమాన్ని చేపడతారు.

ప్రాధాన్యాంశాలు ఇవే..

వైద్యం: ఈ శాఖ అందిస్తున్న వైద్య సేవలు, గర్భిణులకు అందుతున్న వైద్యం, ప్రసవాలు, ఎదురవుతున్న సమస్యలు పరిష్కార మార్గాలపై నివేదికలు తయారు చేస్తారు. వైద్యఆరోగ్య కేంద్రాల పనితీరు, సిబ్బంది వివరాలు, మెరుగుపర్చాల్సిన అంశాలపై ప్రణాళికలు రూపొందిస్తారు.

స్త్రీ,శిశు సంక్షేమం: ఈ శాఖ ద్వారా గర్భిణులు, శిశువులకు అందుతున్న పౌష్టికాహారం, ఆయా అంగన్‌వాడీ కేంద్రాల్లో సౌకర్యాలు, మాతా, శిశువుల ఆరోగ్య పరిస్థితిపై సమగ్ర వివరాలను సేకరిస్తారు.

విద్య: విద్యా వసతులు ఎలా ఉన్నాయి. అక్షరాస్యత పెరుగుదలకు తీసుకుంటున్న చర్యలు, ఏ విధమైన వసతులు కల్పించాలనే విషయాలను గుర్తించి ఆ సమాచారాన్ని ఉన్నతాధికారులకు అందిస్తారు.

వ్యవసాయం: సాగు, పారిశ్రామిక రంగం, ప్రభుత్వ పథకాల అమలు తీరుతో పాటు అభివృద్ధి, గ్రామాలకు రహదారుల సౌకర్యం, ఇంటింటికీ శుద్ధి చేసిన తాగునీటి సరఫరా, వ్యక్తిగత మరుగుదొడ్ల సౌకర్యం, అర్హులైన లబ్ధిదారులకు సంక్షేమ పథకాల అమలుతో పాటు ఆర్థిక వనరుల లభ్యత, సాంకేతిక సమస్యలు, పలు అభివృద్ధి పనులపై సూక్ష్మస్థాయిలో పరిశీలన చేసి అభివృద్ధికి అవసరమైన ప్రణాళికలను సిద్ధం చేస్తారు. వాటి ఆధారంగా అభివృద్ధి పనులకు శ్రీకారం చుడతారు.

# విద్యానిధి అందుకో.. విదేశాల్లో చదువుకో..!



నల్గొండ : విదేశాల్లో చదవడం పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఓ కలగా మిగిలిపోతోంది. ప్రతిభావంతులైన పేద విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను చేరుకోలేకపోతున్నారు. అలాంటి వారి కోసమే ఓవర్సీస్ విద్యానిధి పథకం అమలు చేస్తున్నారు. చాలామందికి అవగాహన లేకపోవడంతో వినియోగించుకోవడం లేదు. ప్రస్తుతం విద్యానిధి పథకానికి దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. విదేశీ యూనివర్సిటీల్లో చదవాలనే ఆసక్తి ఉన్న యువతకు ఈ పథకం వరంలా మారుతోంది.

మూడు పథకాల ద్వారా...:

విద్యానిధి ఓవర్సీస్ పథకం మూడు పథకాలుగా అమలు చేస్తున్నారు. ఎస్సీ, ఎస్టీ, విద్యార్థుల కోసం అంబేద్కర్ ఓవర్సీస్ విద్యానిధి, మైనార్టీ విద్యార్థుల కోసం ముఖ్యమంత్రి ఓవర్సీస్ విద్యానిధి, బీసీ విద్యార్థుల కోసం మహాత్మాజ్యోతిబా పులే ఓవర్సీస్ విద్యానిధి పథకాల పేరుతో అమలు చేస్తున్నారు. ఇందులో అర్హత సాధించిన విద్యార్థులకు రూ. 20 లక్షల వరకు ఆర్థిక సాయం అందుతుంది. ఈ రుణాన్ని రెండు విడతల్లో అందజేస్తారు. ఇప్పటి వరకు జిల్లాలో ఈ పథకం కింద సాయం పొంది విదేశాల్లో విద్యనభ్యసిస్తున్న వారి సంఖ్య అంతంత మాత్రంగానే ఉంది. ఈ ఏడాది రాష్ట్ర వ్యాప్తంగా వందల మంది విద్యార్థులను ఎంపిక చేయాలని ప్రభుత్వం నిర్దేశించింది. కుటుంబ ఆదాయం రూ. 5 లక్షల లోపు ఉండాలి.. డిగ్రీ, బీటెక్ పూర్తిచేసిన 35 ఏళ్ల లోపు విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. వారికి అమెరికాతో పాటు కెనడా, సింగపూర్, జర్మనీ, బ్రిటన్, న్యూజిలాండ్, జపాన్, ఫ్రాన్స్, దక్షిణ కొరియా, ఆస్ట్రేలియా తదితర దేశాల్లోని వర్సిటీల్లో చదువుకునేందుకు ఉపకార వేతనం అందుతుంది.

అర్హుల గుర్తింపు ఇలా..యూనిర్సిటీల్లో చేరేందుకు ప్రవేశ పరీక్ష పాయింట్ల ఆధారంగా విద్యానిధి పథకానికి అర్హులను గుర్తిస్తారు. టోఫెల్‌కు 60, ఐఈఎల్‌టీఎస్‌కు 60, జీఆర్‌ఈకి 260, జీఎంటీఏకు 500, పీఈటీకి 50 పాయింట్లు సాధిస్తే అర్హత సాధించే అవకాశాలుంటాయి. పీజీ, పీహెచ్‌డీ చేసే విద్యార్థులు డిగ్రీలో కనీసం 60 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించాలి. ఆసక్తి ఉన్న వారు ఈ నెల 30లోగా దరఖాస్తు చేసుకోవాలని సంబంధిత శాఖల కోరుతున్నారు.

# నిర్లక్ష్యం ఖరీదు నిండు ప్రాణం

జగిత్యాల : అవగాహన లోపం.. ఏమవుతుందిలే అనే నిర్లక్ష్యం.. నాసిరకం తీగలు వాడడం.. జాగ్రత్తలు పాటించకపోవడంతో విద్యుత్తు ప్రమాదాలు సంభవించి నిండు జీవితాలు బలవుతున్నాయి. ప్రమాదంలో ఇంటి పెద్దను కోల్పోయిన కుటుంబాలు కష్టాలపాలవుతున్నారు. విద్యుత్తు అధికారులు ప్రచారం నిర్వహిస్తున్నా నిర్లక్ష్యం వీడక ప్రమాదాల బారిన పడుతున్నారు. మృతుల్లో ఎక్కువగా రైతులు ఉండడం కలవర పరుస్తోంది. పశువులు సైతం పెద్ద సంఖ్యలో మృత్యువాత పడుతున్నాయి.

జిల్లాలో మొత్తం 5,04,252 అన్ని కేటగిరిల విద్యుత్తు కనెక్షన్లు ఉండగా అందులో గృహ కనెక్షన్లు 3,21,776 ఉన్నాయి. వ్యవసాయ కనెక్షన్లు 1,33,880 ఉన్నాయి. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో అత్యధికంగా వ్యవసాయ విద్యుత్తు కనెక్షన్లు ఉన్న జిల్లాగా జగిత్యాల నిలుస్తోంది. అయితే ఈ నాలుగేళ్లలో చూస్తే జిల్లాలో 115 మంది విద్యుత్తు ప్రమాదాలతో మృతిచెందినట్లు, 34 మంది గాయపడ్డారని సంబంధిత అధికారులు ప్రకటించారు. అయితే ప్రమాదంలో మృతిచెందిన వ్యక్తికి విద్యుత్తు సంస్థ రూ.5 లక్షలు అందిస్తుండగా పశువులు చనిపోతే రూ.40 వేల చొప్పున పరిహారం అందిస్తోంది. ఈ నాలుగేళ్లలో మృతి చెందిన వారికి రూ.5.75 కోట్ల పరిహారం రావాల్సి ఉండగా సంస్థ రూ.4.26 కోట్లను ఇప్పటికే బాధితుల కుటుంబ సభ్యులకు అందజేసింది. 241 పశువులు చనిపోగా రూ.96.40 లక్షల పరిహారం అందాల్సి ఉండగా రూ.75.29 లక్షలు అందజేశారు. ఈ నాలుగేళ్లలో 115 మంది మృతి చెందితే అత్యధికంగా 80 శాతం మంది రైతులే ఉండడం కలవర పరుస్తోంది.

అవగాహన తప్పనిసరి..

రైతులు వ్యవసాయ విద్యుత్తు మోటర్లను ఆన్‌చేసే సమయంలో వాటిని తాకి విద్యుత్తు ప్రమాదం జరిగి మరణిస్తున్నారు. అయితే విద్యుత్తు మోటారుకు ఎర్త్ వైరు పెట్టాలని, ఆన్ చేసే సమయంలో గ్లౌజ్‌లు వేసుకుని టెస్టర్‌తో చూసి ఆన్ చేయాలని అధికారులు సూచిస్తున్నారు. ఏళ్ల నాటి సర్వీసు వైరు కాలం చెల్లి ఉంటుంది. దానిని ఉపయోగించడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయి. ఏటా ఒకసారి అన్ని సరి చేసుకోవాలని విద్యుత్తు అధికారులు సూచిస్తున్నారు. ముఖ్యంగా వర్షాకాలంలో విద్యుత్తు ప్రమాదాలు ఎక్కువగా జరిగే అవకాశం ఉన్నందున జాగ్రతలు పాటించాలని, ఇంట్లో కూడా నాసి రకం తీగలు, ఇతర పరికరాలను వాడరాదని, చెడిపోయిన వాటి స్థానంలో కొత్తవి మార్చాలని సూచిస్తున్నారు. ఎక్కడైనా ప్రమాదకరంగా విద్యుత్తు నియంత్రికలు ఉన్నా.. తీగలు కిందకి వేలాడుతూ ఉంటే సిబ్బందికి లేదా కాల్ సెంటర్‌కు ఫిర్యాదు చేస్తే వెంటనే పరిష్కరిస్తామని జగిత్యాల ఎస్ఈ జి.సత్యనారాయణ తెలిపారు. పశువులు సైతం మేతకు వెళ్లి చనిపోయే అవకాశం ఉందని నియంత్రికలు, ఇనుప స్తంభాలకు దూరంగా మేతకు పంపాలని అధికారులు కోరారు.

జాగ్రత్తలు పాటించాలి

వర్షాకాలంలో విద్యుత్తు ప్రమాదాలు ఎక్కువగా జరిగే అవకాశం ఉంది. రైతులు, గృహ వినియోగదారులు ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు తప్పనిసరి తీసుకోవాలి. తడి చేతులతో విద్యుత్తు పరికరాలను తాకరాదు, తీగలను సరిచూసుకోవాలి. అన్ని గ్రామాలు, పట్టణాల్లో ప్రమాదాలపై అవగాహన కల్పిస్తున్నాం. రైతులు గ్లౌజ్ వేసుకుని మోటారు ఆన్ చేయాలి, ఎర్త్ ఏర్పాటు చేసుకుంటే చాలావరకు ప్రమాదాలను అరికట్టవచ్చు. జి.సత్యనారాయణ, ఎస్ఈ

# ఇంటింటికీ జ్వర పీడితులు!

కరీంనగర్ : వాతావరణంలో మార్పులకు ప్రజలు అతలాకుతలం అవుతున్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఇంటికొకరు జ్వర బాధితులున్నారు. దగ్గు, జలుబు, వైరల్ ఫీవర్‌తో జిల్లా ఆసుపత్రికి గత నెల నుంచి ప్రతి రోజు సగటున 650 మంది ఓపీకి వస్తున్నారు. వారిలో నాలుగు వందల వరకు జ్వరపీడితులే ఉంటున్నారు. జిల్లా ఆసుపత్రిలో తగిన వైద్య సేవలు అందిస్తుండడంతో త్వరగా కోలుకుంటున్నారు. వారం రోజుల కిందట అదనపు మంచాలను ఏర్పాటు చేశారు. ఇన్‌పేషెంట్లు తక్కువగా ఉంటున్నా.. ఓపీకి మాత్రం ఎక్కువగా వస్తున్నారు. జ్వరాల తీవ్రత, జిల్లా ఆసుపత్రిలో ఏర్పాట్లు తదితర వివరాలతో కథనం.

వాతావరణ మార్పులతో...జిల్లా ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలో 350 పడకల ఆసుపత్రికి సరిపడా పడక మంచాలు సిబ్బంది ఉన్నారు. భారీ వర్షాలకు తోడు విపరీత తేమ ఉక్కపోతతో ఒక్కసారిగా వాతావరణం మారిపోతుండడంతో రోగాలు బాగా పెరిగిపోయాయి. గత నెల నుంచి ఇప్పటివరకు ప్రతి రోజు ఆసుపత్రికి అన్ని విభాగాల్లో కలిపి 650 వరకు అవుట్ పేషెంట్లు వస్తున్నారు. సాధారణ రోజుల్లో అన్ని విభాగాల్లో 400 వరకు ఓపీ ఉంటుండగా, కాలానుగుణ వ్యాధుల కారణంగా అదనంగా మరో 300 వరకు చేరుతుంది. అడ్మిట్ అయ్యే



రోగులు అన్నీ విభాగాలలో కలిపి 70 వరకు ఉంటే జ్వరంతో అడ్మిట్ అయ్యేవారు 40 వరకు ఉంటున్నారని ఆసుపత్రి వర్గాలు వెల్లడించాయి.

40 రోజుల్లో 14,801 మందికి పరీక్షలు..

జిల్లా ఆసుపత్రిలో ఆగస్టు 1వ తేదీ నుంచి ఈనెల 11వ తేదీ వరకు మొత్తం 14,801 మంది రోగుల నుంచి 27,757 నమూనాలు తీసి 49,736 పరీక్షలు నిర్వహించారు. 601 మందిరి డెంగీ నమూనాలు తీసి పరీక్షించగా, 584 మందికి నెగెటివ్ రాగా 17 మందికి పాజిటివ్ వచ్చింది. చికున్‌గన్యాకు సంబంధించి 48 నమూనాలు పరీక్షించగా.. ఒక్కటి కూడా పాజిటివ్ రాలేదు.

నాలుగు రోజుల్లో డిశ్చార్జి

ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులు జ్వరం తగ్గడంతో నాలుగైదు రోజుల్లోనే ఇంటికి వెళ్తున్నారు. వైద్య బృందం సైతం ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండి చికిత్స అందిస్తోంది. ముందు జాగ్రత్త చర్యలో భాగంగా అదనపు పడక మంచాలను వార్డు బయట సిద్ధంగా ఉంచారు. రోగులందరికి ఎప్పటికప్పుడు రక్త పరీక్షలు నిర్వహిస్తున్నారు.

మూడు నెలలకు సరిపడా మందులు

కాలానుగణ వ్యాధుల నేపథ్యంలో జిల్లా ఆసుపత్రిలో మూడు నెలలకు సరిపడా మందులు అందుబాటులో ఉన్నాయి. వైద్యుల బృందం మెరుగైన వైద్యం అందిస్తోంది. ఆసుపత్రిలో అడ్మిట్ అయినవారు నాలుగు రోజుల్లో కోలుకుంటున్నారు. రోగులకు ఇంటి పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని దోమలు లేకుండా చూసుకోవాలని కౌన్సెలింగ్ ఇస్తున్నాం. ప్రజలు ఆసుపత్రి వైద్య సేవలు వినియోగించుకోవాలి. కృష్ణ ప్రసాద్, జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్

# అవసరాలకు తగ్గట్టు.. సిబ్బంది హేతుబద్ధీకరణ

భద్రాచలం : వైద్య, ఆరోగ్యశాఖ ఇటీవల తీసుకొచ్చిన ఉత్తర్వుల మేరకు త్వరలో రాష్ట్ర వ్యాప్తంగా 1,700 మంది సిబ్బంది సర్దుబాటు కానున్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఈ సంఖ్య 250 ఉంటుందని ప్రాథమికంగా అంచనా వేశారు. ఐటీడీఏ పరిధిని పరిగణనలోకి తీసుకుంటే అన్ని విభాగాల్లో 1,200 మంది ఉద్యోగులు సేవలందిస్తుండగా సుమారు 300 మందిపై సర్దుబాటు ప్రభావం ఉండనుంది. సిబ్బంది సంఖ్యను పరిశీలించి అవసరాలను గుర్తించి ఈ ప్రక్రియను అధికారులు చేపట్టనున్నారు. ఎక్కువమంది ఉన్నచోట నుంచి కొందరిని ఎంపిక చేసి తక్కువమంది విధులు నిర్వర్తిస్తున్న పీహెచ్‌సీలకు పంపించనున్నారు. దీనిపై ఆయా ఉద్యోగ సంఘాలు సమావేశాలను నిర్వహించి అభ్యంతరాలు వ్యక్తం చేస్తుండటంతో ఎప్పటి నుంచి ఈ ప్రక్రియ అమలవుతుందో కచ్చితంగా చెప్పలేకపోతున్నారు.



ఈసారి డిప్యూటీ కార్యాలయం వంతు

15 రోజుల క్రితం ఉత్తర్వు-142 వచ్చింది. దీనికి అనుబంధ ఉత్తర్వులు వస్తే హేతుబద్ధీకరణ (రేషనలైజేషన్) విధివిధానాలపై స్పష్టత రానుంది. అన్నీ అనుకున్నట్లు జరిగితే రెండున్నర నెలల్లోగా ఈ వ్యవహారం పూర్తి కానుంది. ఇది అమలైతే కొన్ని పీహెచ్‌సీల సిబ్బంది తమ చోటు కోసం వెతుక్కోవాలి. మలేరియా, కుష్ఠు, పారా మెడికల్ వంటి విభాగాలకు ప్రత్యేక అధికారులు ఉండరు. వీటిని ప్రోగ్రాం అధికారుల పర్యవేక్షణకు అప్పగించే వీలుంది. ఈ ప్రభావంతో భద్రాచలం రెవెన్యూ డివిజన్ పరిధిలోని ప్రాథమిక వైద్య సేవలను పర్యవేక్షించేందుకు ఐటీడీఏ ప్రాంగణంలోని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ కార్యాలయాన్ని ఎత్తివేయాల్సి ఉంటుంది. రాష్ట్ర విభజన తర్వాత పలు సంస్థల కార్యాలయాలు ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని వేర్వేరు చోట్లకు తరలిపోయాయి. ఇప్పుడు దీని వంతు వచ్చింది.

మలేరియా విభాగం ఉండేనా..?

డెంగీ, మలేరియా జ్వరాలకు భద్రాచలం మన్యం పెట్టింది పేరు. దోమల నియంత్రణకు జిల్లా మలేరియా అధికారితో పాటు సహాయ మలేరియా అధికారి సేవలు అందిస్తున్నారు. కొత్త నిబంధనల ప్రకారం వీరి స్థానంలో ప్రోగ్రాం అధికారులు బాధ్యతలు తీసుకుంటారు.

వైద్య కళాశాల కొత్తగూడెంలో ఉన్నందున భద్రాచలంలోని క్షయ వార్డును అక్కడకు తరలిస్తారన్న ప్రచారం సాగుతోంది. ఇది కార్యరూపం దాల్చితే ఇందులోని వైద్యులు, సిబ్బందిని జిల్లా కేంద్రానికి పంపించే వీలుంది. దీనిపై ఎలాంటి సమాచారం లేదని క్షయ విభాగం అధికారులు చెబుతున్నప్పటికీ మార్పు దిశగానే చర్యలు మొదలైనట్లు తెలిసింది. బూర్గంపాడు, ఇల్లెందు వంటి ఆసుపత్రుల్లో వైద్య ఆరోగ్యశాఖకు చెందిన కొంతమంది సిబ్బంది పనిచేస్తున్నారు. హేతుబద్ధీకరణలో భాగంగా వీరంతా తమ వాస్తవ పోస్టు అయిన పీహెచ్‌సీలకు వెళ్లాల్సి ఉంటుంది. పదుల సంఖ్యలో సిబ్బంది సొంత స్థానాలకు వెళ్తే పెద్దాసుపత్రులకు కొంత ఇబ్బంది తలెత్తే వీలుంది. ఖాళీ పోస్టులను భర్తీ చేయనున్నందున ఇబ్బంది ఉండదని అధికారులు చెబుతున్నారు.

రాష్ట్ర వ్యాప్తంగా 20కి పైగా పీహెచ్‌సీలు మంజూరైనందున ఇందులో ఒకదాన్ని భద్రాచలంలో ఏర్పాటు చేయనున్నట్లు సమాచారం.

# పడకేసిన పర్యాటక ప్రగతి

జనగామ : జఫర్‌గఢ్ ప్రాంతం భక్తి, పర్యాటక ప్రాంతంగా విరాజిల్లుతోంది.. పాలకులు పట్టించుకోపోవడంతో నాటి చారిత్రక ఆనవాళ్లు కనుమరుగవుతున్నాయి. జఫర్‌గఢ్‌ను పూర్వం 'వేల్పుగొండ'గా పిలిచేవారు. జైనులు, కాకతీయుల కాలంలో ఇక్కడి పడమర కొండ వెనుక ఉన్న 'పాతూరు'లో గ్రామం ఉండేది. నాటి కాలంలో గంటల గుడి(శివాలయం), సుప్రసన్న నరసింహస్వామి, కొండసింగరాయగుడి, శ్రీరంగనాయకుని గుడి, అళ్వార్‌స్వామి గుడి నిర్మించారు. ఏడు దశాబ్దాలుగా ఈ ఆలయాలను పట్టించుకోపోవడంతో శిథిలావస్థకు చేరాయి. ఆలయ గర్భ గుడిలో గుప్త నిధుల కోసం గుర్తు తెలియని వ్యక్తులు తవ్వకాలు జరిపారు. గంటల గుడికి ఎదురుగా ఉన్న రాతి స్తంభంపై ఉన్న భద్రకాళి అమ్మవారి పంచలోహ విగ్రహాన్ని అపహరించారు.

రూ.6 కోట్లు మంజూరైనా..

ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేయాలని స్థానిక ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య సీఎం కేసీఆర్ 2017 మార్చిలో పాలకుర్తికి వచ్చిన సందర్భంగా విన్నవించారు. దీంతో సీఎం స్పందించి రూ.6 కోట్ల నిధులు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించి విడుదల చేశారు. దాదాపు రూ.70 లక్షలతో హనుమకొండ ధర్వాజ నుంచి దాదాపు కిలోమీటరు వరకు సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టి గుత్తేదారు మధ్యలోనే నిలిపివేశారు. కొండ కింది నుంచి పై వరకు రహదారి నిర్మాణం చేపట్టాలని ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తే పనులు పూర్తి చేసేందుకు గుత్తేదారు నిర్లక్ష్యం చేస్తున్నా పట్టించుకోవడం లేదని గ్రామస్థులు చెప్పారు.

ప్రమాదకరంగా కోనేర్లు..

లక్ష్మీనరసింహస్వామిని దర్శనం చేసుకోవడానికి తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, రాజస్థాన్ రాష్ట్రాల నుంచి భక్తులు తరలి వచ్చి స్వామిని దర్శించుకునే వారు.. భక్తులు ఆలయానికి ఎదురుగా ఉన్న కోనేరులో స్నానమాచరిస్తారు. కోనేరు వద్ద ఎలాంటి రక్షణ, మెట్లు లేకపోవడంతో జారిపడి ఇప్పటికి దాదాపు 20 మంది వరకు మృత్యువాత పడ్డారు. కోనేరు చుట్టూ రక్షణ వలయాల కోసం నిధులు మంజూరైనా పట్టించుకునేవారే కరవయ్యారు. లక్ష్మీనరసింహస్వామి ఆలయ గోపురం, విశ్రాంతి గది, వంటశాల కోసం నిధులు మంజూరైనా నేటికీ పనులు మొదలుపెట్టలేదు. కొండ కింద భక్తుల విశ్రాంతి కోసం ప్రత్యేక గదులు నిర్మించేందుకు నిధులు విడుదల చేసి ఏడేళ్లు కావస్తున్నా పనుల జాడేలేదు.

పనులపై పర్యవేక్షణ చేస్తా..- ఎమ్మెల్యే రాజయ్య

తాను ఉప ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో జఫర్‌గఢ్ ప్రాంతాన్ని పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేయాలని సీఎంకు విన్నవించగా రూ.6 కోట్ల నిధులు మంజూరు చేశారు. లక్ష్మీనరసింహస్వామి ఆలయ పరిస్థితి గురించి తెలుసుకోవడానికి స్వయంగా కొండను ఎక్కిన తొలి ఎమ్మెల్యేను నేనే.. పనుల అలస్యంపై అధికారులతో సమీక్ష సమావేశం ఏర్పాటు చేసి వేగవంతం అయ్యేలా చూస్తాను.

# హత విధీ.. ఇదేం వరి



సత్తుపల్లి : నాటు వేసిన తర్వాత పచ్చబడిన వరిపైరు చూసి రైతులు సంతోషపడ్డారు. నెల రోజులకే వరికంకులు ఏర్పడటంతో దిగ్భ్రాంతికి లోనయ్యారు. పొలంలో సగం కంకులు, మిగతా సగం అసలు చిరుపొట్ట దశకు కూడా రాకపోవడంతో లబోదిబోమంటున్నారు. కల్తీ విత్తనాలతోనే నిండా మునిగామని ఆవేదన చెందుతున్నారు. తమకు న్యాయం చేయాలని అధికారులు, ప్రజాప్రతినిధులను వేడుకొంటున్నారు.

పొలంలో సగమే కంకులు..సత్తుపల్లి మండలం కొత్తూరు, సత్తుపల్లి గ్రామాల రైతులు మందపాటి సోమిరెడ్డి, జి.సుధాకర్‌రెడ్డి, యరమల శ్రీనివాసరెడ్డి, కర్నాటి వెంకట నారాయణరెడ్డి తమకు వేశ్యకాంతల చెరువు ఆయకట్టు కింద ఉన్న 34 ఎకరాల్లో జులై నెలలో ఖరీఫ్ వరి సాగు చేపట్టారు. సత్తుపల్లిలోని తెలంగాణ ఆగ్రోరైతు సేవా కేంద్రంలో ఓ కంపెనీకి చెందిన ఎంటీయూ 1061 రకం వరి విత్తనాలు తెచ్చి సాగు ప్రారంభించారు. సాధారణంగా 75 రోజుల్లో సదరు వరి పైరు చిరుపొట్ట దశకు రావాల్సి ఉండగా కేవలం 60 రోజుల్లోనే ఏకంగా కంకులు ఏర్పడి ఈనాయి. మొత్తం పంటలో 50శాతం ఈనగా మరో సగం అసలు చిరుపొట్ట దశ కూడా కన్పించడం లేదు. దీన్ని గుర్తించిన రైతులు తాము కల్తీ విత్తనాలతో నష్టపోయామని ఆందోళన చెందుతున్నారు. నవంబరు 20 నాటికి కోతలు చేపట్టాల్సి ఉండగా అక్టోబర్ 15 నాటికే కోత దశకు వచ్చేలా ఉంది. దీంతో సగం ధాన్యం నేలరాలి, ఎలుకలు, పక్షుల వల్ల దెబ్బతింటుందని, తాలు శాతం ఎక్కువగా వచ్చి ఎకరాకు 40 బస్తాలకు బదులు 20 బస్తాలు మాత్రమే వస్తుందని లబోదిబోమంటున్నారు. ఇప్పటికే ఎకరాకు రూ.40వేల వరకు పెట్టుబడి పెట్టామని, కౌలుకు మరో రూ.16వేల చొప్పున చెల్లించామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై బాధిత రైతులు ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్యకు ఫిర్యాదు చేయగా ఏవో, ఖమ్మం జేడీతో ఎమ్మెల్యే మాట్లాడారు. సంబంధిత కంపెనీ వరి విత్తనాలు జిల్లాలోని పలు మండలాల్లో రైతులు కొనుగోలు చేసి సాగు చేపట్టినట్లుగా తెలుస్తోంది.

రెండు, మూడు రోజుల్లో రానున్న శాస్త్రవేత్తలు

స్థానిక వేశ్యకాంతల చెరువు ఆయకట్టులో కల్తీ విత్తనాల సాగుపై వచ్చిన ఫిర్యాదుల నేపథ్యంలో ఏడీఏ యు.నరసింహారావు, ఏఓ శ్రీనివాసరావు సదరు పంటలను మంగళవారం పరిశీలించారు. రెండు,మూడు రోజుల్లో పంటలను పరిశీలించేందుకు వ్యవసాయ శాస్త్రవేత్తలు రానున్నారని వారు తెలిపారు. ఎంత నష్టం, ఎలా జరిగింది అనే అంశాలపై వారు పరిశోధన చేయనున్నారని వివరించారు. విషయం తెలుసుకున్న సదరు విత్తన కంపెనీ ప్రతినిధి సైతం పంటలను పరిశీలించి ఎక్కడ పొరపాటు జరిగిందో ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. వీరి వెంట బాధిత రైతులు మందపాటి సోమిరెడ్డి, గొర్లమారి సుధాకర్‌రెడ్డి, కర్నాటి వెంకటనారాయణరెడ్డి పాల్గొన్నారు.

రూ.2.75లక్షలు నష్టంమొత్తం పదకొండు ఎకరాల్లో సాగు చేపట్టా. ఎకరాకు రూ.30వేల వరకు పెట్టుబడి అయింది. సాధారణంగా ఎకరాకు 40 బస్తాలు దిగుబడి రావాల్సి ఉంది. కల్తీ విత్తనాల వల్ల 20 బస్తాలు మాత్రమే వచ్చేలా ఉంది. దీంతో రూ.2.75లక్షల నష్టపోవాల్సి వస్తోంది.జి.సుధాకర్‌రెడ్డి, రైతు, కొత్తూరు

# దండిగా యూరియా



ఖమ్మం : కొద్ది రోజులుగా రాష్ట్రంలో యూరియా కొరత ఏర్పడటంతో ప్రభుత్వం అప్రమత్తమైంది. ప్రస్తుతం రైతులకు అవసరమున్న ప్రాంతాలకు యూరియాను సరఫరా చేస్తోంది. ఇందులో భాగంగా రెండు రోజులుగా ఖమ్మం రైల్వే రేక్ పాయింట్ ద్వారా నల్గొండ, సూర్యాపేట జిల్లాలకు 1,000 మెట్రిక్ టన్నుల చొప్పున పంపించింది. ఆ రెండు జిల్లాల్లో ఉన్న కొరతను దృష్టిలో పెట్టుకుని రాష్ట్ర వ్యవసాయశాఖ కమిషనరేట్ ఆదేశాల మేరకు నిల్వలను తరలిస్తున్నారు. అక్కడ పరిస్థితి కొంతవరకు సద్దుమణిగింది. గత ఏప్రిల్ నుంచి ఈనెల 7 వరకు 36 రైల్ వ్యాగన్ల ద్వారా ఖమ్మం పాయింట్‌కు 58,571.785 మెట్రిక్ టన్నుల యూరియా వచ్చింది. ఈ నిల్వల్లో 40 శాతం ప్రైవేటు డీలర్లకు, 40 శాతం మార్క్‌ఫెడ్‌కు, 20 శాతం ఆగ్రోస్‌కు అధికారులు పంపిణీ చేశారు. మార్క్‌ఫెడ్ బఫర్ నిల్వల నుంచి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు, రైతు సేవా కేంద్రాలకు సరఫరా చేశారు. ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో రైతులకు అవసరమైనన్ని యూరియా నిల్వలను సిద్ధంగా ఉంచారు. కొద్దిరోజుల నుంచి కురుస్తున్న వర్షాల నేపథ్యంలో ఆయా మండలాలకు నిల్వలను తరలించారు. ఉభయ జిల్లాల్లో అత్యధికంగా సాగవుతున్న ప్రధాన పంటలైన పత్తి, వరి, మిరప, మొక్కజొన్నకు ఇబ్బంది లేకుండా వ్యవసాయశాఖ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

మండలాల వారీగా నిల్వలు ఇలా (మె.ట.)

కొణిజర్ల 560.79, ఖమ్మం అర్బన్ 485.805, వైరా 436.15, వేంసూరు 335.66, తిరుమలాయపాలెం 321.083, కామేపల్లి 320.96, ముదిగొండ 306.47, నేలకొండపల్లి 303.43, సత్తుపల్లి 299.925, ఖమ్మం గ్రామీణం 284.265, చింతకాని 246.87, కల్లూరు 227.78, బోనకల్లు 226.021, మధిర 218.43, కూసుమంచి 162.21, ఎర్రుపాలెం 153.155,పెనుబల్లి 127.959, ఏన్కూరు 123.305, రఘునాథపాలెం 122.94, సింగరేణి 96.89, తల్లాడ 63.215.

# ఆరడుగుల స్థలం.. అక్కరకురాని వైకుంఠం




కొత్తగూడెం : 'స్వతంత్ర దేశంలో చావు కూడా పెళ్లిలాంటిదే బ్రదర్' అన్నాడో కవి. పల్లెల్లో ఎవరైనా మరణిస్తే మృతదేహానికి అంతిమ సంస్కారాలు చేయటాన్ని పవిత్ర కార్యంగా భావిస్తారు. అందుకే మనిషి చివరి మజిలీకి ఇబ్బందులు కలగకుండా ప్రభుత్వం ప్రతి గ్రామంలో వైకుంఠధామాలను నిర్మించింది. అయితే కొన్నిచోట్ల అవి ఉపయోగపడటం లేదని పలువురు చెబుతున్నారు.

అవగాహన లేమి..! గిరిజనులు ఎక్కువగా ఉన్న గ్రామాల్లో శ్మశానవాటికలను ఉపయోగించుకోవటం లేదు. తమ సంప్రదాయాలకు అనుగుణంగా వైకుంఠధామాలు లేవని స్థానికులు చెబుతున్నారు. కొన్ని గ్రామాల్లో వాస్తు ప్రకారం నిర్మించలేదని వాడటం లేదు. ఇలాంటి వాటిపై అధికారులు కల్పిస్తే బాగుంటుందనేది పలువురి అభిప్రాయం

తిరుమలాయపాలెం మండలం అజ్మీరతండాలోని వైకుంఠధామం ఇది. గతేడాది, ఇటీవల ఆకేరు వరదలకు శ్మశానవాటిక చెల్లాచెదురైంది. గ్రామంలో ఎవరైనా మరణిస్తే వాగు ఒడ్డున అంతిమ సంస్కారాలు నిర్వహిస్తున్నారు. అధికారులు స్పందించి వెంటనే మరమ్మతులు చేయిస్తే వినియోగించుకోవటానికి అవకాశం ఉంటుందని స్థానికులు చెబుతున్నారు.ములకలపల్లి మండలం మాధారంలోని వైకుంఠధామం ఇది. రూ.12లక్షలతో 2020లో దీన్ని అధికారులు పూర్తి చేశారు. పంచాయతీ పరిధిలో అనువైన భూమి లేకపోవడం వల్ల సత్యంపేట శివారులో నిర్మించారు. మాధారంలో ఎవరైనా చనిపోతే మృతదేహాన్ని సత్యంపేట మీదుగా శ్మశానవాటికకు తరలించాల్సి వస్తుండటంతో గ్రామస్థులెవరూ అక్కడ అంతిమ సంస్కారాలు నిర్వహించటానికి ఆసక్తి చూపటం లేదు. పైగా దీన్ని పంట పొలాల మధ్యలో నిర్మించటంతో అటువైపు వెళ్లటానికి దారిలేక.. అంతిమ సంస్కారాలు నిర్వహిస్తున్నారు.

# ఖాళీ ప్లాట్లు.. కాలనీవాసుల పాట్లు

జనగామ : పట్టణంలోని ఖాళీ ప్లాట్లు చెత్త కేంద్రాలకు నిలయంగా మారాయి. దోమలు, విష కీటకాలు, పందులు స్వైరవిహారం చేస్తుండటంతో ఆయా కాలనీవాసులకు ఇబ్బందులు తప్పడం లేదు. కొన్ని చోట్ల నీరు నిలిచి మురుగు గుంతలుగా మారాయి. వరుస వర్షాలతో శివారు కాలనీలకు వరదనీటి ప్రమాదం ఉంది. పక్కా రహదారులు, కాల్వలు లేని కాలనీలకు రంగప్ప చెరువు వరద, మురుగునీరు ముప్పుగా మారింది. సరైన దిశ, దశ లేని పట్టణ ప్రణాళిక విభాగం, పట్టింపు లేని పురపాలిక అధికారులు, పాలకవర్గం, పౌరస్పృహ లేని ప్లాట్ల యజమానుల కారణంగా ఆయా ప్రాంతవాసులకు ఇబ్బంది కలిగిస్తున్నాయి. వర్షాకాలంలో నీరు నిలిచి అపరిశుభ్ర వాతావరణం ఏర్పడిన సమయంలో పారిశుద్ధ్య విభాగంపై ఒత్తిడి పెరుగుతోంది.

జోరుగా క్రయవిక్రయాలు

వేగంగా విస్తరిస్తున్న జనగామ పట్టణంలో భవిష్యత్తు అవసరాలను దృష్టిలో పెట్టుకుని స్థలాల క్రయ, విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. ఈ ప్రాంతం వారే కాకుండా పక్క జిల్లాల వారు సైతం ఇక్కడి భూములపై పెట్టుబడులు పెడుతున్నారు. శ్రీనగర్ కాలనీ, సాయినగర్, శ్రీవిల్లాస్ కాలనీ, జీఎం గోకుల్‌నగర్, బాలాజీనగర్, జ్యోతినగర్, ప్రగతినగర్, దుర్గానగర్, బతుకమ్మ కుంట, గీతానగర్, వికాస్‌నగర్ తదితర వీధుల్లో స్థలాలకు డిమాండ్ ఉంది. కొంత మంది ఇళ్లు కట్టుకోగా మరికొంత మంది స్థలాపై పెట్టుబడి పెట్టి వదిలేస్తున్నారు. యజమానులు ఎవరో తెలియని పరిస్థితి ఏర్పడింది. దీంతో ఆ ప్లాట్లతో




అవస్థలు ఏర్పడుతున్నాయి.

పన్ను వసూలులో అశ్రద్ధ

ఇల్లు కట్టే ఆలోచన లేనప్పుడు ఇరుగు పొరుగు వారికి ఇబ్బంది కలగకుండా ఎప్పటికప్పుడు స్థలాన్ని చదును చేయించాలి. నీరు బయటకు పోయేలా ఏర్పాట్లు చేయాలి. ఇలా చేయని ప్లాట్ల యజమానులను గుర్తించి మున్సిపల్ అధికారులు నోటీసులు జారీ చేయాలి. పట్టించుకోని పక్షంలో పురపాలిక ఆధ్వర్యంలో వాటిని చదును చేయించి, అందుకు అయిన ఖర్చును యజమాని నుంచి చట్టబద్ధంగా జరిమానాతో సహా వసూలు చేయవచ్చు. ఇలాంటి స్థలాలను గుర్తించి పన్ను వేయాల్సి ఉంటుంది. ఖాళీ స్థలాలకు ఆస్తి పన్ను విధించి ఆదాయాన్ని పొందే అవకాశం ఉన్నా పుర అధికారులు ముందుకు వెళ్లడం లేదు. స్థల యజమానుల సమాచారం లేదని పురపాలక పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు అంటున్నారు.

ప్రభుత్వ స్థలాలదీ అదే దుస్థితి

ప్రభుత్వ కార్యాలయాలు, విద్యా సంస్థలు, అంతర్గత, ప్రధాన రహదారుల వెంట ఉన్న గ్రీన్‌బెల్టు, తదితర స్థలాలు చెత్తకుండీలుగా, మురుగునీటి నిలయాలుగా మారుతున్నాయి. గుండ్లగడ్డ కబేలా నుంచి పాలకేంద్రం వరకు 60 అడుగుల రహదారి, రైలు పట్టాల మధ్య ఖాళీ స్థలం డంపింగ్ యార్డుగా మారాయి. నిర్మాణ వ్యర్థాలు, వివిధ కార్యాల భోజన వ్యర్థాలు, ప్లాస్టిక్ వ్యర్థాలు ఈ దారుల వెంట పడేస్తున్నారు. ఈ ప్రాంతాలను శుభ్రం చేసేందుకు ఏటా రూ.లక్షల్లో ఖర్చు చేస్తున్నారు.

గుర్తించి చర్యలు తీసుకుంటా- జె.రజిత, మున్సిపల్ కమిషనర్

ఖాళీ స్థలాల సమస్య మా దృష్టిలో ఉంది. స్థలాల యజమానుల గుర్తింపే సమస్యగా ఉంది. అమ్మకాలు, కొనుగోల్లు జోరుగా సాగుతుండటంతో ఆయా ప్లాట్ల పక్క వారికే యజమానులు ఎవరో తెలియడం లేదు. ప్రజల నుంచివచ్చే ఫిర్యాదులను పరిశీలించి చర్యలు తీసుకుంటాం.

# సింగరేణిలో 'సౌర'భాలు

సింగరేణి : సంస్థ సౌర విద్యుత్తు కేంద్రాలు అందుబాటులోకి తీసుకొస్తోంది. ఇప్పటికే సింగరేణి వ్యాప్తంగా తొమ్మిది ఏరియాల్లో 224 మెగావాట్ల సామర్థ్యం గల సౌర విద్యుత్తు కేంద్రాలను నిర్మించింది. తాజాగా మరో ముందడుగు వేసింది. మరో 232 మెగావాట్ల సామర్థ్యం గల కేంద్రాలను నిర్మించబోతోంది. ఈ మేరకు ప్రణాళిక రూపొందించింది. ఇందులో భాగంగా భూపాలపల్లి ఏరియాలో 10 మెగావాట్ల ప్లాంటు ఏర్పాటు చేయనుంది. విద్యుత్తు ఉత్పత్తిలో స్వయం సమృద్ధి దిశగా సింగరేణి వేగంగా అడుగులు వేస్తోంది. 1200 మెగావాట్ల థర్మల్ విద్యుత్తు ఉత్పత్తి చేస్తోంది. 224 ఎంవీ సౌర విద్యుత్తును సైతం అందుబాటులోకి తీసుకొచ్చింది. ఇక రెండో దఫాలో రానున్న రెండేళ్లలో మరో 232 మెగావాట్ల ప్లాంట్లను నిర్మించి ఉత్పత్తి ప్రారంభించనుంది. ఇందుకు తగిన కసరత్తు మొదలుపెట్టింది. 2024 డిసెంబర్ నాటికి పూర్తి చేయాలనే లక్ష్యాన్ని నిర్దేశించుకుంది.

రూ.1,349 కోట్ల వ్యయంతో..రెండో దశలో రూ.1,349 కోట్లతో 232 మెగావాట్ల సామర్థ్యంతో సౌర విద్యుత్తు కేంద్రాల ఏర్పాటుకు దేశవ్యాప్త టెండర్లను సింగరేణి ఆహ్వానించింది. రాష్ట్రవ్యాప్తంగా 8 ఏరియాల్లో యూనిట్లను నిర్మించనుంది. టెండర్ గడువు ఈ నెల 25వ తేదీగా నిర్ణయించింది. ఉత్పత్తి మొదలైతే రూ.500 కోట్ల విలువైన విద్యుత్తు ఆదా అవుతుందని సింగరేణి యాజమాన్యం భావిస్తోంది. అదేవిధంగా మొదటి దఫాలో మిగిలిన 76 మెగావాట్ల సామర్థ్యం గల యూనిట్లు నెలకొల్పే పనులు తుది దశలో ఉన్నాయి. పూర్తిచేసి ఉత్పత్తి ప్రారంభిస్తే మొదటి దశ లక్ష్యం పూర్తికానుంది. మొత్తంగా కలిపితే 2024 డిసెంబర్ నాటికి 532 ఎంవీ విద్యుత్తు ఉత్పత్తి అవుతుందని, నిర్దేశిత లక్ష్యం ఛేదించినట్లవుతుందని కంపెనీ భావిస్తోంది. భూపాలపల్లి ఏరియాలో ఇప్పటికే 10 ఎంవీ సౌర విద్యుత్తు కేంద్రం నిర్మించారు. గతేడాది నుంచి విద్యుత్తు ఉత్పత్తి చేస్తున్నారు. తాజాగా మరో 10 ఎంవీ ప్లాంట్ ఏర్పాటుకు యాజమాన్యం చర్యలు చేపట్టింది. టెండర్ ప్రక్రియ కూడా మొదలైంది. పట్టణంలోని సీఆర్‌నగర్‌లో ప్రస్తుతానికి ఉన్న ప్లాంట్ పక్కనే కొత్త కేంద్రాన్ని నిర్మించేందుకు ఆలోచనలు చేశారు. 45 ఎకరాల భూమిలో సౌర పలకలు ఏర్పాటు చేసి విద్యుదుత్పత్తి చేపట్టనుంది.

'జీరో పవర్' సంస్థగా..సింగరేణి కంపెనీ ఏటా గనులు, కాలనీల అవసరాలకు సుమారు 700 మిలియన్ యూనిట్ల విద్యుత్తు వినియోగిస్తోంది. దీని కోసం తెలంగాణ డిస్కంకు సుమారు రూ.490 కోట్లు చెల్లిస్తోంది. ఈ భారాన్ని తగ్గించుకుని 'జీరో పవర్' సంస్థగా దేశంలోనే ప్రథమంగా నిలవాలనే లక్ష్యంతో 2020 సౌర కేంద్రాల నిర్మాణాలకు శ్రీకారం చుట్టారు. ఇప్పటివరకు 224 మెగావాట్ల సామర్థ్యం గల ప్లాంట్లను నిర్మించి 731 మిలియన్ యూనిట్ల విద్యుత్తును ఉత్పత్తి చేశారు.

# కవలల కలల సేద్యం

ఇల్లెందు : వారిద్దరు కవలలు. ఇద్దరి అభిరుచులు, ఆలోచనలు ఒక్కటే. ఇద్దరూ కూడా ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ పూర్తి చేశారు. ఎలక్ట్రికల్ సైట్ ఇంజనీర్లుగా ఇద్దరికి ఉద్యోగాలు కూడా వచ్చాయి. కొన్నాళ్లపాటు ఉద్యోగాలు చేసి ఆ తర్వాత వదిలేశారు. అందుకు ప్రధాన కారణం.. వ్యవసాయంపై వారికున్న మక్కువే.. వారే టేకులపల్లి మండలం చింతోనిచెలకకు చెందిన కంభంపాటి చంద్రశేఖర్‌రావు-విజయ దంపతుల కుమారులు కంభంపాటి నరేష్, కంభంపాటి నవీన్ సోదరులు.

చదివింది ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్..ఇద్దరు కవలలు కావడమే కాదు.. వారి ఇద్దరి ఆలోచనలు కూడా ఒక్కటయ్యాయి. తాము చదివిన చదువుకు ఏమాత్రం పొంతనలేని వ్యవసాయం.. అది కూడా ప్రకృతి సేద్యం చేయాలనుకోవడం.. అనుకున్నదే తడువుగా ఇంటికి చేరుకుని తమకున్న వ్యవసాయ భూమిలో ఓ 15 ఎకరాలు ప్రకృతి వ్యవసాయానికి మళ్లించి 'చెలక-సేద్యం' పేరిట ఏడాది క్రితం తమ కార్యదీక్షను మొదలుపెట్టారు. పంచగవ్య, జీవామృతం, బ్రహ్మాస్త్రా వంటి ఆర్గానిక్ ఎరువులను పంటలకు పిచికారీతోపాటు భూమికి ఎరువుగా ఇస్తున్నారు. ఐదేళ్లలో భూమిని రీపేరు చేయడం ద్వారా పెట్టుబడి లేకుండానే ఎకరాకు 40 బస్తాల ధాన్యం దిగుబడి సాధించాలనే లక్ష్యంతో కవల సోదరులు సేద్యం చేస్తున్నారు.

మొదటి విజయంతో మరింత జోష్..మొదటి ఏడాది 5 ఎకరాల్లో వరి పొలం, రెండున్నర ఎకరాలలో కూరగాయలు, ఎకరం లావుమిరప సాగు చేశారు. రెండున్నర ఎకరాల్లో బ్లాక్‌రైస్, రెండున్నర ఎకరాల్లో కుంకుమపువ్వు రైస్ సాగు చేశారు. కేవలం పంచగవ్య, ఘనజీవామృతం, అగ్ని అస్త్ర వంటి ఆవు వ్యర్థాలతో తయారు చేసిన మందులను మాత్రమే పిచికారీ చేసి మొదటి ఏడాది సఫలీకృతులయ్యారు. బ్లాక్‌రైస్ 20 బస్తాలు, కుంకుమపువ్వు 18 బస్తాలు దిగుబడి సాధించారు.



వాటిని బియ్యం పట్టించి ఆసక్తి గల వారికి విక్రయిస్తున్నారు. బ్లాక్‌రైస్ 25 కిలోల సంచి రూ.2,500, కుంకుమపువ్వు రైస్ 25 కిలోల సంచి రూ.1,800 చొప్పున విక్రయించారు. వరి పొలం ద్వారా రూ.2 లక్షలు, లావు మిరప ఎకరం సాగు చేయడం ద్వారా మరో రూ.2 లక్షలు ఆదాయం వచ్చింది. గత ఏడాది రెండున్నర ఎకరాల్లో సొరకాయ, బీరకాయ, కొత్తిమీర, క్యారెట్, కాకర, బెండ వంటి కూరగాయలను ప్రకృతి వ్యవసాయం విధానంలో పండించి సమీప కొత్తగూడెం పట్టణంలో విక్రయించారు. దిగుబడి తక్కువగా ఉన్నప్పటికీ ఫలసాయం మాత్రం రూ.1.50 లక్షలు ఆదాయం వచ్చినట్లు నరేష్, నవీన్ తెలిపారు. భావితరాలకు ఆదర్శంగా నిలిచేందుకు..కంభంపాటి నరేష్, నవీన్, కవలలు, చింతోనిచెలక

చదువుకున్నది ఇంజినీరింగ్ అయినప్పటికీ వ్యవసాయంపై మక్కువ ఎక్కువ. రసాయనిక ఎరువుల వినియోగం అధికం కావడంతో భూమిలో సారం తగ్గిపోయింది. నిర్జీవంగా మారిసారం కోల్పోయిన భూమిలో తిరిగి కర్బన శాతం పెంచేందుకు ప్రకృతి వ్యవసాయమే మేలనిపించింది. ఆవు వ్యర్థాలనే ప్రధాన ఎరువులుగా వినియోగించి జీవం కోల్పోయిన భూమిని తిరిగి ఐదేళ్లలో సాధారణ స్థితికి తీసుకురావచ్చు. రూపాయి పెట్టుబడి లేకుండా లాభసాటి వ్యవసాయం. ఆరోగ్యకరమైన ఆహార ఉత్పత్తులను ప్రజలకు అందించవచ్చు. కొంతలో కొంతైనా భావితరాలకు కూడా ప్రకృతి వ్యవసాయం అందించాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నాం.

# మూగజీవాల అక్రమ రవాణాకు అడ్డేది..?

ములుగు : మన్యంలో మూగజీవాల అక్రమ రవాణాకు అడ్డే లేకుండా పోతోంది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల కేంద్రంగా వెంకటాపురం, ఏటూరునాగారం మార్గంలో అక్రమార్కులు పశువులను కబేళాలకు తరలించడం పరిపాటిగా మారింది. వెంకటాపురం మండలం సూరవీడు కాలనీ వద్ద మిర్చి బస్తాల లారీని పశువులతో వస్తున్న వాహనం ఢీకొనడంతో మరోసారి అక్రమ రవాణా వ్యవహారం వెలుగులోకి వచ్చింది. మూగజీవాలను తరలిస్తున్న వాహనాలను హమాలీలు, స్థానికులు అడ్డుకుని పోలీసులకు అప్పగించడంతో అక్రమ రవాణా గుట్టు రట్టైంది.

కార్మికులకు తప్పిన ప్రమాదం

మూగజీవాలను తరలిస్తున్న వాహనం మితిమీరిన వేగంతో దూసుకొచ్చి లారీలో వెనకవైపు లోడ్ చేసిన మిర్చి బస్తాలను ఢీకొట్టి వెళ్లినట్లు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. ఈ క్రమంలో వాహనంపై ఉన్న కార్మికులకు త్రుటిలో ప్రమాదం తప్పినట్లు వివరించారు. ఆ వాహనాన్ని నిలిపేందుకు ప్రయత్నించగా వేగంగా వెంకటాపురం వైపు వెళ్లిపోయింది. వెనకాలే పశువులతో మరో రెండు ట్రాలీ వాహనాలు రాగా స్థానికులు అడ్డుకున్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఒక్కో వాహనంలో 15కు పైగా మూగజీవాలను తరలిస్తున్నారు. అక్రమ రవాణాదారులు, వాహన చోదకులు, స్థానికుల మధ్య మాటామాటా పెరిగి వివాదానికి దారి తీసింది. కోపోద్రిక్తులైన స్థానికులు తమ ప్రాణాలతో చెలగాటమాడుతున్నారా అంటూ అక్రమార్కులతో గొడవ పడినట్లు తెలిసింది.

పోలీస్‌స్టేషన్‌కు తరలింపు

మూగజీవాల అక్రమ రవాణాకు పాల్పడుతున్న వాహనాలు వెంకటాపురం పోలీస్‌స్టేషన్‌కు చేరాయి. అర్ధరాత్రి జరిగిన వ్యవహారాన్ని స్థానికులు పోలీసులకు సమాచారం అందించగా అధికారుల సూచనలతో మూడు ట్రాలీ వాహనాలతో పాటు ఈ వ్యవహారంలో కీలకపాత్ర పోషిస్తున్న ఓ వ్యక్తి కారును సైతం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ వాహనాల్లో సుమారు 40కి పైగా మూగజీవాలు ఉన్నట్లు తెలిసింది. వాహనం ఢీకొనడంతో విలువైన మిర్చి నిల్వలు దెబ్బతిన్నాయని, ప్రాణాపాయం తప్పినట్లు స్థానికులు పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. అకారణంగా తమపై దాడి చేసినట్లు మూగజీవాలను తరలిస్తున్న వ్యక్తులు సైతం పోలీసులను ఆశ్రయించినట్లు సమాచారం. ఈ విషయంపై ఏఎస్సై అక్బర్‌పాషాను సంప్రదించగా ఎలాంటి అనుమతి పత్రాలు లేకుండా మూగజీవాలను తరలిస్తూ పట్టుబడిన నలుగురిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. మూడు వాహనాలు, మూగజీవాలను ఆధీనంలోకి తీసుకున్నామన్నారు. పూర్తి స్థాయిలో దర్యాప్తు చేయనున్నట్లు వివరించారు.

# గర్భిణులకు పోషకాహార అండ




ఖమ్మం : మన్యం ప్రాంతాల్లోని గర్భిణులు ఎంతో మంది రక్తహీనత (ఎనీమియా)తో బాధపడుతున్నారు. ప్రసవ సమయాల్లో కొందరు విషమ పరిస్థితులు ఎదుర్కొంటున్నారు. ఈ సమస్య అధిగమించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రయోగాత్మకంగా ఎనిమిది జిల్లాల్లో 'కేసీఆర్ న్యూట్రిషన్ కిట్లు' పంపిణీ చేస్తోంది. ఇందుకు భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని 44 ఆరోగ్య కేంద్రాల్లో వైద్య, ఆరోగ్య శాఖ ఏర్పాట్లు చేసింది. గత ఏడాది డిసెంబరు 21న కార్యక్రమం ప్రారంభమైన నాటి నుంచి ఈ నెల 23వ తేదీ నాటికి 6,390 మంది లబ్ధిపొందారు. ఆసుపత్రుల్లో రెండు, మూడోసారి పరీక్షలు (యాంటీనెటల్ కేర్-ఏఎన్‌సీ) చేయించుకున్న వారికి కిట్లు అందిస్తున్నారు. అత్యధిక లబ్ధిదారులున్న వాటిల్లో భద్రాచలం ఏరియా ఆసుపత్రి, కొత్తగూడెం పట్టణం రామవరంలోని మాతా, శిశు ఆరోగ్య కేంద్రం, మణుగూరు ఆసుపత్రులున్నాయి. అన్ని కేంద్రాలకు కలిపి 9,156 కిట్లు అందజేయగా.. పంపిణీ చేయగా 2,766 ముందస్తు నిల్వలున్నాయి.

లబ్ధి పొందేలా చైతన్యం పెంపొందిస్తున్నాం

డా.జేవీఎల్ శిరీష, డీఎంహెచ్ఓ

జిల్లావ్యాప్తంగా అన్ని ఆరోగ్య కేంద్రాల పరిధిలో గర్భిణుల వివరాలు నమోదు చేస్తున్నాం. వారిలో రెండు, మూడు పరీక్షలు (ఏఎన్‌సీ) పూర్తిచేసుకున్న వారికి కేసీఆర్ న్యూట్రిషన్ కిట్లు అందజేస్తున్నాం. వీటి కొరత లేకుండా ఎప్పటికప్పుడు ఇండెంట్ పంపి తెప్పిస్తున్నాం. ముందస్తుగా 2 వేలు పైగా నిల్వలు అందుబాటులో ఉంచుతున్నాం. మన్యం ప్రాంత గర్భిణుల్లో ఎనీమియా నివారణే లక్ష్యంగా చేపట్టిన పథకం ఇది. సమర్థంగా అమలు చేసేలా అధికారులు, సిబ్బందితో సమీక్షలు నిర్వహిస్తున్నాం. అర్హులందరూ లబ్ధిపొందేలా చైతన్యం పెంపొందిస్తున్నాం.

కిట్లో ఏముంటాయంటే

జాటోతు సునీత, గర్భిణి, కాలువ తండా

ప్రధానంగా రక్తహీనత సమస్య అధిగమించాలనే లక్ష్యంతో అందజేస్తున్న 'న్యూట్రిషన్ కిట్' విలువ రూ.2 వేలు ఉంటుంది. దీంట్లో కిలో పోషకాహార మిశ్రమ పదార్థాల పొడి, కిలో ఖర్జూర, మూడు బాటిళ్ల ఐరన్ సిరప్, అరకిలో నెయ్యి, ఒక కప్పు ఉంటాయి. 'రోజువారీ ఆహారంతో పాటు ప్రత్యేక పోషకాహారాన్ని తీసుకోవడం వల్ల రక్తహీనత సమస్య బారినపడకుండా ఉంటామన్న ధైర్యం కలుగుతోంది. కిట్లో ఉన్నవాటిని ఎప్పుడెలా తీసుకోవాలో ఏఎన్‌ఎంలు వివరిస్తున్నారు. వారి సలహా ప్రకారం వైద్య పరీక్షలు కూడా చేయించుకుంటున్నాను.'

# రైలు నిలయం.. వసతులు గగనం



ఖమ్మం : స్వాతంత్ర్యానికి పూర్వం నిర్మించిన రైలు నిలయాలు అసౌకర్యాలకు నెలవులుగా నిలుస్తున్నాయి. దీంతో ప్రయాణికులు అవస్థలు ఎదుర్కొంటున్నారు. నిత్యం వేల సంఖ్యలో ప్రయాణాలు సాగిస్తున్నా.. కూర్చోవడానికి బల్లలు, నీడకోసం కనీసం షెడ్లుకూడా లేని పరిస్థితి. ఈ ఏడాది బడ్జెట్లో రైల్వే శాఖకు ఆశాజనకంగానే నిధులు కేటాయించారు. ఈసారైనా సౌకర్యాలు మెరుగవుతాయని ఉమ్మడి జిల్లా ప్రజలు ఆశగా ఎదురు చూస్తున్నారు. రైల్వే శాఖ స్పందించి కనీస సౌకర్యాలు కల్పించాలని ప్రయాణికులు కోరుతున్నారు. ఉభయ జిల్లాల్లో 20 రైలు నిలయాలకు గాను ఖమ్మం జిల్లాలోని మధిర నియోజకవర్గంలో అత్యధికంగా ఉన్నాయి. అందులో ఎర్రుపాలెం, తొండలగోపవరం, మధిర, బోనకల్లు, మోటమర్రి, నాగులవంచ, చింతకాని, పందిళ్లపల్లి మొత్తం ఎనిమిది స్టేషన్లున్నాయి. ఒక్క మధిర మినహా ఏ ఒక్క స్టేషన్‌లో సరైన సౌకర్యాలు లేవు. ఏళ్లుగా ఆయా స్టేషన్‌ల పరిధిలో ప్రయాణికులు రైల్వే ఉన్నతాధికారులకు, పార్లమెంటు సభ్యులకు వినతి పత్రాలు ఇస్తున్నా సమస్యలు పరిష్కారం కావడం లేదు. లాలూప్రసాద్ యాదవ్ రైల్వే మంత్రిగా ఉన్న సమయంలో ప్లాట్ ఫాంలను ఎత్తు పెంచారు. ఆ తర్వాత జరిగిన అభివృద్ధి పనులేవీ లేవు. బోనకల్లు స్టేషన్ పక్కనే ఉన్న సైడింగ్ ట్రాక్ వల్ల అక్కడి నుంచి నిత్యం బొగ్గు ఎగుమతి అవుతుంది. బొగ్గు లోడింగ్ సమయంలో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు.

భద్రాద్రి జిల్లాలోనూ..మణుగూరు, అశ్వాపురం, పాండురంగాపురం, గొల్లగూడెం, భద్రాచలం రోడ్, బేతంపూడి, తడికలపూడి, చీమలపాడు, గాంధీపురం, గేట్ కారేపల్లి, ఇల్లెందు స్టేషన్‌లు ఉన్నాయి. ఏ ఒక్క రైలు నిలయంలోనూ ప్రయాణికులకు సరైన సౌకర్యాలు లేవు. అశ్వాపురం రైలు నిలయం లోపలికి వెళ్లడానికి సరైన దారి లేదు. కొన్ని స్టేషన్‌లకు ప్లాట్ఫాంలు లేవు.

1. ఎర్రుపాలెం: ప్లాట్ఫాంలపై బల్లలు లేవు. శౌచాలయాలు కరవు. మంచినీటి కుళాయిలు పనిచేయడం లేదు.

2. మధిర: కూర్చోవడానికి బల్లలు, షెడ్లు ఉన్నా మరుగుదొడ్లు పనిచేయడం లేదు.

3. మోటమర్రి: జంక్షన్ నుంచి జగ్గయ్యపేటకు ప్యాసింజర్ రైళ్లు నడిపేందుకు జంక్షన్ ఏర్పాట్లు చేశారు. ఏళ్లు గడుస్తున్నా ప్యాసింజర్ రైళ్లు నడపడం లేదు. ఇక్కడ మరుగుదొడ్లు, మంచినీటి సౌకర్యాలు అంతంత మాత్రంగానే ఉన్నాయి.

4. బోనకల్లు: ప్లాట్ఫాంలపై చిన్న షెడ్లు వేశారు. అవి ఎండా, వర్షానికి ఆపలేకపోతున్నాయి. కూర్చోవడానికి బల్లులు లేవు. ఉన్న మరుగుదొడ్లు కూల్చేశారు. మరల నిర్మించలేదు. స్టేషన్‌లో పారిశుద్ధ్యం లోపించింది. పార్కింగ్ ఏర్పాటు చేయాలని, మంచినీటి సౌకర్యం కల్పించాలని, స్టేషన్‌లో రిజర్వేషన్ సౌకర్యం కల్పించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

5. నాగులవంచ: ఇక్కడ కనీసం షెడ్లు లేవు. కూర్చోవడానికి బల్లలు, మంచినీటి సౌకర్యం, మరుగుదొడ్లు సౌకర్యం లేవు.

6. చింతకాని: ఇక్కడ ప్లాట్ ఫాంలపై మంచినీటి కుళాయిలు శిథిలావస్థకు చేరుకుని పారిశుద్ధ్యం లోపించినా పట్టించుకునే వారు లేరు. 7. పందిళ్లపల్లి: ఈ స్టేషన్‌లో కూడా మంచినీటి, మరుగుదొడ్లు సౌకర్యాలు లేవు. కూర్చునేందుకు బల్లలు లేవు.

8. తొండలగోపవరం: ఫ్లాట్‌ఫాం సరిగా లేదు. శౌచాలయాలు, మంచినీటి కొరత ఉంది.

# మత్స్య శాఖలో మరో కుదుపు

ఖమ్మం : అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న వైరా మత్స్య శాఖలో మరో కుదుపు ఎదురైంది. స్థానిక మత్స్య అభివృద్ధి అధికారి(ఎఫ్‌డీఓ)గా పని చేస్తున్న బి.బుజ్జిబాబును సస్పెండ్ చేస్తూ ఆ శాఖ ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. గతేడాది డిసెంబరు 23న స్థానిక శాఖ కార్యాలయంలో ఏసీబీ అధికారులు దాడుల నేపథ్యంలో ఆయనపై వేటు పడింది. ఏటా జలాశయంలో చేపల వేట జూన్‌తో ముగియనుండగా మరో రెండు నెలల పాటు చేపల వేట కొనసాగించేలా అనుమతించాలని కోరినందుకు రూ.లక్ష డిమాండ్ చేసినట్లు వైరా మత్స్య సొసైటీ అధ్యక్షుడు రహీమ్ అప్పట్లో కలెక్టర్‌కు, ఇతర అధికారులకు ఎఫ్‌డీఓ బుజ్జిబాబుపై ఫిర్యాదు చేశారు. ఇదే కార్యాలయంలో తాత్కాలిక పద్ధతిలో ఫిషరీస్ అసిస్టెంటుగా పనిచేస్తున్న మార్క్పాపురం మురళీ చేపల వేట పొడిగింపునకు సంబంధిత అధికారుల ద్వారా అనుమతి ఇప్పిస్తానని చెప్పి నగదు డిమాండ్ చేయడంతో రూ.50 వేలను ఫోన్‌పే ద్వారా చెల్లించానని ఫిర్యాదు చేశాడు. అయినప్పటికి మత్స్యకారుల అభ్యున్నతికి ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదనే ఆరోపణలు వచ్చాయి. జిల్లా అధికారుల ద్వారా సమాచారం అందుకున్న ఏసీబీ అధికారులు గత డిసెంబరు చివర్లో కార్యాలయంలో దాడులు చేసి వివరాలు సేకరించారు. సొసైటీ అధ్యక్షుడు ఇచ్చిన ఫిర్యాదు, ఆధారాల పరంగా డిసెంబరు 24న ఫిషరీస్ అసిస్టెంటు మురళీని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు. ఏ1గా ఎఫ్‌డీఓ బుజ్జిబాబును, ఏ2గా మురళీని చేర్చినట్లు అదేరోజు ఏసీబీ అధికారులు



ప్రకటించి ప్రాథమికంగా మురళీని రిమాండ్ చేశారు. ఇదే వ్యవహారంలో ఏసీబీ కేసును ఆధారంగా చేసుకుని శాఖాపరమైన విచారణ సైతం చేపట్టారు. తుదిగా ఎఫ్‌డీవో బుజ్జిబాబును సస్పెండ్ చేస్తూ, ఫిషరీస్ అసిస్టెంటు మురళీని విధుల నుంచి పూర్తిగా తొలగిస్తూ(టర్మినేట్) ఆదేశాలు జారీ చేశారు. సస్పెన్షన్‌కు గురైన బుజ్జిబాబు ఖమ్మం ఎఫ్‌డీఓ పోస్టింగ్ అయినప్పటికి డిప్యుటేషన్‌పై వైరాలో పని చేస్తున్నారు. బుజ్జిబాబుపై వేటు దృష్ట్యా ఖమ్మం ఏడీ ఆంజనేయస్వామికి వైరా ఎఫ్‌డీఓగా ఇన్‌ఛార్జ్ బాధ్యతలు అప్పగించారు.

# ప్రాణ రక్షణ అంబులెన్సులేవీ?

ములుగు : ప్రాణాపాయ స్థితిలో ఉన్న అత్యవసర రోగులను వరంగల్ నుంచి హైదరాబాద్‌కు తరలించడానికి అవసరమైన అడ్వాన్స్‌డ్ లైఫ్ సపోర్టు (ఏఎల్ఎస్) అంబులెన్సులు అందుబాటులో లేక పేద రోగులు ఇబ్బంది పడుతున్నారు. అత్యవసర పరిస్థితుల్లో ప్రైవేటు అంబులెన్సులను ఆశ్రయించాల్సి వస్తోంది. ఉమ్మడి వరంగల్ జిల్లాలో ప్రభుత్వం జీవీకే ద్వారా 108 అంబులెన్సులు 54 సేవలందిస్తున్నాయి. ఈ వాహనాలు ప్రమాదంలో గాయపడిన, తీవ్ర అస్వస్థతకు గురైన రోగులను మాత్రమే అత్యవసర వైద్యం కోసం తరలిస్తున్నాయి. ఈ అంబులెన్సుల్లో బీపీ మానిటర్, అత్యవసర వైద్యకిట్టు తదితరమే ఉంటాయి. ప్రాణాపాయ స్థితిలోఉన్న రోగులు ముఖ్యంగా గుండెనొప్పి, కార్డియాక్ అరెస్టు, ఫుడ్ పాయిజన్, తీవ్రమైన ఊపిరితిత్తుల సమస్యతో ఊపిరాడని స్థితిలో ఉన్న రోగులకు అత్యవసర సేవలను అందించడానికి ఇవి ఉపయోగపడవు. అడ్వాన్స్‌డ్ లైఫ్ సపోర్టు అంబులెన్సులు అవసరమైనా.. ప్రభుత్వ ఆధ్వర్యంలో నడిచేవి ఉమ్మడి జిల్లాలో ఒకటి కూడా లేదు. పదేళ్ల క్రితం నర్సంపేట, రేగొండ, జనగామలో మొత్తం మూడు ఏఎల్ఎస్ వాహనాలు ఉండేవి. వాటి నిర్వహణను పట్టించుకోకపోవడం వల్ల మూలనపడ్డాయి. ఇక ప్రైవేటుగా వరంగల్‌లో మూడు ఏఎల్ఎస్ వాహనాలు ఉండగా వాటికి భారీ డిమాండ్ ఉంది. అటు ప్రభుత్వ అంబులెన్సులు అందుబాటులో లేక, ఇటూ ప్రైవేటులోనూ వాహనాలు తక్కువగా ఉండటం వల్ల వారు అడిగినంత ఇచ్చుకొని రోగులను హైదరాబాద్‌కు తరలించి ప్రాణాలు నిలుపుకోవాల్సి వస్తోంది. సాధారణ అంబులెన్సులు వరంగల్ నుంచి హైదరాబాద్‌కు రూ.5వేల నుంచి రూ.6వేలు అద్దె వసూలు చేస్తుండగా అడ్వాన్స్‌డ్ లైఫ్ సపోర్టు




అంబులెన్సులకు రూ.10 నుంచి రూ.12 వేలు వసూలు చేస్తున్నారు.

డబ్బులు చెల్లిస్తున్న ఎంజీఎం

మెరుగైన వైద్యం కోసం ఎంజీఎం నుంచి హైదరాబాద్‌కు అత్యవసర రోగులను తరలించాల్సి వచ్చినప్పుడు వెంటిలేటర్, ఫ్రీజర్‌బాక్సు ఉన్న ప్రైవేటు వాహనాలను అద్దెకు మాట్లాడి రోగులను పంపిస్తున్నారు. ఇటీవల ఎంజీఎంలో ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన పీజీ వైద్య విద్యార్థిని ప్రీతిని ప్రైవేటు అంబులెన్స్‌లో వెంటిలేటర్‌పై వైద్యం అందిస్తూ నిమ్స్‌కు తరలించారు. గత సంవత్సరం ఎలుక కొరికి గాయపడిన రోగిని, ఉద్యోగం రాలేదని ఆత్మహత్యయత్నానికి పాల్పడిన కేయూ విద్యార్థితోపాటు చాలా మందిని హైదరాబాద్‌కు తరలించడానికి ప్రైవేటు అంబులెన్సులనే వినియోగిస్తున్నారు.

వాహనాలకు ప్రతిపాదనలు పంపించాం-శివకుమార్, 108 ఉమ్మడి జిల్లా మేనేజర్నర్సంపేట, రేగొండలోని రెండు ఏఎల్ఎస్ వాహనాల్లో వెంటిలేటర్ పనిచేయడంలేదు. ఇతర సమస్యలున్నాయి. కొత్త వాహనాలకు ప్రతిపాదనలు పంపించాను. త్వరలోనే ఒక ఏఎల్ఎస్ అంబులెన్సను ఎంజీఎంకు కేటాయించాలనుకున్నాం.

# కుక్క కాటుకు మందేది?

వరంగల్ : వరంగల్ ప్రాంతం 29వ డివిజన్ రామన్నపేట పెద్దమోరీ, పాపయ్యపేట, రఘునాథ్ కాలనీ, ఓ.ఎస్‌నగర్ కాలనీల్లో వీధి కుక్కల సమస్య ఎక్కువైంది. ద్విచక్ర వాహనంపై వెళ్తున్న యువకుడు కుక్కల దాడిలో స్వల్పంగా గాయపడ్డాడు. వీటి బెడద నుంచి కాపాడాలి. 40వ డివిజన్ నానమీయతోట, కరెంటు ఆఫీస్ గల్లీలో మూడు రోజుల క్రితం ఆరేళ్ల బాలుడిపై వీధి కుక్కలు దాడి చేశాయి. కుక్క కాట్లకు ఎంజీఎం ఆసుపత్రిలో చికిత్స చేయించుకున్నారు. హనుమకొండ కాపువాడ, మచిలీబజారు, పెద్దమ్మగడ్డలో వీధి కుక్కలు నివారించేలా చూడాలి. స్థానికులుప్రజల సొమ్మే కదా.. పదికి ఇరవై రాసేయ్.. మనల్ని అడిగేదెవరు? అనే పద్ధతిలో గ్రేటర్ వరంగల్ ప్రజారోగ్య విభాగం వ్యవహరిస్తోంది. ప్రతి రోజూ నగరంలో వీధి కుక్కలు, కోతులు స్వైరవిహారం చేస్తున్నాయి. కర్ర లేకుండా కాలు బయట పెట్టలేని పరిస్థితి నెలకొంది. కోతులు, కుక్కల నివారణకు బల్దియా సాధారణ నిధులు ద్వారా ఏటా రూ.లక్షల్లో ఖర్చు పెడుతోంది. అయినా ప్రజలకు ఉపశమనం లేదనే విమర్శలున్నాయి.

లెక్కించేదెవరు? వీధి కుక్కలు, కోతులు పట్టుకున్నట్లు రికార్డుల్లో నమోదవుతున్నాయి. వీటిని ఎవరు లెక్కిస్తున్నారు బిల్లులు ఎలా చెల్లిస్తున్నారనేది ప్రశ్నార్థకంగా మారింది. క్షేత్రస్థాయిలో పనిచేసే శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, జవాన్లు ఇచ్చే వివరాల ప్రకారం ప్రజారోగ్య విభాగం ఉద్యోగులు బిల్లులు చెల్లిస్తున్నారు. ఏటా రూ.కోటి పైనే ఖర్చువుతున్నా.. థర్డ్ పార్టీ పరిశీలన లేదు. అందరూ ఏకమై ప్రజాధనాన్ని వృథా చేస్తున్నట్లుగా తెలిసింది. వీధి కుక్కలు పట్టుకోవడం, కుటుంబ నియంత్రణ శస్త్ర చికిత్స చేసే కాంట్రాక్టును ప్రైవేటు వ్యక్తులకు అప్పగించారు. అన్నీ కలిపి ఒక కుక్కకు రూ.800 చెల్లిస్తున్నారు. రోజూ 45- 50, నెలకు 1000-1200, ఏడాదికి 10- 12 వేలు పట్టుకున్నట్లుగా రికార్డులు చెబుతున్నాయి. మూడు, నాలుగేళ్లుగా ఈ విధానం కొనసాగుతోంది. దీన్నిబట్టి చూస్తే ఇప్పటి వరకు 30- 35 వేలు పట్టుకున్నారు. ప్రస్తుత పరిశీలన ప్రకారం 25 వేల పైనే వీధి కుక్కలున్నాయంటున్నారు. వీధి కుక్కలకు కుటుంబ నియంత్రణ శస్త్రచికిత్సలు చేస్తున్నామంటున్నారు. కాలనీల్లో చూస్తే గుంపులు గుంపులుగా కుక్కలు తిరుగుతున్నాయి.

కోతులతో అన్ని వర్గాల ప్రజలు అల్లాడుతున్నారు. ఏటా 4-5 వేలు పట్టుకుంటున్నామని లెక్కలు చెబుతున్నాయి. ఐదేళ్లలో 20-25 వేలు అడవికి తరలించినట్లు చెబుతున్నారు. నగరంలో ఏ కాలనీకెళ్లినా కోతుల బెడద తీవ్రంగా ఉంది. కోతులు పట్టుకునే బాధ్యత నెల్లూరు జిల్లాకు చెందిన వ్యక్తులకు అప్పగించారు. ఒక కోతిని పట్టుకున్నందుకు గాను రూ.380 చెల్లిస్తున్నారు. వృద్ధుణ్ని కరిచిన శునకాలు ఉర్సు 40వ డివిజన్‌లో కంతుల ముత్యాలు(75) అనే వృద్ధుడిపై వీధి కుక్కలు దాడి చేసి గాయపర్చాయి. కుటుంబ సభ్యులు ఆసుపత్రికి తీసుకెళ్లి చికిత్స చేయించారు. కుక్కలు వృద్ధుడిని గాయపర్చిన విషయం తెలిసి కుమ్మరివాడ, ఉర్సు బొడ్రాయి ప్రాంతాల్లో వీధి కుక్కలను పట్టించినట్లు కార్పొరేటర్ మరుపల్ల రవి తెలిపారు.




బెంగళూరు: తెదేపా అధినేత చంద్రబాబు అరెస్టును నిరసిస్తూ బెంగళూరులో ఐటీ ఉద్యోగులు నిరసనకు దిగారు. చంద్రబాబును అక్రమంగా అరెస్టు చేశారని ఫ్రీడమ్ పార్కులో వారంతా ఆందోళన చేపట్టారు. చంద్రబాబును వెంటనే విడుదల చేయాలని నినాదాలతో హోరెత్తించారు. 'సైకో పోవాలి.. సైకిల్ రావాలి', 'వియ్ వాంట్ జస్టిస్' అంటూ నినాదాలు చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో పెద్ద ఎత్తున ఐటీ ఉద్యోగులు పాల్గొన్నారు. చంద్రబాబుకు మద్దతుగా తెలుగు సంఘాల ఆధ్వర్యంలో బెంగళూరు జయనగర్ కాలనీలోని వినాయకుడి ఆలయంలో పూజలు చేశారు.

ప్రత్యేక పూజల అనంతరం భారీ ర్యాలీ చేపట్టారు. దీంతో ర్యాలీకి అనుమతి లేదంటూ వారిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.




## అమెరికాలో తెలుగు విద్యార్థి మృతి ఘటన.. జాహ్నవికి మరణానంతరం డిగ్రీ

వాషింగ్టన్: అమెరికాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో తెలుగు విద్యార్థిని జాహ్నవి మృతి చెందడంపై అక్కడి పోలీసు అధికారి చులకనగా మాట్లాడడం తీవ్ర విమర్శలకు దారితీసిన విషయం తెలిసిందే. దీనిపై తీవ్రంగా స్పందించిన భారత్.. ఆ అధికారిపై వెంటనే చర్యలు తీసుకోవాలని అమెరికాను కోరింది. ఇదిలా ఉండగా.. పోలీసు అధికారి వాహనం ఢీకొని ప్రాణాలు కోల్పోయిన జాహ్నవికి మరణానంతరం డిగ్రీ ఇవ్వాలని ఆమె చదివిన నార్త్‌ఈస్ట్రన్ యూనివర్సిటీ నిర్ణయించింది. జాహ్నవి మృతిపై యూనివర్సిటీ ఛాన్సలర్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ ఘటనపై ఛాన్సలర్ మాట్లాడుతూ.. "ఈ విషాద ఘటన, దాని అనంతరం జరిగిన పరిణామాలతో మా క్యాంపస్‌లోని భారత విద్యార్థులు తీవ్రంగా ప్రభావితులయ్యారు. ఈ సమయంలో వారికి మేం అండగా ఉంటాం. అలాగే ఈ ఘటనలో బాధ్యులకు తప్పకుండా శిక్ష పడుతుందని మేం ఆశిస్తున్నాం. ఇక జాహ్నవికి మరణానంతరం డిగ్రీ ప్రదానం చేయాలని మేం నిర్ణయించాం. ఆమె కుటుంబసభ్యులకు దాన్ని అందజేస్తాం" అని వెల్లడించారు. కర్నూలు జిల్లా ఆదోని ఎంఐజీ కాలనీకి చెందిన కందుల జాహ్నవి(23) ఉన్నత చదువులకు 2021లో అమెరికా వెళ్లారు. సౌత్ లేక్ యూనియన్‌లోని నార్త్‌ఈస్ట్రన్ యూనివర్సిటీలో మాస్టర్స్ డిగ్రీలో చేరారు. ఈ ఏడాది జనవరి 23న రాత్రి కళాశాల నుంచి ఇంటికి వెళ్తూ.. రోడ్డు దాటుతుండగా వేగంగా వచ్చిన పోలీసు పెట్రోలింగ్ వాహనం ఢీకొంది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడి జాహ్నవి ప్రాణాలు విడిచారు. ఈ ఘటనపై సియాటిల్ నగరానికి చెందిన ఓ పోలీసు అధికారి జోకులు వేసుకుంటూ, నవ్వుతూ మాట్లాడారు. ఆ మాటలన్నీ అతడి శరీరానికి అమర్చిన కెమెరాలో రికార్డయ్యాయి. అవి తాజాగా వెలుగులోకి రావడంతో భారత్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. అమెరికాలోనూ దీనిపై వ్యతిరేకత వచ్చింది. దీంతో పోలీసు అధికారి తీరుపై అక్కడి ఉన్నతాధికారులు విచారణకు ఆదేశించారు. ప్రమాద సమయంలో పోలీసు అధికారి కెవిన్ దేవ్ గంటకు 119 కి.మీ.ల వేగంతో వాహనం నడిపి జాహ్నవిని ఢీకొట్టగా.. ఆమె 100 అడుగుల దూరం ఎగిరిపడినట్లు సియాటిల్ పోలీసు విభాగం తెలిపింది.

# వైయస్ఆర్‌సీపీలో చేరిన నెల్లూరు మేయర్ దంపతులు

## మనస్ఫూర్తిగా వైయస్ఆర్‌సీపీలోకి ఆహ్వానిస్తున్నాం: ఎంపి ఆదాల



నెల్లూరు: కొన్ని రాజకీయ పరిణామాల నేపథ్యంలో చిన్నపాటి పొరపాటున పార్టీకి దూరమై, తాను చేసిన తప్పును తెలుసుకొని పార్టీలో తమతో కలిసి పనిచేసేందుకు నిర్ణయం తీసుకొని వైయస్ఆర్‌సీపీలోకి వచ్చిన నెల్లూరు నగర మేయర్ పొట్లూరి స్రవంతి జయవర్ధన్ దంపతులను మనస్ఫూర్తిగా పార్టీలోకి ఆహ్వానిస్తున్నామని నెల్లూరు పార్లమెంట్ సభ్యులు, రూరల్ ఇంచార్జ్ ఆదాల ప్రభాకర్ రెడ్డి తెలిపారు. ఈ మేరకు శుక్రవారం జిల్లా పార్టీ కార్యాలయంలో జిల్లా వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, రాజ్యసభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, ఎంపీ ఇంచార్జ్ ఆదాల ప్రభాకర్ రెడ్డి, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, డిసిసిబి మాజీ అధ్యక్షులు ఆనం విజయకుమార్ రెడ్డి, మెట్టుకూరు ధనంజయరెడ్డి, నెల్లూరు విజయ డైరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డిల సమక్షంలో నగర మేయర్ పొట్లూరి స్రవంతి జయవర్ధన్ దంపతులు తమ సొంత పార్టీ అయినా వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా జిల్లా పార్టీ కార్యాలయంలో మీడియా సమావేశంలో నెల్లూరు ఎంపీ, రూరల్ ఇంచార్జ్ ఆదాల ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ.. గతంలో చేసిన చిన్నపాటి పొరపాటున నగర మేయర్ పొట్లూరి స్రవంతిజయవర్ధన్ దంపతులు సరిదిద్దుకొని తిరిగి పార్టీలకి రావడం సంతోషంగా ఉందన్నారు. వారిని మనస్ఫూర్తిగా వైయస్ఆర్‌సీపీలోకి ఆహ్వానిస్తున్నామన్నారు.

అంతకు ముందు దివంగత మహానేత డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పూలమాలవేసి అక్కడే నగర మేయర్ స్రవంతి జయవర్ధన్ లను వైయస్ఆర్‌సీపీ కండువా కప్పి పార్టీలోకి ఎంపీ ఆదాల ప్రభాకర్ రెడ్డి ఆహ్వానించారు. పార్టీలో తిరిగి చేరిన మేయర్ స్రవంతి నెల్లూరు సిటీ, రూరల్ నియోజకవర్గాల్లోని పార్టీ కార్పొరేటర్ల అందరితోనూ సమన్వయంగా పనిచేయాలన్నారు. అందర్నీ కలుపుకొని ఐకమత్యంగా 2024లో రూరల్, సిటీ నియోజకవర్గాల్లో వైయస్ఆర్‌సీపీ అభ్యర్థుల గెలుపునకు కృషి చేయాలని కోరారు. నెల్లూరు సిటీ నియోజకవర్గ ఎమ్మెల్యే అనిల్ కుమార్ యాదవ్ కు సంపూర్ణ సహకారం అందించి, సిటీ కార్పొరేటర్లను సమన్వయంతో కలుపుకొని అభివృద్ధిలో ముందుకు సాగాలని సూచించారు.




అమరావతి: తెదేపా అధినేత, ఏపీ మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అరెస్టు సహా ఇతర పరిణామాలపై కేంద్ర హోంశాఖకు ఎన్ఎస్‌జీ నివేదిక అందించింది. సెప్టెంబర్ 8 తేదీ అర్ధరాత్రి నుంచి 10 తేదీ అర్ధరాత్రి 1 గంట వరకు జరిగిన అరెస్టు, ఏసీబీ కోర్టు రిమాండ్, జైల్లో భద్రత తదితర అంశాలను నివేదికలో పేర్కొంది. తొమ్మిదో తేదీ ఉదయం 6 గంటలకు సీఐడీ అరెస్టుతో పాటు ఎన్ఎస్‌జీ ప్రొటెక్టీగా ఉన్న ఆయన్ను రోడ్డు మార్గంలో విజయవాడ తరలింపు అంశాన్ని ప్రస్తావించింది. 10 తేదీ తెల్లవారుజాము 3.30 గంటల నుంచి సిట్ కార్యాలయం విజయవాడ జీజీహెచ్, ఏసీబీ కోర్టుకు తరలించినట్లు పేర్కొంది. ఆ రోజు మొత్తం భద్రతా పరంగా అంత పటిష్ఠంగా లేని కోర్టు హాలు వెలుపల ఆయన్ను ఉంచినట్లు పేర్కొంది. అదే రోజు రాత్రి 9.29 నిముషాలకు వర్షంలో రాజమహేంద్రవవరం సెంట్రల్ జైలుకు తరలించారని రిపోర్టులో పేర్కొంది. రాజమహేంద్రవరం సెంట్రల్ జైల్లో ప్రస్తుతం అయన భద్రత ఏమిటన్న విషయాన్ని కూడా ఎన్ఎస్‌జీ ప్రస్తావించింది. జైలు అవరణలోకి వెళ్ళే సమయంలో కొన్ని భద్రతా లోపాలు గుర్తించినట్లు పేర్కొంది. మొత్తం నివేదికను చంద్రబాబు భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న ఎన్ఎస్‌సీ సిబ్బంది కేంద్ర హోంశాఖకు, ఎన్ఎస్‌జీ ప్రధాన కార్యాలయానికి నివేదిక సమర్పించారు.

# సునీల్ యాదవ్‌కు బెయిల్ నిరాకరణ



హైదరాబాద్: మాజీ మంత్రి వివేకానందరెడ్డి హత్య కేసు నిందితుడు సునీల్ యాదవ్‌కు తెలంగాణ హైకోర్టులో చుక్కెదురైంది. సునీల్ బెయిల్ తిరస్కరిస్తూ.. అతడి బెయిల్ పిటిషన్‌ను ఉన్నత న్యాయస్థానం కొట్టివేసింది. బెయిల్ పిటిషన్‌పై ఇటీవల విచారణ చేపట్టిన న్యాయస్థానం.. తాజాగా తీర్పు వెలువరించింది.

హత్యకేసుతో నేరుగా సంబంధం ఉండటంతోపాటు, రెండో నిందితుడిగా ఉన్నందున బెయిల్ మంజూరు చేయవద్దని సీబీఐ తరఫు న్యాయవాదులు కోర్టుకు విన్నవించారు. అయితే, ఈ కేసుకు సంబంధించిన దర్యాప్తు పూర్తయిందని, ఇతర షరతులు ఏమైనా ఉన్నా వాటిని కూడా అంగీకరిస్తామని చెబుతూ.. బెయిల్ మంజూరు చేయాలని సునీల్ యాదవ్ తరఫు న్యాయవాది కోరారు. ఇరువర్గాల వాదనలను పరిగణనలోకి తీసుకున్న హైకోర్టు తాజాగా సునీల్‌కు బెయిల్ నిరాకరిస్తూ తీర్పు వెలువరించింది.




తిరువనంతపురం: కేరళలో మళ్లీ నిఫా వైరస్ కలకలం సృష్టిస్తోంది. తాజాగా కొయ్‌కోడ్‌కు చెందిన 39 ఏళ్ల వ్యక్తికి నిఫా వైరస్ పాజిటివ్‌గా తేలింది. ఈ మేరకు రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి వీణా జార్జ్ వెల్లడించారు. ప్రస్తుత కేసుతో ఈ వైరస్ ఇన్ఫెక్షన్ల సంఖ్య ఆరుకు పెరిగింది. వీరిలో ఇప్పటికే ఇద్దరు మృతి చెందగా.. యాక్టివ్ కేసుల సంఖ్య నాలుగుకు చేరింది. ఇంతకుముందు నిఫా పాజిటివ్ వచ్చిన వ్యక్తులకు చికిత్స అందించిన ఆసుపత్రిలోనే ఈ వ్యక్తిని వైద్యుల పర్యవేక్షణలో ఉంచారని ఆరోగ్యశాఖ తెలిపింది. నిఫా వ్యాప్తిని కట్టడిలో ఉంచేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. కొయ్‌కోడ్ జిల్లా యంత్రాంగం.. శుక్రవారం కూడా అన్ని విద్యాసంస్థలకు సెలవు ప్రకటించింది. వ్యాధి తీవ్రతను దృష్టిలో ఉంచుకొని ఇప్పటికే ఏడు గ్రామ పంచాయతీలను కంటైన్‌మెంట్ జోన్లుగా పరిగణించారు. అలాగే ముఖ్యమంత్రి పినరయి విజయన్ నేతృత్వంలో ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం జరిగింది. నిఫా వ్యాప్తి నేపథ్యంలో అటు కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాలు కూడా అప్రమత్తమయ్యాయి.

**భయపడాల్సిన పనిలేదు: ఆరోగ్య మంత్రి** – వైరస్ కట్టడికి అన్ని నివారణ చర్యలు అమల్లో ఉన్నాయని, ప్రజలు భయపడాల్సిన పనిలేదని ఆరోగ్య మంత్రి వీణా జార్జ్ భరోసా ఇచ్చారు. ఒక్క కొయ్‌కోడ్ మాత్రమే కాకుండా కేరళ మొత్తం ఇలాంటి ఇన్ఫెక్షన్లకు గురయ్యే అవకాశం ఉందని ప్రపంచ ఆరోగ్య సంస్థ, ఐసీఎంఆర్ అధ్యయనాల్లో వెల్లడైందని చెప్పారు. అటవీ ప్రాంతాలకు దగ్గరగా ఉన్నవారు అత్యంత జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ప్రస్తుత కేసు అటవీ ప్రాంతానికి ఐదు కిలోమీటర్ల దూరంలోనే వెలుగుచూసిందని తెలిపారు. మెదడును అత్యంత తీవ్రంగా దెబ్బతీసే నిఫా వైరస్‌ను 1999లో తొలిసారి గుర్తించారు. మలేసియా, సింగపూర్‌లోని పందుల పెంపకందారుల్లో ఈ ఇన్‌ఫెక్షన్‌ను కనుగొన్నారు. కేరళలో ఈ వైరస్ 2018లో తొలిసారి వెలుగు చూసింది. అప్పటి నుంచి ఇప్పటివరకు నాలుగుసార్లు వ్యాప్తిలోకి వచ్చింది. 23 మందికి వైరస్ నిర్ధారణ కాగా అందులో 21 మంది ప్రాణాలు కోల్పోయారంటే అదెంతో ప్రాణాంతకమో అర్థం చేసుకోవచ్చు. 2019, 2021ల్లోనూ ఇద్దరు బాధితులు మరణించారు.

# అన్నమయ్య జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం.. తిరుమల దర్శనం ముగించుకుని వెళ్తుండగా..



అన్నమయ్య: ఘోర ప్రమాదంతో జిల్లాలో రోడ్డు నెత్తురోడింది. తిరుమల నుంచి ఇంటికి వెళ్తున్న భక్తుల వాహనం.. లారీతో ఢీ కొట్టింది. ప్రమాదంలో ఐదుగురు మృతి చెందగా.. కొందరికి తీవ్ర గాయాలైనట్లు తెలుస్తోంది. శనివారం తెల్లవారు ఝామున పీలేరు సమీపంలో ఈ రోడ్డు ప్రమాదం సంభవించింది.

మృతులు.. బాధితులను కర్ణాటక వాసులుగా పోలీసులు నిర్ధారించారు. కర్ణాటక బెల్గాం జిల్లా అత్తిని మండలం బడచిగ్రామానికి చెందిన 14 మంది.. తిరుమల దర్శనం కోసం ఓ తుఫాన్ వాహనంలో వచ్చారు. దర్శనం అనంతరం తిరిగి వెళ్తుండగా.. తెల్లవారు మూడు గంటల సమయంలో మఠంపల్లి క్రాస్(కె.వి పల్లి మండలం) వద్ద వాళ్ల వాహనాన్ని లారీ ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో ఐదుగురు అక్కడికక్కడే మృతి చెందారు. తీవ్రంగా గాయపడిన ఐదుగురిని తొలుత పీలేరు ప్రభుత్వాసుపత్రిలో చేర్చారు. అక్కడ ప్రాథమిక చికిత్స అనంతరం.. తిరుపతి రుయా ఆస్పత్రికి తరలించారు.

# చంద్రబాబుతో ములాఖత్‌కు భువనేశ్వరికి అనుమతి నిరాకరణ

రాజమహేంద్రవరం: స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో అరెస్టయి రాజమహేంద్రవరం కేంద్ర కారాగారంలో ఉంటున్న తెదేపా అధినేత చంద్రబాబుతో ములాఖత్‌కు ఆయన సతీమణి భువనేశ్వరికి జైలు అధికారులు అనుమతి నిరాకరించారు. వారానికి మూడుసార్లు ములాఖత్ ఇచ్చేందుకు అవకాశం ఉన్నా.. తిరస్కరించడాన్ని తెదేపా తప్పుబట్టింది. చంద్రబాబు అరెస్టు తర్వాత భువనేశ్వరి రాజమహేంద్రవరంలోనే ఉంటున్నారు. ములాఖత్‌కు అనుమతి నిరాకరించడంపై ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. తన భర్తను అక్రమంగా అరెస్టు చేసి ప్రభుత్వం.. ములాఖత్‌పైనా అమానవీయంగా వ్యవహరిస్తోందని ఆక్షేపించారు. నిబంధనల ప్రకారం ములాఖత్‌కు అవాకాశం ఉన్నా.. కాదనడం సరికాదని ఆమె అన్నారు.

# బీజేపీ విష కౌగిలి నుంచి పవన్ బయటకు రావాలి



విజయవాడ: అగ్రిగోల్డ్ బాధితులను జగన్ మోసం చేశారని ప్రత్యేక హోదా సాధన సమితి కన్వీనర్ చలసాని శ్రీనివాస్ మండిపడ్డారు. శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ.. హామీ అమలు చేయమంటే అరెస్టు చేయిస్తున్నారన్నారు. పోలీసులను అడ్డం పెట్టుకుని దమన కాండ చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మోడీ కనుసన్నల్లో జగన్ పని చేస్తున్నారని ఆరోపించారు. దుర్మార్గమైన కుట్రలు చేస్తున్న జగన్, మోడీలను ఓడించాలన్నారు.

అగ్రిగోల్డ్ బాధితులను జగన్ ఎందుకు ఆదుకోలేదని ప్రశ్నించారు. 25 ఎంపీ సీట్లు ఇస్తే మెడలు వంచుతా అని జగన్ అన్నారని.. 33మంది ఎంపీలు ఉన్నా మోడీ ముందు మోకరిల్లుతున్నారని విమర్శించారు. పవన్ కళ్యాణ్ కూడా బీజేపీ విష కౌగిలి నుంచి బయటకు రావాలన్నారు. పాచిపోయిన లడ్డూ అన్న పవన్ కళ్యాణ్ వాళ్లతో ఎలా నడుస్తారని నిలదీశారు. ప్రత్యేక హోదా, విశాఖ స్టీల్ ప్లాంట్‌ల కోసం అందరూ పోరాడాలని చలసాని శ్రీనివాస్ పిలుపునిచ్చారు.

# జగన్‌పై తులసిరెడ్డి కీలక వ్యాఖ్యలు



విజయవాడ: ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డిపై ఏపీ కాంగ్రెస్ మీడియా విభాగ ఇంఛార్జ్ తులసిరెడ్డి తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ.. అగ్రిగోల్డ్ విషయంలో మాట తప్పాడు, మడమ తిప్పాడని వ్యాఖ్యలు చేశారు. చంద్రబాబు విషయంలో అవినీతిని కోర్టులు తేలుస్తాయన్నారు. చంద్రబాబును అరెస్టు చేసిన విధానం మాత్రం కరెక్ట్ కాదన్నారు. ఇది కచ్చితంగా రాజకీయ కక్ష సాధింపు చర్యే అని అన్నారు. జగన్మోహన్ రెడ్డి అణువణువునా పగ పగ అని రగిలిపోతున్నారని విమర్శించారు. జగన్ సహజ ప్రవృత్తికి... అధికారం తోడు అయ్యిందన్నారు. ఫ్యాక్షనిస్టులకు అధికారం ఉంటే అన్నీ చలాయిస్తారన్నారు. "అధికారం లేకుంటే వారంతా పిరికిపందలే... ఆయనది, నాదీ పులివెందులే... వాళ్లను ఎప్పటి నుంచో చూస్తున్నా" అని తులసిరెడ్డి వ్యాఖ్యలు చేశారు.

# చిత్తూరులో ఘోర రోడ్డు ప్రమాదం.. నలుగురి దుర్మరణం



చిత్తూరు: జిల్లాలో ఘోర ప్రమాదం జరిగింది. ఆగి ఉన్న ట్యాంకర్‌ను అంబులెన్స్ ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో నలుగురు మృతి చెందగా.. ముగ్గురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. తవణంపల్లె మండలం తెల్లగుండ్ల పల్లి వద్ద ఘటన చోటు చేసుకుంది.

వేలూరు నుంచి వస్తున్న కిమ్స్ హాస్పిటల్ అంబులెన్స్.. చిత్తూరు–తిరుపతి హైవే మీద ఆగి ఉన్న ట్యాంకర్‌ను ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో ఓ మహిళ సహా నలుగురు అక్కడికక్కడే మృతి చెందారు.

ప్రమాద సమయంలో అంబులెన్స్‌లో ఏడుగురు ఉన్నట్లు సమాచారం. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు.. గాయపడ్డ వాళ్లను చిత్తూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

## చీర అందాలతో నేహా శెట్టి కవ్వింత

టాలీవుడ్ యంగ్ బ్యూటీల్లో నేహాశెట్టి కూడా ఒకరు. ప్రస్తుతం ఆమె తెలుగులో వరస సినిమాలు చేసుకుంటూ, దూసుకుపోతోంది. చిన్న హీరోలకు నేహా ఇప్పుడు బెస్ట్ ఆప్షన్ గా మారిపోయింది. ఓ వైపు స్టార్ హీరోలతో శ్రీలీల అదరగొడుతోంటే, ఆ రేంజ్ లో యంగ్ హీరోలతో ఛాన్సులు దక్కించుకుంటోంది. నేహా శెట్టి మెహబూబా సినిమాతో తన కెరీర్ ని మొదలుపెట్టినా, డీజే టిల్లుతోనే ఫేమస్ అయిపోయింది. అందరూ ముద్దుగా ఆమెను రాధిక అని పిలుచుకుంటున్నారు. రీసెంట్ గా నేహా శెట్టి బెదురులంకతో ప్రేక్షకుల ముందుకు వచ్చింది. వెంటనే రూల్స్ రంజన్ తో మరోసారి ప్రేక్షకులకు ముందుకు రావడానికి రెడీ అయ్యింది. దీని తర్వాత వెంటనే, ఆమె గ్యాంగ్స్ ఆఫ్ గోదావరితో రానుంది. అంతేకాదు, సోషల్ మీడియాలోనూ చాలా చురుకుగా ఉంటుంది. తాజాగా చీరలో కొన్ని ఫోటోలు షేర్ చేసింది. అవి నెట్టింట వైరల్ గా మారాయి. చాలా



మంది హీరోయిన్లు మోడ్రన్ దుస్తుల్లో మెస్మరైజ్ చేస్తూ ఉంటారు. కానీ, నేహా మాత్రం చీరల్లోనే మ్యాజిక్ చేస్తూ ఉంటుంది. ఆమెకు డ్రెస్ లు కంటే చీరల్లోనే ఎక్కువ అందంగా ఉంటుంది. అందుకే, ఎక్కువగా చీరల్లో ఫోటో షూట్ లు చేసి సోషల్ మీడియాలో షేర్ చేస్తూ ఉంటుంది. తాజా నేహా మరోసారి చీరల్లో మెరిసింది. . పసుపు రంగు చీరకు బ్లాక్ కలర్ బ్లౌజ్ తో మ్యాచ్ చేసింది. మ్యాచింగ్ బ్యాంగిల్స్ కూడా ధరించింది. ముక్కుకు ముక్కెరపెట్టుకొని, ముఖాన బొట్టు పెట్టుకొని చాలా అందంగా ఉంది. ట్రెడిషన్ లుక్ లో అందరినీ మెస్మరైజ్ చేస్తోంది. ఇక, నేహా శెట్టి కి చిన్నతనం నుంచి నటి అవ్వాలనే కోరిక ఉండేదట. దాని కోసమే చాలా కష్టపడింది. న్యూ యార్క్ ఫిల్మ్ అకాడమీలో శిక్షణ కూడా తీసుకుంది. అక్కడి నుంచి వచ్చిన తర్వాత ఆమెకు కన్నడలో మొదటగా హీరోయిన్ అవకాశం వచ్చింది. ఆ తర్వాత తెలుగులో పూరీ జగన్నాథ్ కుమారుడు ఆకాశ్ పూరీతో కలిసి మెహబూబా మూవీలో నటించింది. అయితే, ఆ మూవీలో ఆమె నటనకు మంచి మార్కులు పడినా, నేహాలోని గ్లామర్ యాంగిల్ మాత్రం డీజే టిల్లు మూవీలో బయటపడింది. ఆ మూవీ తర్వాత మళ్లీ వెనక్కి తిరిగి చూసుకున్నది లేదు. త్వరలోనే ఆమె మరికొన్ని కొత్త ప్రాజెక్టులతో ప్రేక్షకుల ముందుకు రానుంది.

## మిహికా రానా గ్లామర్ డోస్.. స్టన్నింగ్!

మన స్టార్ హీరోలకి సోషల్ మీడియాలో ఏ స్థాయిలో ఫ్యాన్ ఫాలోయింగ్ ఉంటుందో అందరికి తెలిసిందే. అయితే స్టార్ హీరోల భార్యలు మాత్రం గతంలో అస్సలు బయటకి వచ్చేవారు కాదు. మీడియాకి దూరంగా ఉండేవారు. అయితే మారుతున్న కాలంతో పాటుగా ట్రెండ్ కి తగ్గట్లు వారు అప్డేట్ అవుతూ ఉన్నారు. సెలబ్రెటీల భార్యలు కూడా అదే ఇమేజ్ ని ఆశ్వాదించడానికి ఇష్టపడుతున్నారు. హీరోయిన్స్ కి ఏ మాత్రం తీసిపోని అందంతో సోషల్ మీడియాలో సందడి చేస్తూ ఉన్నారు. ఫ్యామిలీ లైఫ్ కి సంబందించిన ఫోటోలని ఎప్పటికప్పుడు షేర్ చేసుకుంటూనే అప్పుడప్పుడు తమలోని గ్లామర్ ని కూడా బయటకి తీసుకొస్తున్నారు. టాలీవుడ్ ఎక్కువ పాపులారిటీ ఉన్న సెలబ్రెటీ భార్యలలో అల్లు అర్జున్ సతీమణి స్నేహారెడ్డి ముందుంటారు. ఆమె తనకి సంబందించిన ప్రతి మూమెంట్ ని ఇన్



స్టాగ్రామ్ లో పంచుకుంటారు. అలాగే దగ్గుబాటి రానా భార్య మిహికా కూడా సోషల్ మీడియాలో చాలా యాక్టివ్ గా ఉంటారు. ఆమె ఇప్పటికే ఇంటీరియర్ డిజైనర్ గా మంచి పాపులారిటీ ఉన్న వ్యక్తి. రానా, మిహికా ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. తెలుగు రాష్ట్రాలలో టాప్ ఇంటీరియర్ డిజైనర్స్ లో మిహికా కూడా ఒకరు. అందుకే ఆమె ఫ్యాషన్ ప్రపంచంలోనే ఉంటారు. కలర్ ఫుల్ కాస్ట్యూమ్స్ తో తనని తాను ఎస్టాబ్లిష్ చేసుకుంటూ ఉంటారు. తాజాగా మిహికా దగ్గుబాటి ఇన్ స్టాగ్రామ్ లో పింక్ కలర్ షార్ట్ స్కట్ తో అదిరిపోయే ఫోటోని షేర్ చేసుకున్నారు. ఈ ఫోటో ఇప్పుడు వైరల్ అవుతోంది. హీరోయిన్స్ కి ఏ మాత్రం తీసిపోని అందంతో ఈ లుక్ లో మిహికా మెరిసిపోతూ ఉండటం విశేషం. మిహికా నటిగా ఎంట్రీ ఇస్తారనే ప్రచారం జరుగుతోంది. ఇక ఇన్ స్టాగ్రామ్ లో షేర్ చేసిన ఈ ఫోటోకి అదిరిపోయే క్యాప్షన్ కూడా మిహికా పెట్టారు. కొన్నిసార్లు రంగులో మార్పు, దృక్కోణంలో మార్పు మాత్రమే రోజును ఉత్సాహంగా ఉంచుతుంది అంటూ మిహికా తన వ్యక్తిత్వాన్ని రిప్రజెంట్ చేస్తూ పింక్ స్కర్ట్ లో గ్లామర్ ఫోటోకి క్యాప్షన్ ఇచ్చారు. ఈ ఫోటో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.




## గేమ్ ఛేంజర్.. పెరుగుతున్న బడ్జెట్ భయం



గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ హీరోగా శంకర్ దర్శకత్వంలో గేమ్ చేంజర్ మూవీ తెరకెక్కుతోన్న సంగతి తెలిసిందే. భారీ బడ్జెట్ తో దిల్ రాజు శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్ పై ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. 200 కోట్ల బడ్జెట్ తో ఈ సినిమాని నిర్మించాలని అనుకున్నారు. శంకర్ కూడా అదే బడ్జెట్ లో చేయాలని సినిమాని స్టార్ట్ చేశారు. ఇండియన్ 2 మూవీ ఆగిపోవడంతో శంకర్ గేమ్ చేంజర్ సినిమా స్టార్ట్ చేశారు. అయితే ఇండియన్ 2 ప్రొడ్యూసర్స్ తో వివాదం ముగియడంతో మరల ఆ సినిమా సెట్స్ పైకి వెళ్ళింది. దీంతో రెండు పాన్ ఇండియా సినిమాలని ఒకేసారి శంకర్ చేస్తున్నారు. అయితే శంకర్ ఫోకస్ అంతా ఇండియన్ 2 పూర్తి చేయడంపైన ఉందనే మాట వినిపిస్తోంది. గేమ్ చేంజర్ షూటింగ్ ఇప్పటి వరకు 50 శాతం మాత్రమే కంప్లీట్ అయ్యిందంట. ఇప్పటికే 200 కోట్ల వరకు బడ్జెట్ ఖర్చయ్యిందట. అనుకున్న బడ్జెట్ ఇప్పటికే క్రాస్ అయిపొయింది. ఇంకా చాలా షెడ్యూల్స్ పెండింగ్ లో ఉన్నాయి. సినిమా మొత్తం కంప్లీట్ అయ్యేసరికి 370 కోట్ల వరకు ఖర్చయ్యే అవకాశం ఉందనే మాట వినిపిస్తోంది. ఈ స్థాయిలో బడ్జెట్ అంటే మార్కెట్ రేంజ్ కి మించి ఖర్చు పెడుతున్నట్లే అవుతుంది. ఇప్పటికే దిల్ రాజు గేమ్ చేంజర్ విషయంలో శంకర్ పై కొంత అసంతృప్తితో ఉన్నారు. ఈ మధ్య జరిగిన ఓ ప్రెస్ మీట్ లో మూవీ రిలీజ్ విషయం చర్చకి వస్తే అంతా డైరెక్టర్ చేతిలోనే ఉందని, అతను ఎప్పుడు ఇస్తే అప్పుడే రిలీజ్ అవుతుందని నవ్వుతూనే తన అసహనాన్ని దిల్ రాజు వ్యక్తం చేశారు. దీనిని బట్టి మూవీ బడ్జెట్ కంట్రోల్ దిల్ రాజు చేతుల్లోంచి జారిపోయిందనే టాక్ వినిపిస్తోంది. 370 కోట్ల బడ్జెట్ అంటే ఆర్ఆర్ఆర్ రేంజ్ లో అయ్యే ఛాన్స్ ఉంది. ఈ బడ్జెట్ లో సినిమా అంటే చరణ్ మార్కెట్ రేంజ్ కి మించి ఖర్చు చేస్తున్నట్లే. ఈ మొత్తం రాబట్టాలంటే కచ్చితంగా థీయాట్రికల్ బిజినెస్ 400 కోట్లకి పైగా జరగాలి. అంత జరిగిన మొత్తం తిరిగి వస్తుందని గ్యారెంటీ ఇవ్వలేని పరిస్థితి. నాన్ థీయాట్రికల్ రైట్స్ ద్వారా సగం రికవరీ అయిన మిగిలిన మొత్తం కూడా రాబట్టడం తలకుమించిన భారమే. సినిమా బ్లాక్ బస్టర్ టాక్ సొంతం చేసుకుంటే తప్ప ఈ మొత్తం రికవరీ కాదు. మరి దిల్ రాజు దీనిని ఎలా డీల్ చేస్తారో చూడాలి.

## జిమ్ లో హాట్ బ్యూటీ అందాల ఆరబోత



తెలుగు, తమిళ, మలయాళ చిత్రాల్లో నటించి మెప్పించిన ముద్దుగుమ్మ పూజా రామచంద్రన్. ఈ అమ్మడు హీరోయిన్ గానే కాకుండా క్యారెక్టర్ ఆర్టిస్టుగా కూడా పలు సినిమాల్లో నటించడం ద్వారా సౌత్ ఇండియన్ సినీ ప్రేమికులకు సుపరిచితురాలు. ఈ అమ్మడు తెలుగు బిగ్ బాస్ లో కూడా సందడి చేసి బుల్లి తెర ప్రేక్షకులను ఎంటర్ టైన్ చేసిన విషయం తెల్సిందే. ఈ మధ్య కాలంలో సినిమాలకు కాస్త దూరంగా ఉంటున్నా కూడా సోషల్ మీడియా ద్వారా ఈ అమ్మడి అందాల ఆరబోత కంటిన్యూ అవుతోంది. ఆ మధ్య ఈమె పెళ్లి చేసుకున్నట్లుగా వార్తలు వచ్చాయి. సాధారణంగా సౌత్ హీరోయిన్స్ ఒకప్పుడు పెళ్లి తర్వాత స్కిన్ షో కి దూరంగా ఉండేవారు. కానీ ఇప్పుడు అలాంటి పరిస్థితి లేదు. పెళ్లి తర్వాత కూడా పూజా రామచంద్రన్ ఇలాంటి అందాల ఆరబోత ఫోటోలు వీడియో లు షేర్ చేస్తోంది. తాజాగా ఈ అమ్మడు జిమ్ లో వర్కౌట్ లు చేస్తున్న ఫోటోలను షేర్ చేసింది. థైస్ ను ఎక్స్ పోజ్ చేస్తూ చిరు నవ్వుతో తీసుకున్న సెల్ఫీ ప్రస్తుతం సోషల్ మీడియాలో అందరి దృష్టిని ఆకర్షించడంతో పాటు మళ్లీ సినిమాల్లో బిజీ అయ్యేలా చేస్తుంది. హీరోయిన్ గా కాకున్నా సోషల్ మీడియా లో ఈ అమ్మడు షేర్ చేస్తున్న ఫోటోలను చూస్తూ ఉంటే అతి త్వరలోనే మళ్లీ నటిగా ఛాన్స్ లు దక్కించుకుంటుందనే నమ్మకంను కొందరు వ్యక్తం చేస్తున్నారు. బుల్లి తెర లేదా వెండి తెరపై మాత్రమే కాకుండా ఓటీటీ ద్వారా కూడా ఈమెను చూడాలని నెటిజన్స్ ఆశ పడుతున్నారు. మరి ఈ అమ్మడు ఓటీటీ లో కనిపించే అవకాశాలు ఉన్నాయా అనేది చూడాలి.

## రవితేజ చెప్పకుండా ఛాన్స్ ఇచ్చి చూపించాడు!

తెలుగు అమ్మాయిలకు ఛాన్సులు ఇవ్వాలని 'బేబి' సక్సెస్ నేపథ్యంలో వైష్ణవిచైతన్య ఎంట్రీని ఉద్దేశించి వక్తలంతా ఏ రేంజ్ లో ఊదారో తెలిసిందే. అల్లు అర్జున్ అందరికంటే ఓ అడుగు ముందుకేసి తెలుగు అమ్మాయిల ఎంట్రీ విషయంలో ఓ లీడ్ తీసుకుని మాట్లాడారు. ఇంతవరకూ ఏ తెలుగు హీరో ఇలా మాట్లాడింది లేదు. అటుపై అల్లు అరవింద్ సహ కొంత మంది నిర్మాతలు మైక్ దొరికిన సందర్భాల్లో మాట్లాడారు. మరి వాళ్లలో ఎంత మంది తెలుగు అమ్మాయిలకు అవకాశాలు ఇస్తున్నారు? అన్నది తెలియదు గానీ! మాస్ రాజా రవితేజ మాత్రం ఏకంగా ఛాన్స్ ఇచ్చి నిరూపించాడు.



ఇక్కడ మాటల్లేవ్.. మాట్లాడుకో వడాల్లేవ్..ఓన్లీ యాక్షన్ అన్న తరహాలో చేసి చూపించారు. ప్రస్తుతం రవితేజ సొంత బ్యానర్ ఆర్ టీ. టీమ్ వర్క్స్ పతాకంపై 'ఛాంగురే బంగారు రాజా' అనే సినిమా నిర్మిస్తోన్న సంగతి తెలిసిందే. ఈసినిమాతో కార్తీక్ రత్నం పూర్తి స్థాయి హీరోగా పరిచయం అవుతున్నాడు. అలాగే ఇదే సినిమాతో తెలుగమ్మాయి కూడా హీరోయిన్గా పరిచయమవుతోంది. ఆమె పేరు గోల్డీ నిస్సీ. తెలుగు అమ్మాయి. కొన్ని షార్ట్ ఫిల్మ్ లో నటించింది. అవి యూట్యూబ్ లో బాగానే వైరల్ అయ్యాయి. ఆ వేదికగా గోల్డీ బాగానే ఫేమస్ అయింది. ఇదే క్రమంలో సినిమాల్లోనూ ప్రయత్నిం చింది. ఈ నేపథ్యంలో రవితేజ ప్రొడక్షన్లో ఆడిషన్స్ జరుగుతున్నాయని తెలుసుకుని ఆడిషన్ ఇచ్చింది. పాత్రకి ఆమె సూటవ్వడంతో వెంటనే ఎంపిక చేసారు. అయితే ఈ విషయంలో గోల్డీ వాళ్లమ్మకి థాంక్స్ చెప్పాలంటోంది. తన ఇష్టాన్ని అర్ధం చేసుకుని వాళ్ల అమ్మే స్వయంగా ఆడీషన్ కి తీసుకెళ్లేవారుట. ఆ రకంగా గోల్డీ తొలి చాన్స్ అందుకుంది. సినిమాపై పాజిటివ్ వైబ్ క్రియేట్ అవుతుంది. మరి అమ్మడి ఫేట్ ని నిర్ణయించేది మాత్రం సక్సెస్ ఒక్కటే. బేబి లా సక్సెస్ అయితే గోల్డీ లైఫ్ వైష్ణవి లా సాఫీగా సాగిపోతుంది.

## మతాంతర వివాహం, భర్త వయసు తేడాపై బెబో

ఇటీవల తన 11వ వివాహ వార్షికోత్సవాన్ని జరుపుకున్న కరీనా కపూర్ ఖాన్ సైఫ్ తో మతాంతర వివాహం గురించి వయసు వ్యత్సాసం గురించి ప్రస్థావించింది. అవి తమ సంబంధాన్ని ఎలా ప్రభావితం చేస్తాయనే దాని గురించి మాట్లాడింది. కరీనా కపూర్ ఖాన్ - సైఫ్ అలీ ఖాన్ బాలీవుడ్ ఆదర్శ జంటగా అందరికీ స్ఫూర్తి. ఈ జంటకు పెళ్లయి 10 సంవత్సరాలకు పైగా అయింది. ఇద్దరు పిల్లలను స్వాగతించారు. వీరిద్దరూ పిక్చర్ పర్ఫెక్ట్ కపుల్ గా హృదయాల్లో నిలిచారు. అయితే బెబో కరీనా తనకంటే పదేళ్ల పెద్ద వయసు ఉన్న సైఫ్ ని పెళ్లాడుతుంటే దానిపై బోలెడన్ని కామెంట్లు వచ్చాయి. ఇక ఇదే విషయమై తాజా ఇంటర్వ్యూలో కరీనా వివరణ ఇచ్చింది. భర్తతో 10 ఏళ్ల వయస్సు అంతరం, సైఫ్‌తో మతాంతర వివాహం గురించి ప్రశ్నలు ఎదుర్కోవడంపై వివరణ ఇచ్చారు. ఇటీవలి



ఇంటర్వ్యూలో, సైఫ్‌తో తన మతాంతర బంధం నమ్మకాలు విశ్వాసాలను ఎలా ప్రభావితం చేస్తుందో ఓపెనైంది. కరీనా -సైఫ్ 2012లో వివాహం చేసుకునే ముందు చాలా సంవత్సరాల పాటు డేటింగ్ చేశారు. ఇద్దరూ సంప్రదాయ ఆచారాలకు స్వస్తి పలికి కోర్టు వివాహాన్ని ఎంచుకున్నారు. కుట మతాలు వయసు అంతరాలు చూడటం కంటే రిలేషన్‌షిప్‌లో చాలా ముఖ్యమైన విషయం సరదాగా ఉండటమేనని కరీనా అన్నారు. మేం సర్వమత సంబంధాల గురించి చర్చించడానికి చాలా సమయం గడుపుతాము. అతడు చాలా ఎనర్జిటిక్ మ్యాన్. సైఫ్ 10 సంవత్సరాలు పెద్దవాడు. చెప్పుకోదగ్గ విషయం ఏమిటంటే ఆనందించడం ముఖ్యం. మేం ఒకరినొకరు ఇష్టపడతాము. మా కంపెనీని ఆస్వాధిస్తాం. అతడు ఏ విశ్వాసాన్ని అనుసరిస్తాడు? అతని వయస్సు ఎంత? అనేది ముఖ్యం కాదు. అలాంటివి చర్చనీయాంశం కాదు! అని బెబో ఇంటర్వ్యూలో అన్నారు. తనకు సైఫ్‌కు మధ్య 10 సంవత్సరాల వయస్సు అంతరం గురించి కరీనా ఓపెనైంది. తాను 10 సంవత్సరాలు చిన్నదానిని కావడం సంతోషంగా ఉందని చెప్పింది. వయస్సు ముఖ్యమైనది అనుకుంటే, అతను గతంలో కంటే హాట్ గా ఉన్నాడు. సైఫ్ ఆందోళన చెందాల్సిన పని లేదు. అతడిని చూసి 53 ఏళ్లు అని ఎవరూ చెప్పలేరు అని కరీనా అన్నారు. వయస్సు పట్టింపు లేదు.. గౌరవం ప్రేమ ముఖ్యం. మేము ఒకరితో ఒకరు సరదాగా గడపడం ముఖ్యం అని కరీనా చెప్పారు.



# వైద్య విద్యలో నవశకం.. 9 మెడికల్ కళాశాలలు ప్రారంభం

హైదరాబాద్: రాష్ట్ర వైద్య విద్యలో నవశకం ప్రారంభమైంది. ఇప్పటికే పలువైద్య కళాశాలలను అందుబాటులోకి తీసుకొచ్చిన ప్రభుత్వం.. తాజాగా మరో 9 మెడికల్ కళాశాలను ప్రారంభించింది. వికారాబాద్, సిరిసిల్ల, కరీంనగర్, ఖమ్మం, జనగామ, ఆసిఫాబాద్, నిర్మల్, కామారెడ్డి, భూపాలపల్లిలో వైద్య కళాశాలలను ముఖ్యమంత్రి కేసీఆర్ హైదరాబాద్ నుంచి వర్చువల్‌గా ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... ఒకేసారి 9 కాలేజీలు ప్రారంభించడం శుభపరిణామమన్నారు. " ప్రతి జిల్లాకు ఒక మెడికల్ కాలేజీ ఏర్పాటుకు మంత్రివర్గం ఆమోదించింది. ప్రస్తుతం రాష్ట్రంలో 26 మెడికల్ కాలేజీలు ఉన్నాయి. రాబోయే సంవత్సరంలో మరో 8 వైద్య కళాశాలలు ప్రారంభిస్తాం. తెలంగాణ ప్రతి ఏటా 10 వేల మంది వైద్యులను దేశానికి అందించబోతోంది. దేశానికి అన్నం పెట్టే స్థాయికి తెలంగాణ ఎదిగింది. ప్రతి లక్ష జనాభాకు 22 మెడికల్ సీట్లు ఉన్న ఏకైక రాష్ట్రం తెలంగాణ. 500 టన్నుల ఆక్సిజన్‌ను ఉత్పత్తి చేసే సామర్థ్యం రాష్ట్రానికి ఉంది. రాష్ట్రంలో 10 వేల సూపర్ స్పెషాలిటీ బెడ్లు అందుబాటులో ఉన్నాయి." అని కేసీఆర్ అన్నారు. పేద గర్భిణులకు కేసీఆర్ కిట్లు, న్యూట్రిషన్ కిట్లు అందిస్తున్నట్లు కేసీఆర్ గుర్తు చేశారు. "వారికి ఇబ్బంది లేకుండా అమ్మఒడి వాహనాలు ప్రారంభించాం. మతాశిశు మరణాలు తగ్గించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే 76శాతం ప్రసవాలు జరుగుతున్నాయి." అని కేసీఆర్ అన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యశాఖ మంత్రి హరీశ్‌రావుతో సహా పలువురు మంత్రులు, ఆయా జిల్లాల నుంచి అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. సిరిసిల్లలోని వైద్య కళాశాల ప్రారంభోత్సవంలో మంత్రి కేటీఆర్ ప్రత్యక్షంగా పాల్గొన్నారు.

# ఒకేసారి 9 మెడికల్ కాలేజీలు ప్రారంభించుకోవడం..
# సీఎం కేసీఆర్ పట్టుదలకు నిదర్శనం : మంత్రి హరీశ్‌రావు



హైదరాబాద్ : ఒక రాష్ట్రం ఒకేసారి 9 ప్రభుత్వ మెడికల్ కాలేజీలు ప్రారంభించడం దేశ వైద్య రంగ చరిత్రలోనే మొదటిసారి.. ఇది సీఎం కేసిఆర్ పట్టుదలకు నిదర్శనం అని రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు స్పష్టం చేశారు. రాష్ట్రంలో 9 కొత్త ప్రభుత్వ మెడికల్ కా లేజీల్లో ఎంబీబీఎస్ తరగతులను ప్రగతి భవన్ నుండి వర్చువల్‌గా ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆర్థిక, వైద్యారోగ్య శాఖల మంత్రి హరీష్ రావు మాట్లాడారు.

ఈరోజు రాష్ట్ర చరిత్రలో సుదినం. రాష్ట్రంలో పేదలకు విద్య, వైద్యం అందుబాటులోకి రావాలని ఆయన మార్గ నిర్దేశంలో ఇంత గొప్ప విజయాన్ని సాధించాం. గత సంవత్సరం 8 కాలేజీలు ప్రారంభించి తెలంగాణ కొత్త రికార్డు సృష్టిం చింది. ఈ సంవత్సరం మన రికార్డును మనమే అధిగమించాం. ఈ ఏడాది దేశ వ్యాప్తంగా ప్రభుత్వ రంగంలో అందుబాటులోకి వచ్చిన ఎంబీబీఎస్ సీట్లలో తెలంగాణ వాటా 43 శాతం. ఇది గొప్ప రికార్డు. దేశంలోని మిగితా 27 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు కలిపి 57 శాతం సీట్లు మాత్రమే అందుబాటులోకి తెచ్చాయని హరీశ్‌రావు తెలిపారు.

**తెలంగాణ దేశానికే దిక్సూచిగా నిలిచింది..** మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ, కాళేశ్వరం, పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు, 24 గంటల విద్యుత్తు సరఫరా, జిల్లాకో మెడికల్ కాలేజీ, రైతుబంధు వంటి కార్యక్రమాలతో మన రాష్ట్రం దేశానికే దిక్సూచిగా నిలిచిందని హరీశ్‌రావు పేర్కొన్నారు. ఒకప్పుడు బెంగాల్ ఆలోచిస్తుంది.. దేశం అచరిస్తుంది అనే నానుడి ఉండేది. దాన్ని తిరగరాసిన ఘనత సీఎం కేసిఆర్‌ది. ప్రతి జిల్లాకు ఒక ప్రభుత్వ మెడికల్ కాలేజీ అని సీఎం కేసీఆర్ సంకల్పిస్తే.. దేశం మొత్తం అదే దారిలో నడుస్తున్నది. ఇప్పుడు తెలంగాణ అచరిస్తుంది.. దేశం అనుసరిస్తుంది అన్నంత గొప్పగా రాష్ట్రాన్ని సీఎం కేసీఆర్ ముందుకు తీసుకెళ్తున్నారు. ఉద్యమించి రాష్ట్రాన్ని సాధించుకోవడమే కాదు.. సాధించుకున్న రాష్ట్రాన్ని దేశానికే ఆదర్శంగా నిలిపిన ఘనత సీఎం కేసీఆర్‌ది. ఈరోజు అడ్మిషన్లు పొందిన వైద్య విద్యార్థులకు శుభాకాంక్షలు. ఇంత గొప్ప పవిత్ర యజ్ఞంలో నాకూ భాగస్వామ్యం కల్పించినందుకు సీఎం కేసీఆర్ కు హృదయ పూర్వక ధన్యవాదాలు. నమస్కారం తెలుపుతూ హరీశ్‌రావు తన ప్రసంగాన్ని ముగించారు.

# ఎమ్మెల్సీ కవితకు 26 వరకు సమన్లు జారీ చేయొద్దు.. ఈడీకి సుప్రీం ఆదేశం..



న్యూఢిల్లీ : బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితకు సుప్రీంకోర్టులో ఊరట లభించింది. ఎమ్మెల్సీ కవితకు ఈ నెల 26వ తేదీ వరకు సమన్లు జారీ చేయొద్దని ఈడీని సుప్రీంకోర్టు ఆదేశించింది. నళినీ చిదంబరం తరహాలోనే తమకూ ఊరట కల్పించాలని కోర్టును కవిత కోరారు. కవిత పిటిషన్‌పై సుప్రీంకోర్టు ధర్మాసనం ఈడీ న్యాయవాది స్పందన కోరింది. తమకు అభ్యంతరం లేదని అదనపు సొలిసిటర్ జనరల్ కోర్టుకు తెలిపారు. ఈ నేపథ్యంలో సెప్టెంబర్ 26వ తేదీ వరకు సమన్లు జారీ చేయొద్దని జస్టిస్ కౌల్ ధర్మాసనం ఆదేశించింది. ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితకు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) మరోసారి నోటీసులు ఇచ్చిన సంగతి తెలిసిందే. శుక్రవారం విచారణకు హాజరు కావాలని ఆ నోటీసుల్లో ఈడీ పేర్కొంది. దర్యాప్తు సంస్థలు మహిళలను ఇంటివద్దే విచారించాలని, సమయపాలన పాటించాలని కోరుతూ కవిత సుప్రీంకోర్టులో వేసిన పిటిషన్‌పై విచారణ ఇంకా కొనసాగుతున్నది. ఈడీ ముందు కవిత ఇప్పటికే మూడుసార్లు హాజరై విచారణ ఎదుర్కొన్నారు. ఆమెకు వ్యతిరేకంగా ఇంతవరకు ఎటువంటి ఆధారాలను చూపలేకపోయినా మరోసారి నోటీసులు జారీ చేయడం వెనుక రాజకీయ కక్ష సాధింపు ఉన్నట్టు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ నెల 17న కేంద్ర మంత్రి అమిత్‌షా రాష్ట్రానికి వస్తున్నారు. తెలంగాణ ప్రభుత్వాన్ని విమర్శించడానికి ఆయనకు వేరే ఇతర అంశాలు లేకపోవడంతో ఈడీ ముందు కవిత హాజరును ఒక అస్త్రంగా మార్చుకొనేందుకే ఆమెకు నోటీసులు ఇప్పించినట్టు రాజకీయ విశ్లేషకులు వ్యాఖ్యానిస్తున్నారు. ఎమ్మెల్సీ కవిత కూడా ఇవి పొలిటికల్ నోటీసులని, పెద్దగా పట్టించుకోనవసరం లేదని తేలికగా తీసిపారేశారు.

# దొంగమాటలతో ప్రజలను మోసం చేస్తోన్న కేసీఆర్



నిజామాబాద్: తెలంగాణలో ప్రారంభించిన మెడికల్ కళాశాలకు కేంద్ర ప్రభుత్వంగ్రాంట్ ఇచ్చిందని ఎంపీ ధర్మపురి అరవింద్ వ్యాఖ్యానించారు. శుక్రవారం నాడు బీజేపీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. మెడికల్ కళాశాలకు 332.3కోట్లను కేంద్రప్రభుత్వం గ్రాంట్ ఇచ్చింది... వాటితోనే రాష్ట్ర ప్రభుత్వం మెడికల్ కళాశాలలు నిర్మించింది. తామే కట్టినట్టు ముఖ్యమంత్రి కేసీఆర్ సంకలు గుద్దుకుంటున్నారు. వైద్యుల సంఖ్యను పెంచాలని కేంద్ర ప్రభుత్వం ఎప్పుడో నిర్ణయం తీసుకుంది. తెలంగాణలో ఏర్పాటు చేస్తున్న మెడికల్ కళాశాలలకు కేసీఆర్ నయాపైస చేసింది లేదు.రాష్ట్రం లో మెడికల్ కళాశాలలో టీచింగ్ స్టాఫ్ పై వైట్ పేపర్ రిలీజ్ చేయాలి.ఉస్మానియా ఆస్పత్రి నూతన బిల్డింగ్ ఎందుకు కట్టలేదు.కేసీఆర్ అన్ని దొంగమాటలతో ప్రజలను మోసం చేస్తున్నారు.ఏ మొహం పెట్టుకుని కేంద్ర ప్రభుత్వం పైసా ఇవ్వలేదని చెబుతారని ఎంపీ ధర్మపురి అరవింద్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

# సూర్యాపేటను పర్యావరణహిత పట్టణంగా తీర్చిదిద్దుకుందాం: మంత్రి జగదీష్‌రెడ్డి

సూర్యాపేట: ఎప్పటిలాగే ఈ వినాయక చవితికి కూడా మట్టి విగ్రహాలను పెట్టుకుని పూజించడం ద్వారా పర్యావరణ పరిరక్షణకు పాటుపడుదామని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీష్ రెడ్డి పిలుపునిచ్చారు. సూర్యాపేటను పర్యావరణహితమైన పట్టణంగా తీర్చిదిద్దుకుందామని చెప్పారు. వినాయక నవరాత్రి పూజలను పురస్కరించుకుని సూర్యాపేట మున్సిపాలిటీ ఆధ్వర్యంలో గణేష్ ఉత్సవ కమిటీలకు ఇవాళ మట్టి విగ్రహాలను అందజేశారు. మంత్రి గుంటకండ్ల జగదీష్ రెడ్డి సమక్షంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. తడి, పొడి చెత్తలో సూర్యాపేటకు ఇప్పటికే జాతీయ స్థాయి గుర్తింపు దక్కిందని చెప్పారు. ప్లాస్టిక్ నివారణ విషయంలో కూడా సూర్యాపేట ముందుండాలన్నారు. ప్రపంచవ్యాప్తంగా మానవాళికి ప్లాస్టిక్‌తో ముప్పు పొంచి ఉన్నదని, ప్లాస్టిక్ నివారణ కోసం మనం చేయగలిగిన మేలు చేయాలని మంత్రి సూచించారు. ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్‌తో చేసిన వినాయక విగ్రహాల నిమజ్జనం వల్ల నీరు కాలుష్యం అవుతుందని, ఆ నీటితో అనేక అనారోగ్య సమస్యలు వస్తాయని మంత్రి తెలిపారు. ప్లాస్టిక్ వ్యర్థాల వల్ల నీరు, భూమి, గాలి కలుషితమై క్యాన్సర్ వ్యాధులు వస్తాయని, అందుకే మట్టి విగ్రహాలు పెట్టుకోవాలని శాస్త్రవేత్తలు చెబుతున్నారని ఆయన పేర్కొన్నారు. గత తొమ్మిది సంవత్సరాలుగా సూర్యాపేట మున్సిపాలిటీ ఆధ్వర్యంలో మట్టి విగ్రహాల పంపిణీ జరుగుతున్నదని చెప్పారు. ఉత్సవ కమిటీలు విధిగా మట్టి విగ్రహాలను పూజించాలని మంత్రి కోరారు. సూర్యాపేట మున్సిపాలిటీతోపాటు ఇంటిగ్రేటెడ్ మార్కెట్లలో అందుబాటులో ఉన్న మట్టి విగ్రహాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. కొత్తగా సీడ్ విగ్రహాలను తయారు చేశారని, ఈ విగ్రహాలను ఇండ్లలో పూజించి భూమిలో నాటితే మొక్కలుగా పెరుగుతాయని, అలా చేస్తే పర్యావరణానికి ఎంతో మేలు చేసిన వారవుతారని మంత్రి పేర్కొన్నారు.




సిరిసిల్ల: అటు అమ్మ కోరికను, ఇటు నాన్న కోరికను తీర్చలేకపోయానని చివరికి రాజకీయ నాయకుడినయ్యానని మంత్రి కేటీఆర్ అన్నారు. సిరిసిల్లలో ఏర్పాటు చేసిన వైద్య కళాశాల ప్రారంభోత్సవంలో మంత్రి పాల్గొన్నారు.ఈ సందర్భంగా తెలంగాణలో ఏటా 10వేల సీట్లు అందుబాటులోకి వచ్చాయన్నారు. " నేను కూడా బైపీసీ విద్యార్థినే. మా నాన్న నన్ను ఐఏఎస్ చేయాలని అనుకునేవారు. మా అమ్మకు నన్ను డాక్టర్ చేయాలన్న కోరిక ఉండేది. ఎంసెట్‌లో 1600 ర్యాంక్ సాధించినా ఎంబీబీఎస్ సీటు రాలేదు. ఇప్పుడు అటు ఇటు కాకుండా రాజకీయ నాయకుడినయ్యాను. నేను 2009లో సిరిసిల్ల ఎమ్మెల్యేగా ఎన్నికయినప్పుడు ఇక్కడ ఒక డిగ్రీ కాలేజీ ఏర్పాటు కొసం గొడవ జరిగింది. డిగ్రీ కాలేజీ సిరిసిల్ల ,వేములవాడలో పెట్టాలని గొడవ జరిగి అటుఇటు కాకుండా మధ్యలో పెట్టారు. అలాంటిది నేడు సిరిసిల్లకు జేఎన్‌టీయూ, మెడికల్ కాలేజీ, అగ్రికల్చర్ కాలేజీ వచ్చాయి. వైద్య వృత్తి అత్యంత పవిత్రమైనది. పేదలకు సేవ చేసేందుకు మంచి శిక్షణ పొందండి. ఆపదలో వచ్చే వాళ్లు అటు దేవుణ్ణి ఇటు వైద్యులైన మిమ్మల్నే వేడుకుంటారు." అంటూ వైద్య విద్యార్థులకు కేటీఆర్ శుభాకాంక్షలు తెలియజేశారు.

# కవితకు ఈడీ నోటీసులపై రాములమ్మ ట్వీట్.. పొలిటికల్ సర్కిల్స్‌లో చర్చ




హైదరాబాద్: ఢిల్లీ లిక్కర్ స్కామ్‌లో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవితకు ఈడీ నోటీసులు ఇవ్వడంపై బీజేపీ నేత విజయశాంతి ట్విట్టర్ వేదికగా స్పందించారు. ఎమ్మెల్సీ కవిత అరెస్ట్‌ను తాము కోరుకోవడం లేదని తెలిపారు. రాజకీయంగా ఆ.. అవసరం కూడా బీజేపీకి లేదని స్పష్టం చేశారు. సాటి ఆడబిడ్డకు ఎలాంటి కష్టం రాకూడదని సానుభూతి వ్యక్తం చేశారు. ఇది తన వ్యక్తిగత అభిప్రాయమని కూడా రాములమ్మ తెలిపారు. కవిత అరెస్ట్ కానంత మాత్రానా.. బీజేపీ, బీఆర్ఎస్ ఒక్కటి కాదన్నారు. అయితే బీఆర్ఎస్‌పై ఆ పార్టీ అధినేతపై విమర్శలు గుప్పించే విజయశాంతి ఒక్కసారిగా కవితకు ఈడీ నోటీసులపై కూల్‌గా రియాక్షన్ ఇవ్వడం పొలిటికల్ సర్కిల్స్‌లో తీవ్రమైన చర్చకు దారి తీసింది.

**విజయశాంతి ట్వీట్ ఇదే..** "ఎమ్మెల్సీ కవిత అరెస్ట్ కావాలని కోరుకోవడం రాజకీయంగా బీజేపీకి అవసరం కాదు... ఆ ఆవశ్యకత కూడా లేదు. దేశంలోని అనేక రాష్ట్రాలలోని ఆయా సమస్యలపై నిర్దేశించబడ్డ ప్రభుత్వ సంస్థలైన ఈడీ, సీబీఐలు తమ నిర్వహణ చేస్తాయి. ఎంఐఎం ప్రేరేపిత ధోరణి కలిగిన కొందరు కవిత అరెస్ట్ కానట్లు అయితే... బీజేపీ, బీఆర్ఎస్ ఒక్కటే అన్న భావంతో బీఆర్ఎస్‌కు వ్యతిరేకంగా ఓటు చెయ్యవచ్చున్న భయం బీఆర్ఎస్‌కు ఉందేమో గానీ... జాతీయవాద బీజేపీకి ఆ ఆలోచనా ధోరణి ఉండదు. గతంలో ఒకసారి అప్రూవర్‌గా ఉండి.. మళ్లీ కిలాఫ్‌గా మారి.. తిరిగి ఈ రోజు అప్రూవర్‌గా మారుతున్నోళ్లు బీఆర్ఎస్ ప్రోద్భలంతోనే ఇయ్యన్నీ చేస్తున్నారనే అభిప్రాయం వినవస్తున్నది. ఇక, ఒక ఆడబిడ్డకు కష్టం రావద్దు... ఆరోపణలున్న ఏ ఆడబిడ్డ అయినా నిర్దోషులుగానే ఎప్పుడూ నిలవాలని మాత్రం వ్యక్తిగతంగా రాములమ్మ ఎన్నటికీ కోరుకుంటాది" అంటూ రాములమ్మ ట్వీట్ చేశారు.

# సీఎల్పీ నేత భట్టి ఘాటు వ్యాఖ్యలు... ఆయన ఏమన్నారో తెలిస్తే...



ముదిగొండ(ఖమ్మం): 'హరీష్ రావు.. ఖమ్మం జిల్లా నీ జాగీరు కాదు... కేసీఆర్‌ది అంతకన్నా కాదు. ఇది ఎంతో చైతన్యవంతమైన జిల్లా. దొరల జిల్లా కాదు. ఇది సిద్ధిపేట కాదు. మీ ఇష్టం వచ్చినట్లు ఇక్కడి ప్రజలు, మిగతా రాజకీయ పార్టీల గురించి మాట్లాడటం సరికాదు. నువ్వు ప్రారంభోత్సవానికో.. శంకుస్థాపనకో వచ్చిపోతావ్.. నీకు ఏంతెలుసు ఇక్కడి రాజకీయం గురించి. నీకిచ్చిన ఉద్యోగాన్ని సక్రమంగా చేసుకో..' అంటూ సీఎల్పీ నేత, ఖమ్మం జిల్లా మధిర ఎమ్మెల్యే మల్లు భట్టి విక్రమార్క.. వైద్య ఆరోగ్యశాఖ మంత్రి తన్నీరు హరీష్ రావుపై ఘాటు వ్యాఖ్యలు చేశారు. హరీష్ రావు తన ఖమ్మంజిల్లా పర్యటనలో కాంగ్రెస్ పార్టీపై చేసిన వ్యాఖ్యలను భట్టి విక్రమార్క తీవ్రంగా ఖండించారు. ఖమ్మంజిల్లా ముదిగొండ మండలం వెంకటాపురంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మాట్లాడితే 90సీట్లు తమవేనంటున్నారని, కానీ తెలంగాణ ప్రజల తీర్పు మరోలా ఉండబోతోందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని ఆసుపత్రుల్లో డాక్టర్, నర్సుల పోస్టులు ఖాళీగా ఉన్నాయని, వాటిని భర్తీ చేయాలని, ఇప్పటికే ప్రజలు వైద్యసేవలకు ఇబ్బందులు పడుతున్నారన్నారు. హరీష్ తనకు ఇచ్చిన ఉద్యోగాన్ని సరిగ్గా చేయాలని, ఇష్టం వచ్చినట్లు ఆయన మాట్లాడటం సరికాదని, ఆయన వల్ల ఖమ్మం జిల్లా ప్రజలకు ఒరిగిందేమీ లేదని విమర్శించారు. తెలంగాణ ప్రజలు పోరాడి సాధించుకున్న ప్రజాస్వామ్య రాష్ట్రమని, ఎవరి ఇష్టం వచ్చినట్లు మాట్లాడటం సబబు కాదన్నారు. అనంతరం ముదిగొండ మండలం పెద్దమండవ జోన్ బూత్‌స్థాయి సమావేశానికి హాజరైన భట్టి కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, టీపీసీసీ సభ్యుడు రాయల నాగేశ్వరరావు, కొమ్మినేని రమేషబాబు, మందరపు నాగేశ్వరరావు, పసుపులేటి దేవేంద్రం, కందిమళ్ల వీరబాబు, బుచ్చిరామయ్య, అజయ్, పలువురు మండల నాయకులు పాల్గొన్నారు.

# నిలోఫర్ ఆస్పత్రిలో దారుణం.. ఆరు నెలల చిన్నారిని ఎత్తుకెళ్లిన దుండగులు




హైదరాబాద్: నిలోఫర్ ఆస్పత్రిలో దారుణం జరిగింది. గుర్తు తెలియని వ్యక్తులు ఆస్పత్రి నుంచి ఆరు నెలల చిన్నారి ఫైజల్ ఖాన్‌ను ఎత్తుకెళ్లారు. ఆస్పత్రిలో ఈ ఘటన తీవ్ర కలకలం రేపుతోంది. తప్పి పోయిన బాలుడి తల్లి భోజనం కోసం వెళ్లిన సమయంలో ఈ ఘటన జరిగింది. ఘటనపై బాధితురాలు నాంపల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఆస్పత్రిలోని సీసీ కెమెరాల ఫుటేజ్ ఆధారంగా దర్యాప్తు కొనసాగిస్తున్నారు. అయితే, బాలుడు ఫైజల్ ఖాన్ మిస్సయిన ట్రీట్‌మెంట్ వార్డులో సీసీ కెమెరా లేకపోవడం పోలీసుల దర్యాప్తునకు కొంచెం ఆటంకంగా మారింది. కాగా, బాలుడి తల్లి నుంచి ఓ మహిళ ఫైజల్‌ఖాన్‌ను తీసుకుని ఎత్తుకున్నదని, ఆమె భోజనానికి వెళ్లి తిరిగొచ్చే సరికి బాలుడితో సహా సదరు మహిళ పరారయ్యిందని తెలుస్తున్నది. ఘటనకు సంబంధించిన కచ్చితమైన వివరాలు తెలియాల్సి ఉందని పోలీసులు చెబుతున్నారు. తన బిడ్డకు అనారోగ్యంగా ఉండటంతో గురువారం ఆస్పత్రికి తీసుకొచ్చామని, రాత్రి అకస్మాత్తుగా తన కొడుకు కనిపించకుండా పోయాడని బాలుడి తండ్రి, గండిపేట ప్రాంతానికి చెందిన సల్మాన్ ఖాన్ పోలీసులకు చేసిన ఫిర్యాదులో పేర్కొన్నాడు.

# హీరో నవదీప్‌కు నార్కోటిక్ పోలీసుల నోటీసులు?

హైదరాబాద్: డ్రగ్స్ కేసులో పోలీసుల దర్యాప్తు కొనసాగుతోంది. ఇప్పటికే డ్రగ్స్ వాడిన పలువురు నిందితులను పోలీసులు రిమాండ్‌కు తరలించారు. ఇక డ్రగ్స్ కేసు విచారణలో భాగంగా హీరో నవదీప్‌కు కూడా నార్కోటిక్ పోలీసులు నోటీసులు జారీ చేయనున్నారని తెలుస్తోంది. పోలీసులకు అందుబాటులోనే ఉన్నానని నవదీప్ గురువారం తెలిపిన విషయం విధితమే. మరోవైపు షాడో సినిమా యూనిట్‌మెన్ ఉప్పలపాటి రవి ఇంకా పరారీలోనే ఉన్నట్టు తెలుస్తోంది. ఇదిలావుండగా డ్రగ్స్ అరికట్టడమే లక్ష్యంగా పలు పబ్బులపైనా నార్కోటిక్ పోలీసుల నిఘా పెట్టారు. గచ్చిబౌలిలోని స్నార్ట్ పబ్, జూబ్లీహిల్స్‌లోని టెర్రా కేఫ్ అండ్ బిస్ట్రోలో డ్రగ్స్ విక్రయాలపై ఆరా తీస్తున్నారు. పరారీలో ఉన్న మోడల్ శ్వేత కోసం నార్కోటిక్ పోలీసుల గాలిస్తున్నారు. కేపీ చౌదరి లిస్ట్‌లోనూ మోడల్ శ్వేతా పేరు ఉండడం గమనార్హం. మరోవైపు ఈవెంట్ ఆర్గనైజర్ కలహార్ రెడ్డి కోసం నార్కోటిక్ పోలీసుల వేటాడుతున్నారు. కేపీ చౌదరి లిస్ట్‌తో పాటు గతంలో బెంగళూరు డ్రగ్స్ కేస్‌లోనూ కలహార్ రెడ్డి పేరు ఉండడం గమనార్హం.

**పబ్బుల మాటున డ్రగ్స్ విక్రయాలు :** పబ్బుల మాటున డ్రగ్స్ విక్రయాలు జరుగుతున్నట్టుగా తాజా పరిణామాలనుబట్టి స్పష్టమవుతోంది. మాదాపూర్ డ్రగ్స్ కేసులో పబ్బుల బాగోతాలు ఒక్కొక్కటిగా బయటపడుతుండడం ఇందుకు తార్కాణంగా నిలిచింది. హైటెక్స్‌లోని స్నాట్ పబ్‌లో డ్రగ్స్ విక్రయిస్తున్నట్లుగా పోలీసులు గుర్తించారు. ప్రస్తుతం స్నాట్ పబ్ ఓనర్ సూర్య పరారీలో ఉన్నాడు. పబ్‌కి వచ్చే కస్టమర్లకు సూర్య డ్రగ్స్ విక్రయిస్తున్నాడని బయటపడింది. జూబ్లీహిల్స్‌లోని టెర్రా కేఫ్ అండ్ బ్రిస్టో పబ్‌లోనూ డ్రగ్స్ విక్రయాలు జరిగాయి. దీంతో పబ్ ఓనర్ అర్జున్ పరారీలో ఉన్నాడని తెలుస్తోంది. సూర్య, అర్జున్‌ల కోసం పోలీసుల ముమ్మరంగా గాలిస్తున్నారు. న్యూసెన్స్‌కి కేరాఫ్ అడ్రస్‌గా స్నాట్ పబ్ మారిందనే ఆరోపణలున్నాయి. గతంలోనూ పలు కేసులు నమోదయ్యాయి. 2 నెలల పాటు స్నార్ట్ పబ్ సీజ్‌లోనే ఉంది. అయినప్పటికీ తీరు మార్చుకోలేదు. ఇప్పటివరకు డ్రగ్స్ కన్సూమింగ్ అడ్డాలుగా ఉన్న పబ్స్ ఇప్పుడు డ్రగ్స్ విక్రయ కేంద్రాలుగా మారడం ఆందోళన కలిగిస్తోంది.

Printed, Published and owned by VISHWANATH V, Printed at S A Printers D No 3 92 Shed No 2, Sy No 45 and 49, Sadashiv Nagar Narapally Village, Ghatkesar Mandal, Medchal - Malkajgiri District, Telangana - 501301. and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State.
Editor : VISHWANATH V, Rni Title Code No. TELTEL02115, Phone No. 8977598262, Email Id : reportervishwanath@gmail.com